


ESTD: 1999
www.voodayam.com

# వుదయం

కరీంనగర్ 09-06-2026 మంగళవారం | సంపుటి : 14 | సంచిక :173
SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY
రూ. 4.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily
Simultaneously Published from Karimnagar, Hyderabad, Adilabad, Khammam, Guntur & Warangal
Follow us on




## హైదరాబాద్ పేదలకు

# లక్ష ఇళ్లు

- పాలనా సమన్వయం కోసమే మూడు కార్పొరేషన్లు
- ఢిల్లీలా కాలుష్య నగరంగా మారొద్దు!
- బీజేపీ ఎంపీలు తెలంగాణకు ఏం తెచ్చారు?
- మహానగరంలో పేదలకు లక్ష ఇళ్లు..



**హైదరాబాద్ , జూన్ 8 (ఎఎంస్) :**
"తెలంగాణలో పదేళ్ల కేసీఆర్ పాలన, కేంద్రంలో పన్నెండేళ్ల మోదీ పాలన, రాష్ట్రంలో మా 30 నెలల పాలనపై బహిరంగ చర్చకు నేను సిద్ధం. ఎవరేం చేశారో.. ఎవరు ఎన్ని నిధులు తెచ్చారో తేల్చుకుందాం రండి" అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. సైబరాబాద్‌లో రూ. 1,674.74 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు మౌలిక వసతుల అభివృద్ధి పనులకు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే 24 నెలల పాటు తమ ప్రభుత్వం కేవలం అభివృద్ధిపైనే దృష్టి పెడుతుందని స్పష్టం చేశారు.

పాలనా సమన్వయం కోసమే మూడు కార్పొరేషన్లు
ఔటర్ రింగు రోడ్డు (ORR) లోపల నివసిస్తున్న 1.34 కోట్ల మంది ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, పాలనా సమన్వయం కోసమే మూడు కొత్త కార్పొరేషన్లను ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. "ఎన్నికలకు ఆరు నెలల ముందు మాత్రమే రాజకీయాలు మాట్లాడుకుందాం.. ఈ రెండేళ్లు రాజకీయాలకు అతీతంగా కలిసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందాం" అని ఆయన పిలుపునిచ్చారు. దేశ ఐటీ ఎగుమతుల్లో హైదరాబాద్ వాటా 16.77 శాతంగా ఉందంటూ భాగ్యనగర ప్రాధాన్యతను గుర్తుచేశారు.

ఢిల్లీలా కాలుష్య నగరంగా మారొద్దు!
దేశ ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్న ఆరు ప్రధాన నగరాల్లో హైదరాబాద్ అత్యంత నివాసయోగ్యమైన నగరంగా ఉందని సీఎం రేవంత్ అన్నారు. "కాలుష్యం వల్ల దేశ రాజధాని ఢిల్లీలో స్కూళ్లతో పాటు ప్రధానమంత్రి కార్యాలయాన్నే మూసివేయాల్సి వచ్చింది. మన హైదరాబాద్‌కు అలాంటి సమస్యలు రాకుండా భవిష్యత్తు తరాల కోసం మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలో నిపుణుల కమిటీని వేసి ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం" అని సీఎం వివరించారు.

## సగానికి పైగా

# ఎంపీలు అవుట్



**కోల్‌కతా/న్యూఢిల్లీ (ఎఎంస్) :**
పశ్చిమ బెంగాల్ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. అధికార తృణమూల్ కాంగ్రెస్ (TMC) పార్టీలో గత కొంతకాలంగా నలుగుతున్న అంతర్గత విభేదాలు ఒక్కసారిగా బద్దలయ్యాయి. లోక్‌సభలోని 20 మంది టీఎంసీ ఎంపీలు మమతా బెనర్జీ సర్కారుకు షాక్ ఇస్తూ.. కేంద్రంలోని అధికార ఎన్డీయే (NDA) కూటమికి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ పరిణామం జాతీయ రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టిస్తోంది.
స్పీకర్ ఓం బిర్లాకు రెబల్స్ లేఖ
టీఎంసీ సీనియర్ నేత, ఎంపీ కకోలీ ఘోష్ దస్తీదార్ నేతృత్వంలోని తిరుగుబాటు ఎంపీల బృందం సోమవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి ఈ మేరకు ఒక అధికారిక లేఖను సమర్పించింది. "లోక్‌సభలో పార్టీ చీఫ్ విప్‌గా ఉన్న నేను.. తోటి ఎంపీలందరితో విస్తృతంగా సంప్రదింపులు జరిపిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నాను. ప్రజల తీర్పును గౌరవిస్తూ, వారు ఎన్నుకున్న కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసి బెంగాల్ అభివృద్ధికి తోడ్పడాలనేదే మా బృందం ఉద్దేశం" అని కకోలీ ఘోష్ స్పష్టం చేశారు. ఈ ఆకస్మిక పరిణామంపై మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ అధిష్టానం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.
8 మందికే పరిమితమైన దీదీ సేన
ఈ భారీ చీలికతో లోక్‌సభలో తృణమూల్ కాంగ్రెస్ బలం ఒక్కసారిగా పడిపోయింది. 20 మంది ఎంపీలు తిరుగుబాటు చేయడంతో, ఇప్పుడు లోక్‌సభలో మమతా బెనర్జీ పక్షాన కేవలం ఎనిమిది మంది సభ్యులు మాత్రమే మిగిలారు. యావత్ దేశవ్యాప్తంగా విపక్ష కూటమికి ఇది పెద్ద ఎదురుదెబ్బగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.
అసెంబ్లీలోనూ అదే దారి..
సుఖేందు శేఖర్ రాయ్ రాజీనామా
ఇటు ఢిల్లీలోనే కాకుండా, అటు కోల్‌కతాలోనూ టీఎంసీకి గండం పొంచి ఉంది. బెంగాల్ శాసనసభలోనూ టీఎంసీ ఎమ్మెల్యేలు ఇప్పటికే రెండు వర్గాలుగా విడిపోయారు. రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని 58 మందికి పైగా తిరుగుబాటు ఎమ్మెల్యేల బృందం 'తామే నిజమైన తృణమూల్' అని ప్రకటించుకోవడం గమనార్హం. మరోవైపు, పార్టీలో జరుగుతున్న ఈ పరిణామాలపై తీవ్ర అసంతృప్తితో ఉన్న టీఎంసీ సీనియర్ నేత, రాజ్యసభ ఎంపీ సుఖేందు శేఖర్ రాయ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు.

# తెలంగాణలో 'నాలెడ్జ్' విప్లవం



- సంక్షేమ రాజ్య నిర్మాణం.. ప్రజాప్రభుత్వ లక్ష్యం
- రూ.110 కోట్లతో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్
- రూ. 25 కోట్లతో ఎస్సీ హాస్టల్!
- ప్రజా ప్రభుత్వ వినూత్న సంకల్పం

**హైదరాబాద్ / ఉప్పల్, జూన్ 8 (ఎఎంస్) :**
ప్రజా ప్రభుత్వం తెలంగాణలో సంక్షేమ రాజ్యం నిర్మించేదిశగా కృత నిశ్చయంతో పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మరోసారి స్పష్టంగా ప్రకటించారు. లోయర్ ట్యాంక్ బండ వద్ద రూ.110 కోట్ల అంచనాలతో నిర్మించనున్న బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్, నింబోలి అడ్డా వద్ద రూ. 25 కోట్ల అంచనాలతో నిర్మించనున్న ఎస్సీ హాస్టల్ కు సబంధించి స్థల పరిశీలన అనంతరం ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఈ రెండు భవనాలకు సంబంధించి ఆర్థిక, పాలనపారమైన అనుమతులు మంజూరయ్యాయని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ భవనాలు కేవలం భౌతికంగా కనపడేటువంటి ఒక కట్టడాలు మాత్రమే కాదు.. వేలాదిమంది విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగపడే ఆధునిక దేవాలయాలని ఆయన అన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకుల కోచింగ్ కష్టాలను శాశ్వతంగా దూరం చేయాలన్నదే ప్రజా ప్రభుత్వ బలమైన సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. ట్యాంక్‌బండ్ వద్ద నిర్మించ తలపెట్టిన 'డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్' స్థలాన్ని, ఆ తర్వాత కాచిగూడలోని 'నింబోలిఅడ్డా హాస్టల్' ప్రాంగణాన్ని సంక్షేమ శాఖా మంత్రి అడ్లూరి లక్షణ్ కుమార్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఉప ముఖ్యమంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ను ట్యాంక్‌బండ్ దగ్గర సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్, మరో 10 అంతస్తులతో నిర్మించనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. అవతేకాక నింబోలిఅడ్డా వద్ద మూడు అంతస్తులతో హాస్టల్ భవనాల నిర్మాణం దళిత, నిరుపేద వర్గాల చిరకాల వాంఛ అని చెప్పారు. ఈ భవనాలను నిర్మించడం ద్వారా రాష్ట్రంలో జ్ఞానం పొందాలనుకునే అందరికీ పెద్ద ఎత్తున ఉపయోగపడతాయని చెప్పారు. ఈ భవనాల నిర్మాణంకు సంబంధించి ప్రతిపాదనలు పంపిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఫైనాన్స్ క్లియరెన్స్ చేసి పంపించడం జరిగిందన్నారు.
నాలెడ్జ్ సెంటర్ లో స్టడీ సర్కిల్స్, డిజిటల్ లైబ్రరీ, కాన్ఫరెన్స్ హాల్స్ లో విజ్ఞానాన్ని పంచే అత్యుత్తమ వేదికలగా నిలుస్తాయనే అశాభవాన్ని ఆయన వ్యక్తం చేశారు.

# దుబాయ్‌లో పలువురు భారతీయులు మృతి

**దుబాయ్:** జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు భారతీయ కార్మికులు మృతి చెందారు. మరికొందరు గాయపడ్డారు. రోడ్డు మధ్యలో ఆగిపోయిన ఓ ట్రక్కును మినీబస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ట్రక్కులో సాంకేతిక లోపం తలెత్తడంతో రహదారిపై ఆగిపోయింది. ఆ వెనకే వచ్చిన మినీ బస్సు దాన్ని ఢీకొనడంతోనే ఈ ప్రమాదం జరిగిందని ఓ పోలీసు అధికారి తెలిపారు. ఈ ఘటనలో ఏడుగురు చనిపోగా.. అందులో కొందరు భారతీయులున్నారు. దుబాయ్‌లోని భారత రాయబార కార్యాలయం ఈ ఘటనపై సంతాపం వ్యక్తం చేసింది. క్షతగాత్రులను తమ అధికారులు ఆసుపత్రిలో పరామర్శించినట్లు తెలిపింది. వారికి అవసరమైన సహాయం అందిస్తామని పేర్కొంది.




# భేదాలు పక్కన పెట్టి.. కలిసి సాగుదాం


- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సిందే!
- ఆగస్టులో హైదరాబాద్ వేదికగా తదుపరి భేటీ
- సమావేశానికి ఆప్, డీఎంకే దూరం

**న్యూఢిల్లీ జూన్ 8 (ఎఎంస్) :**
కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ప్రజా సమస్యలపై ఐక్యపోరాటం చేయాలని విపక్ష 'ఇండియా' కూటమి నిర్ణయించింది. దిల్లీలో జరిగిన కూటమి నేతల కీలక సమావేశంలో అంతర్గత విభేదాలను పక్కన పెట్టి, ఏకతాటిపై ముందుకు సాగాలని పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మిత్రపక్షాలు ఒకరినొకరు బహిరంగంగా విమర్శించుకోకుండా, పరస్పర సమన్వయంతో కదలాలని నేతలు ఏకగ్రీవంగా తీర్మానించారు.
కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సిందే!
దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, సీబీఎస్ఈ వ్యవహారాలపై ఈ సమావేశంలో విపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని కూటమి నేతలు డిమాండ్ చేశారు. ఈ భేటీలో ప్రధానంగా చర్చించిన అంశాలు: ఎస్ఐఆర్ ప్రక్రియ, ఎన్నికల్లో ఓట్ల దోపిడీ అంశాలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాయాలని నిర్ణయించారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, నిత్యావసరాల ధరల పెరుగుదల, దేశ ఆర్థిక అనిశ్చితిపై చర్చించేందుకు తక్షణమే 'అఖిలపక్ష సమావేశం' ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
ఆగస్టులో హైదరాబాద్ వేదికగా తదుపరి భేటీ
రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వంపై ఉమ్మడి వ్యూహంతో దాడి చేయాలని విపక్షాలు నిశ్చయించాయి. సభలో ప్రజాసమస్యలపై గళమెత్తేందుకు అన్ని పార్టీలు ఏకతాటిపైకి రానున్నాయి. ఇకపై కేవలం ఎన్నికలప్పుడే కాకుండా, ప్రతి రెండు నెలలకోసారి సమావేశమై విపక్షాల ఐక్యతను చాటాలని నేతలు నిర్ణయించారు. ఈ క్రమంలోనే 'ఇండియా' కూటమి తదుపరి మహాసమావేశాన్ని రాబోయే ఆగస్టు నెలలో హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు ప్రకటించారు.
సమావేశానికి ఆప్, డీఎంకే దూరం
కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో జరిగిన ఈ అత్యున్నత స్థాయి సమావేశంలో 22 విపక్ష పార్టీల నేతలతో పాటు స్వతంత్ర ఎంపీ కపిల్ సిబల్ పాల్గొన్నారు. తొలుత ఈ భేటీకి 25 పార్టీలు హాజరవుతాయని ఖర్గే ప్రకటించినప్పటికీ, కొన్ని కీలక పార్టీలు గైర్హాజరయ్యాయి. తమిళనాడు అధికార పక్షం డీఎంకే ఈ సమావేశానికి హాజరుకాలేదు. అలాగే తాము కూటమికి దూరంగా ఉంటామని ఆమ్ ఆద్మీ పార్టీ ఇప్పటికే స్పష్టం చేసింది.

## భగ్గుమన్న పశ్చిమాసియా

# కాల్పుల విరమణకు భారత్ పిలుపు

**టెల్ అవీవ్:**
ఇరాన్‌ఇజ్రాయెల్‌ల మధ్య చోటుచేసుకున్న పరస్పర దాడులతో పశ్చిమాసియా (Middle East) ప్రాంతం మరోసారి రణరంగంగా మారింది. ఈ తాజా పరిణామాలపై భారతదేశం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇరు దేశాలు తక్షణమే సంయమనం పాటించాలని, ఉద్రిక్తతలను తగ్గించుకుని శాంతియుత మార్గాల్లో సమస్యను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చింది.
ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం: భారత విదేశాంగ శాఖ
పశ్చిమాసియాలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందిస్తూ ఒక ప్రకటన విడుదల చేసింది. "పశ్చిమాసియా లో మళ్లీ ఉద్రిక్తతలు నెలకొనడం అత్యంత విచారకరం. ఈ పరిణామాలు అంతర్జాతీయ సమాజాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే వంద రోజులకు పైగా కొనసాగుతోన్న ఈ ఘర్షణల కారణంగా భారీగా ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లింది. దీని ప్రభావం కేవలం ఆ ప్రాంతానికే పరిమితం కాకుండా.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, అంతర్జాతీయ ఇంధన సరఫరాలపై తీవ్రంగా పడింది," అని భారత్ పేర్కొంది వెంటనే ఈ యుద్ధ వాతావరణానికి తెరదించాలని, పౌరుల రక్షణకు పెద్దపీట వేయాలని అన్ని పక్షాలను భారత్ కోరింది. ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాలు నెలకొనేలా దౌత్యపరమైన చర్చలను వీలైనంత త్వరగా ముగించాలని స్పష్టం చేసింది.
తక్షణమే కాల్పులు ఆపండి: అమెరికా అధ్యక్షుడు ట్రంప్
మరోవైపు పశ్చిమాసియాలో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్, ఇజ్రాయెల్ దేశాలు తక్షణమే పరస్పర దాడులను ఆపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన తన 'ట్రూత్ సోషల్' (Truth Social) ఖాతాలో ఒక పోస్ట్ చేస్తూ.. యుద్ధాన్ని ఆపడానికి ఇరుపక్షాలు చొరవ చూపాలని కోరారు.
చమురు ప్లాంట్లే లక్ష్యంగా ఇజ్రాయెల్ ప్రతిదాడులు
ఇటీవల లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడికి ప్రతీకారంగా.. ఇరాన్ ఆదివారం అర్ధరాత్రి నుంచి ఇజ్రాయెల్‌పై క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. దీంతో అప్రమత్తమైన ఇజ్రాయెల్ అంతే దీటుగా ప్రతిస్పందించింది. ఇరాన్‌లోని కీలకమైన మౌలిక సదుపాయాలు, చమురు ఉత్పత్తి కేంద్రాలు (Oil Plants) మరియు వ్యూహాత్మక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ వైమానిక దాడులకు తెగబడింది. ఈ పరిణామాలతో పశ్చిమాసియాలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని భీకర పరిస్థితులు నెలకొన్నాయి.





# రైతన్నలకు గుడ్ న్యూస్

- అందుబాటులో 27,203 మెట్రిక్ టన్నుల యూరియా రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దు యాప్ ద్వారా ప్రణాళికాబద్ధంగా పారదర్శకంగా యూరియా పంపిణీ కలెక్టర్ త్రిపాఠి



**నిజామాబాద్, జూన్ 08 :**
జిల్లాలో ఖరీఫ్ సీజన్ పంటల సాగు కోసం రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఎరువుల విషయంలో ఎవరు కూడా ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని కలెక్టర్ ఇలా త్రిపాఠి భరోసా కల్పించారు. జిల్లాలో ఎక్కడ కూడా యూరియా కొరత లేదని, రాష్ట్రంలోని ఇతర అన్ని జిల్లాల కంటే నిజామాబాద్ జిల్లాలోనే అత్యధిక స్థాయిలో 27,203 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రాంతాలలో రైతులకు ఎరువులు పంపిణీ జరిగేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని, పంట సాగు చేసే ప్రతి రైతుకు ఎరువులు అందేలా చూస్తామని అన్నారు. ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా, ఎరువులు పక్కదారి పట్టకుండా పారదర్శకమైన పంపిణీ కోసం యూరియా బుకింగ్ యాప్ దోహదపడుతోందని అన్నారు. ఈ యాప్ పనితీరును గమనించిన ఇతర రాష్ట్రాలు కూడా ఒక్క యూరియానే కాకుండా మిగతా అన్ని ఎరువులను కూడా బుకింగ్ యాప్ ద్వారానే రైతులకు అందిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ యాప్ ద్వారా ఆయా మండలాల్లో ఏ డీలర్ వద్ద యూరియా అందుబాటులో ఉంది అనే సమాచారం తెలుసుకునే వెసులుబాటు ఉందని, రైతులు సమీప డీలర్ల వద్ద పంట సాగు విస్తీర్ణానికి అనుగుణంగా అవసరమైన యూరియాను బుక్ చేసుకోవచ్చని సూచించారు. అంతే కాకుండా ప్రతీ సొసైటీ వద్ద, ప్రతీ డీలర్ షాప్ లో ఎరువుల నిల్వల వివరాలను తెలియజేసేలా స్టాక్ బోర్డులు ప్రదర్శించేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. నకిలీ, నాసిరకం ఎరువులు, విత్తనాలకు ఆస్కారం లేకుండా మండల స్పెషల్ ఆఫీసర్లతో పాటు తహసిల్దార్లు, ఇతర అధికారులతో నిరంతరం తనిఖీలు జరిపిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. రైతులు ఒకేసారి ఎరువులను కొనుగోలు చేసి అట్టి పెట్టుకోకుండా, తమ అవసరాలకు అనుగుణంగా దశల వారీగా ఎరువులు తీసుకోవాలని, మోతాదుకు మించి వాడవద్దని హితవు పలికారు. ఎరువుల దుకాణాలు, వివిధ సంస్థల ద్వారా యూరియా, ఇతర ఎరువులు కొనే రైతులకు వారి అంగీకారం లేకుండా వేరే ఏ రకమైన ఇతర ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ఒత్తిడి చేయకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని అన్నారు. యూరియా ఎరువులతో ముడిపెడుతూ ఇతర ఉత్పత్తులను కొనుగోలు చేయాలని రైతులను బలవంతం చేస్తే డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు.

# జూన్ 18న 'చలో హైదరాబాద్

**పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి**
**జూన్ 18న 'చలో హైదరాబాద్**
**నల్లగొండ టౌన్**
**(వుదయం ప్రతినిధి జూన్ 8)**
నల్గొండ పట్టణ కేంద్రంలో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) ఆధ్వర్యంలో జూన్ 18న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నల్లగొండలో సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో బీఏఐ ఆల్ ఇండియా మాజీ అధ్యక్షుడు ఎస్.ఎస్.రెడ్డి, ఆల్ ఇండియా మాజీ జాతీయ ఉపాధ్యక్షుడు డి.వి.ఎన్.రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సి.హెచ్.శ్రీనివాసరావు, రాష్ట్ర ఖజాంచి జి.సంతోష్‌రెడ్డి, నల్లగొండ సెంటర్ చైర్మన్ వి.శ్రీనివాస్‌రెడ్డి, తొలి నల్లగొండ సెంటర్ దేశంలోని అత్యంత పురాతన, ప్రతిష్ఠాత్మక నిర్మాణ రంగ సంస్థలలో ఒకటిగా గత 85 ఏళ్లుగా కాంట్రాక్టర్ల హక్కుల పరిరక్షణ, నిర్మాణ రంగాభివృద్ధి, దేశ మౌలిక సదుపాయాల విస్తరణకు విశేష సేవలు అందిస్తోందన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ ఇంజినీరింగ్ శాఖల పరిధిలో డ్రెయినేజీ పనుల నుంచి భారీ సాగునీటి ప్రాజెక్టుల వరకు చేపడుతున్న కాంట్రాక్టర్లు ప్రస్తుతం తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం నుంచి బిల్లుల చెల్లింపుల్లో నెలకొన్న జాప్యం, చెల్లింపులపై స్పష్టత లేకపోవడం వల్ల కాంట్రాక్టర్లు, వారి కుటుంబాలు ఇబ్బందుల్లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.20 వేల కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంటూ, వాటిని ఎలాంటి సిఫార్సులు, ప్రభావాలు లేదా వివక్షకు తావులేకుండా సీనియారిటీ ప్రాతిపదికన విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 'ముందు వచ్చిన బిల్లుకు ముందే చెల్లింపు' అనే విధానాన్ని ప్రభుత్వం అమలు చేయాలని కోరారు.



రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితులను తాము అర్థం చేసుకుంటున్నప్పటికీ, ప్రజా ప్రయోజనాలు మరియు రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని అత్యవసర, ప్రాధాన్య పనులను కొనసాగించాలని సూచించారు. అదే సమయంలో ప్రస్తుతం అమలు చేయడం సాధ్యం కాని లేదా ప్రాధాన్యం లేని పనులను తాత్కాలికంగా నిలిపివేసి, వాటికి సంబంధించిన కాంట్రాక్టర్ల డిపాజిట్లు, సెక్యూరిటీ డిపాజిట్లు, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. బిల్లుల చెల్లింపుల ఆలస్యం కారణంగా కేవలం కాంట్రాక్టర్లు మాత్రమే కాకుండా ఉద్యోగులు, ఇంజినీర్లు, కార్మికులు, సరఫరాదారులు, వారి కుటుంబాలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ఇది లక్షలాది కుటుంబాల జీవనోపాధికి సంబంధించిన అంశమని తెలిపారు. "మేము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదు. తెలంగాణ అభివృద్ధికి భాగస్వాములం. రహదారులు, భవనాలు, సాగునీటి ప్రాజెక్టులు, తాగునీటి పథకాలు తదితర మౌలిక సదుపాయాల నిర్మాణంలో కాంట్రాక్టర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రభుత్వం పెండింగ్ బిల్లులను పారదర్శకంగా, క్రమ సంఖ్య ప్రకారం విడుదల చేసి నిర్మాణ రంగాన్ని, తద్వారా తెలంగాణ అభివృద్ధిని కాపాడాలి" అని నాయకులు కోరారు.
అనంతరం జూన్ 18న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టర్లు, నిర్మాణ రంగ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు

# నీట్ ప్రవేశ పరీక్షను పారదర్శకంగా నిర్వహించాలి

- అన్ని శాఖల అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
  జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**జయశంకర్ భూపాలపల్లి జూన్ 08(వుదయం జిల్లా ప్రతినిధి)**



జూన్ 21వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 05:15 గంటల వరకు నిర్వహించనున్న నీట్ ప్రవేశ పరీక్షను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నీట్ పరీక్ష నిర్వహణపై రెవెన్యూ, పోలీసు, వైద్య, మున్సిపల్, అగ్నిమాపక, విద్యుత్, పోస్టల్ తదితర శాఖలతో పాటు పరీక్షా కేంద్రాల సి ఎస్ లతో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 388 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలి పారు. చాలా ప్రతిష్టాత్మక మైన పరీక్ష అని, జిల్లా అధికారులు గత అనుభవం, భద్రతా అంశాలు, ఇంటెలిజెన్స్ నివేదికలు పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచడం, సీసీ టీవీలు ఏర్పాటు మరియు ప్రశ్నపత్రాల రవాణా సమయంలో పోలీస్ భద్రతను కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. పరీక్షా రోజున కేంద్రాల వద్ద తగినంత పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టడం, అభ్యర్థుల సౌకర్యార్థం రవాణా సదుపాయాలు కల్పించడం వంటి చర్యలు చేపట్టాలని పోలీస్ శాఖకు సూచించారు. అదేవిధంగా పరీక్షకు ముందు రోజు 20వ తేదీన మాక్ డ్రిల్ నిర్వహించాలని పేర్కొన్నారు.వైద్య శాఖ ద్వారా ప్రతి పరీక్షా కేంద్రంలో అత్యవస ర చికిత్స కేంద్రం ఏర్పాటు తో పాటు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, వైద్యసిబ్బందిని, అంబులెన్స్ సదుపాయం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అగ్నిమాపక శాఖ అత్యవసర సేవలు అందుబాటులో ఉంచాలని తెలిపారు.పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను తాత్కాలికంగా మూసివేయాలని తెలిపారు. పరీక్ష రోజు ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు మరియు సాయంత్రం 5 నుండి 7 గంటల వరకు అదనపు బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. విద్యుత్ శాఖ నిరంతరాయ విద్యుత్ సరఫరా కల్పించాలని, మున్సిపల్ శాఖ త్రాగునీరు మరియు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులను ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అనుమతిస్తారని తెలిపారు. పరీక్ష రోజున బిఎన్ ఎస్ 163 అమలు చేయాలని స్పష్టం చేశారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పరీక్షలను ఎలాంటి అంతరాయం లేకుండా విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో డిఆర్వో వసంత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. మధుసూదన్,
ఎఓ శ్రీనివాసులు, నీట్ సిటీ కోఆర్డినేటర్ రమణ రావు, సెంటర్ సూపరింటెండెంట్లు శ్రీధర్, బాలు నాయక్, విద్యుత్ శాఖ ఏఈ విశ్వాస్ రెడ్డి, ఆర్టీసీ ట్రాఫిక్ ఇంచార్జి సౌజన్య, ఎంవిఐ శ్రీనివాస్, పోస్టల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, అగ్నిమాపక అధికారి రవి తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మాపూర్‌లో డంపింగ్ యార్డు కేటాయింపును రద్దు చేయాలి

- అదనపు కలెక్టర్ రాజగౌడ్ కు సర్పంచ్ వినతి

**ధర్మపురి,జూన్ 8**
**(వుదయం ప్రతినిధి):**



ధర్మపురి మండలం తిమ్మాపూర్ గ్రామ పరిధిలోని ప్రభుత్వ స్థలాన్ని ధర్మపురి మున్సిపాలిటీ డంపింగ్ యార్డుకు కేటాయిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయా లని తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ నలమసు. పుష్పలత వైకుంఠం డిమాండ్ చేశారు. సోమవారం ఆమె జగిత్యాల జిల్లా కలెక్టర్‌కు ఒక వినతిపత్రాన్ని సమర్పించా రు.గ్రామ పరిధిలోని సర్వే నెం. 266లో గల స్థలాన్ని మున్సిపాలిటీకి కేటాయించే ప్రక్రియలో గ్రామ పంచాయతీకి ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలే దని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు.కనీసం గ్రామసభ నిర్వ హించకుండా,ప్రజల అభిప్రాయా లను తీసుకోకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతిపాదిత డంపింగ్ యార్డుకు సమీపంలోనే ప్రము ఖ గండి హనుమాన్ దేవాలయం ఉం దని,ఇక్కడికి నిత్యం వందలాది మంది భక్తులు వస్తుంటార ని పేర్కొన్నారు.
డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే పర్యా వరణ కాలుష్యం,దుర్వాసనతో దేవా లయ పవిత్రత దెబ్బతినడమే కాకుండా ప్రజారోగ్యం క్షీణిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.గత ప్రభుత్వం ఇదే స్థలాన్ని గ్రామీణ క్రీడా ప్రాంగణం కొరకు అధికారికంగా కేటాయించిందని, ఉపా ధి హామీ పథకం నిధుల తో ఇక్కడ ఇప్పటికే అభివృద్ధి పనులు కూడా జరిగాయని సర్పం చ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు, యువత శారీరక వికాసానికి ఉపయోగపడుతున్న ఈ స్థలాన్ని ఇప్పుడు మున్సిపాలిటీకి బదలాయించడం గ్రామపం చాయతీ హక్కులను కాలరాయ డమేనన్నా రు.ఇప్పటికైనా ఉన్న తాధికారులు స్పందించి డంపింగ్ యార్డు ఉత్తర్వు లను రద్దు చేసి, సదరు స్థలాన్ని తిమ్మాపూర్ గ్రామపంచాయతీ ఆధీనంలోనే కొనసాగేలా చూడాలని ఆమె కోరారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి నిరంతరం కృషి: వజ్జే వీరయ్య

**సూర్యాపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వజ్జే వీరయ్య చేతుల మీదుగా వుదయం జిల్లా ప్రతినిధి పిన్నెల్లి వెంకటేష్ కు మీడియా అక్రిడేషన్ కార్డు ప్రధానం**

**సూర్యాపేట**
**(వుదయం ప్రతినిధి జూన్ 8)**
సూర్యాపేటజిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, అక్రిడేషన్ కమిటీ సభ్యులు వజ్జే వీరయ్య సోమవారం డిపిఆర్ఓ కార్యాలయంలో వుదయం జిల్లా ప్రతినిధి పిన్నెల్లి వెంకటేష్ కు మీడియా అక్రిడేషన్ కార్డు అందజేశారు.ఈ సందర్భంగా వజ్జే వీరయ్య మాట్లాడుతూ, "ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా పాత్ర కీలకం. అక్రిడేషన్ కార్డు ద్వారా విధి నిర్వహణ సులభమవుతుంది. ప్రెస్ క్లబ్ తరఫున అన్ని విధాలా సహకారం ఉంటుంది" అన్నారు.
అక్రిడేషన్ కార్డు అందుకున్న పిన్నెల్లి వెంకటేష్ మాట్లాడుతూ, "ఈ కార్డు వల్ల జిల్లా ప్రజలకు నిష్పక్షపాతంగా,



వేగంగా వార్తలు అందించగలను. జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న వజ్జే వీరయ్య కు ధన్యవాదాలు" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు,టి న్యూస్ నాగేందర్, ఎన్టీవీ శ్యామ్ సుందర్ రెడ్డి, వివిధ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# అవగాహన లేకుండా విమర్శలు చేయొద్దు: ఎంపీ రఘునందన్ రావు



**కంది వుదయం జూన్ 08**
**(వుదయం ప్రతినిధి)**
సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలను తీవ్రంగా విమర్శించారు. పూర్తి అవగాహన లేకుండా రాజకీయ విమర్శలు చేయడం సముచితం కాదని అన్నారు. తాను మెదక్ ఎంపీ అని, జహీరాబాద్ ఎంపీ ఎవరో తెలియకుండా వ్యాఖ్యలు చేయడం ఆశ్చర్యకరమని పేర్కొన్నారు. ములాఖత్ రాజకీయాలు చేయాల్సిన అవసరం తనకు లేదని స్పష్టం చేశారు. జహీరాబాద్‌కు బుల్లెట్ రైలు అంశంపై అధికారిక డీపీఆర్ ఉంటే తీసుకురావాలని, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి సహకారం అందిస్తానని తెలిపారు. కేసీఆర్ కుటుంబం మెదక్ జిల్లాకు చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. పదేళ్ల పాలనలో అభివృద్ధి కంటే కుటుంబ ప్రయోజనాలు, ఆస్తుల పెంపుపైనే ఎక్కువ దృష్టి పెట్టారని ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలల అభివృద్ధిపై తగిన శ్రద్ధ చూపలేదని విమర్శించారు. భవిష్యత్తులో ఎన్నికల్లో ప్రజల మద్దతుతోనే రాజకీయ పార్టీల బలం తేలుతుందని రఘునందన్ రావు పేర్కొన్నారు.

# ప్రజా పాలన కార్యక్రమం రసాభస



**-ప్రాధాన్యత ఇవ్వడం లేదని బీఆర్ఎస్ సభ్యుల ఆందోళన**
**మంచిర్యాల/రామకృష్ణాపూర్ జూన్ 08(వుదయం ప్రతినిధి)**
క్యాతనపల్లి మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు ప్రాధాన్యం ఇవ్వకుండా, ప్రోటోకాల్ పాటించకుండా ప్రజాపాలన కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్ నిర్వహిస్తున్నారని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని బిఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ నాయకులు డాక్టర్ రాజా రమేష్ బాబు మండిపడ్డారు. సోమవారం రామకృష్ణాపూర్ పట్టణంలోని 17వ వార్డులో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలోని ఫ్లెక్సీ లలో మునిసిపల్ చైర్పర్సన్ గొడిసెల సంధ్యారాణి, వైస్ చైర్ పర్సన్ మిట్టపల్లి సరితల ఫోటోలు లేకపోవడంతో క్యాతనపల్లి మున్సిపాలిటీ కమిషనర్ మారుతి ప్రసాద్ ను బిఆర్ఎస్ నాయకులు నిలదీశారు. ఈనెల 4 నుండి ప్రారంభమైన ప్రజా పాలన కార్యక్రమాలలో ప్రోటోకాల్ పాటించడం లేదంటూ వారు ఆరోపిస్తున్నారు. పలుమార్లు మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ దృష్టికి ప్రోటోకాల్ విషయం తీసుకెళ్లినప్పటికీ ప్రోటోకాల్ ను పక్కనపెట్టి కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ తరపున తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. బిఆర్ఎస్ కౌన్సిలర్ల వార్డులపై కమిషనర్ చిన్నచూపు చూస్తున్నారని మండిపడ్డారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాలలో భాగంగా కాంగ్రెస్ కౌన్సిలర్ వార్డులకి నూతన రోడ్ల నిర్మాణాలు చేపడుతూ తమ తమ వార్డులకు నిధులు కేటాయించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రోటోకాల్ విషయంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్, ఎస్సీ సెల్ కు ఫిర్యాదు చేయబోతున్నట్లు డాక్టర్ రాజా రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సుదర్శన్ గౌడ్, రామిడి కుమార్, కౌన్సిలర్లు బొమ్మ భూమా గౌడ్ , కృపానందం, కొప్పి రాజశేఖర్, ముని ,మాజీ కౌన్సిలర్లు అనిల్ రావు, రెవెల్లి ఓదెలు, రామిడి ఉమాదేవి, నాయకులు మంద వేణు గోపాల్, కొండ కుమార్, పిల్లి సతీష్, లక్ష్మి కాంత్, నాయకులు, మహిళ నాయకురాళ్ళు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# బేటీ బచావో - బేటీ పడావో'పై ముమ్మర సమీక్ష



**కరీంనగర్ జూన్ 08 (వుదయం ప్రతినిధి):**
మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి శ్రీమతి సరస్వతి ఆధ్వర్యంలో బేటీ బచావో - బేటీ పడావో పథకం 2026-27 సంవత్సరానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అడిషనల్ కలెక్టర్ మరియు బేటీ బచావో - బేటీ పడావో నోడల్ అధికారి శ్రీమతి అశ్విని తనాజ వాకడే అధ్యక్షత వహించారు.సమావేశంలో బాలికల సంక్షేమం మరియు విద్య కోసం పథకం నిధులను ఎలా వినియోగించాలనే విషయంపై చర్చించారు. అలాగే వచ్చే సంవత్సరంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.అనంతరం మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాల పురోగతిని సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న అంగన్వాడీ భవనాలు, మరుగుదొడ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ వాటికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల నమోదు సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని సూచించారు.మిషన్ వాత్సల్య పథకం కింద గ్రామాల్లో ఉన్న అర్ఫాన్ మరియు సెమీ ఆర్ఫాన్ పిల్లలను గుర్తించి వారికి అవసరమైన సహాయం అందించాలని తెలిపారు. సఖి కేంద్రం ద్వారా మహిళలకు అందిస్తున్న సేవల గురించి వివరాలు తెలుసుకున్నారు.పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం అమలులో భాగంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో కమిటీలను ఏర్పాటు చేసి పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు, సీడీపీవోలు, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఐటిఐ,ఏటీసీ లలో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలి :ప్రిన్సిపాల్ వై. రమేష్



**జన్నారం, జూన్ 8**
**(వుదయం విలేఖరి)**
ఐటిఐ, ఏటీసీ సెంటర్లలో వివిధ ట్రేడ్ కోర్సులలో చేరేందుకు అర్హులైన విద్యార్థులు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని జన్నారం ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ వై. రమేష్ సూచించారు.ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ, 2026 ఆగస్టు సెషన్ కు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 30వ తేదీలోపు https://iti.telangana.gov.in వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.ఖాళీగా ఉన్న సీట్లలో ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు వెంటనే వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం కళాశాల పని వేళల్లో నేరుగా ఐటిఐ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు.

# జూన్ 10 వరకు దరఖా- స్తుల స్వీ-

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**
**ఆదిలాబాదు జూన్ 08**
**(వుదయం ప్రతినిధి):**
ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా జిల్లాలో ఎంపిక చేసిన 74 పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించనున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులోభాగంగా ఈ విద్యా సంవత్సరానికి (202627)గాను ఎంపిక చేసిన 74 పాఠశాలల్లో తాత్కాలిక పద్ధతిలో నియమించేందుకు ఒక ప్రీప్రైమరీ ఇన్స్ట్రక్టర్, ఒక ఆయా పోస్టులకు మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించడం జరిగిందని, దరఖాస్తుల స్వీకరణ గడువు నేటితో ముగియనుండగా, మరో రెండు రోజులు (జూన్ 10, 2026) వరకు పొడిగించడం జరిగిందని, ఎంపిక చేసిన అభ్యర్థులకు ఈ నెల 12న ఇంటర్వ్యూల నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన మహిళా అభ్యర్థులు ఇన్స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్మీడియట్ (10+2), ఆయా పోస్టుకు ఏడవ తరగతి పాసై ఉండాలని, తమ దరఖాస్తులో పూర్తి వివరాలు నింపి ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ ప్రతులను జతచేసి, సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి తేదీ:10062026 సాయంత్రం 4:00 గంటలలోపు అందజేయాలన్నారు. అభ్యర్థుల వయోపరిమితి 18 నుండి 44 సంవత్సరాల మధ్య ఉండాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, మహిళలకు 5 సంవత్సరాలు, ఎక్స్‌సర్వీస్ పర్సన్స్‌కు 3 సంవత్సరాలు, దివ్యాంగ మహిళలకు 10 సంవత్సరాల వయోసడలింపు ఉంటుందన్నారు. ఎంపిక ప్రక్రియ స్థానికత, మెరిట్ ఆధారంగా పూర్తిగా పారదర్శకంగా నిర్వహించబడుతుందని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



**అర్హులైన మహిళా అభ్యర్థులు ఇన్స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్మీడియట్ (10+2), ఆయా పోస్టుకు ఏడవ తరగతి పాసై ఉండాలని, తమ దరఖా దరఖాస్తులో పూర్తి వివరాలు నింపి ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ ప్రతులను జతచేసి, సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి తేదీ:10-06-2026 సాయంత్రం 4:00 గంటలలోపు అందజేయాలన్నారు.**

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా గ్రామ సభలు




**ఊర్కొండ జూన్ 08**
**(వుదయం ప్రతినిధి)**
నాగర్ కర్నూల్ జిల్లా ఉరుకొండ మండలం ఈరోజు మండలంలోని, బొమ్మరాజు పల్లి, బాల్య లోక్యతండ, జగ్బోయినపల్లి, రామ్ రెడ్డి పల్లి, గ్రామ పంచాయతీలలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా గ్రామ సభలను నిర్వహించి ఈ క్రింది అంశాలను వివరించడం ,చర్చిండం జరిగింది
1.వర్షాకాల సన్నద్ధత
2.సురక్షిత తాగునీరు
3.ఘన వ్యర్థాల నిర్వహణ
4.జల సంరక్షణ మన సంరక్షణ
5.మొక్కల పెంపకం వనమహోత్సవం
6 .ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 7.వరద నిర్వహణ భద్రత
8.వర్షాకాల సన్నద్ధత అనే అంశాలపై మండల స్థాయి అధికారులతో గ్రామ స్థాయిలో గ్రామ సభకు వచ్చిన ప్రజలకు తెలియజేయడం జరిగింది . ఇట్టి కార్యక్రమంలో గౌరవ సర్పంచులు, ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్లు, గ్రామ ప్రజలు, పంచాయతీ సెక్రెటరీలు , జిపిఓలు , అందరూ మండల స్థాయి ,గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు

# ప్రతి వార్డులో సమస్య పరిష్కరిస్తా

**మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి**
**ఆందోల్ జోగిపేట్ జూన్ 08**
**(వుదయం ప్రతినిధి)**
సోమవారం తెలంగాణ ప్రభుత్వం 99వ ప్రజా పాలన సందర్భంగా జోగిపేట మార్కెట్ యార్డ్ లో జోగుపేట మున్సిపాలిటీ ఒకటో వార్డు రెండో వార్డ్ మూడోవాడు 9వ వార్డు 21 5వ వార్డు సంబంధించిన సమస్యలపై వార్డు కౌన్సిలర్లు చైర్మన్ కృష్ణారెడ్డికి పలు సమస్యలు వివరించారు ముఖ్యంగా వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని దోమలు విద్యుత్ బల్బులు సమస్యలు పరిష్కరించాలని చైర్మన్ కు సమస్యలు తెలిపారు చైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ పలు సమస్యలు నా దృష్టికి తెచ్చినందుకు తక్షణమే పరిష్కరిస్తానని అవసరమైతే మంత్రి దామోదర్ కు ంచి నా ఆందోల్ జోగిపేట అభివృద్ధికి ఇంతటికైనా అభివృద్ధికి సహకరిస్తానని ప్రతి వాడుకు కోటి యాభై లక్షల నుంచి మూడు కోట్ల వరకు ప్రతి వాడుకు మంజూరు చేయిస్తానని తెలిపారు అభివృద్ధి అనేది నా ముఖ్యం అని మున్సిపల్ చైర్మన్ తెలిపారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ తొమ్మిదో వార్డ్ కౌన్సిలర్ శోభ నారాయణ గౌడ్ మాట్లాడుతూ తొమ్మిదవ వార్డ్ హౌసింగ్ బోర్డ్ కాలనీలో దొంగల బెడద ఎక్కువ ఉన్నందున గత వారం రోజుల క్రితం కారు అద్దాలు పగలగొట్టి పలు ముఖ్య కాగితాలు తీసుకెళ్లారని అదే విధంగా హౌసింగ్ బోర్డ్ కాలనీలో ప్రతి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి అధికారులు మరియు కోఆప్షన్ నెంబర్లు కౌన్సిలర్లు కాంగ్రెస్ కార్యకర్తలు వార్డు సభ్యులు కార్యకర్తలు పాల్గొన్నారుస



# గ్రేటర్ హైదరాబాద్



## కుటుంబ సర్వే పై అధికారులచే సమీక్షా సమావేశం..




**మెదక్ జిల్లా వుదయం ప్రతినిధి**

నిజాంపేట మండల కేంద్రంలోని వివిఎం శ్రీ హైస్కూల్ లో జనగణన సర్వేలో భాగంగా అధికారులచే సమీక్షా సమావేశాన్ని నిర్వహించడం జరిగిందని తాహసిల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగణన సర్వే పూర్తవుతున్నందున సర్వే అధికారులచే జనాభా లెక్కలకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.త్వరలో గృహ గణన సర్వే చేపట్టడం జరుగుతుందని అట్టి కార్యక్రమం పై అధికారులకు అవగాహన కల్పిస్తామన్నారు.

## ప్రజావాణికి 121 ఫిర్యాదులు

**రంగారెడ్డి**

జిల్లారంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 121 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రజల నుంచి అందిన వినతులు, ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు సమీక్షించి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన 27 దరఖాస్తులు, ఇతర శాఖలకు సంబంధించిన 94 దరఖాస్తులు అందగా, మొత్తం 121 ఫిర్యాదులు నమోదయ్యాయి.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి అనంత రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రజావాణిలో ఫిర్యాదు



**మేడ్చల్, జూన్ 8,(వుదయం ప్రతినిధి ).**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి మండలం నిజాంపేట్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 233/22, 233/24, 233/25, 233/26, 233/27 లలో ఉన్న సుమారు 14 ఎకరాలు 500 కోట్ల విలువైన ప్రభుత్వ లావణి పట్టా భూములను కాపాడాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఆకుల సతీష్ ఫిర్యాదు చేసారు. ప్రభుత్వ భూములపై అక్రమ ఆక్రమణలు, అనధికార నిర్మాణాలు, అనుమానాస్పద రిజిస్ట్రేషన్లు, ప్లాటింగ్, ప్రైవేట్ వ్యాపార కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ వ్యవహారంలో కొందరు రాజకీయ నాయకులు, ప్రైవేట్ వ్యక్తులు, సంబంధిత అధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. 0604 2026 తేదీన తహసీల్దార్ కార్యాలయం జిల్లా యంత్రాంగానికి పంపిన అధికారిక నివేదికలో ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం తక్షణ చర్యలు అవసరమని సూచించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. జి .ఓ.నె.166 of 2020కు సంబంధించిన ప్రభుత్వ పరిశీలనలు, అలాగే హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న సంబంధిత వ్యాజ్యాలు ప్రభుత్వ భూముల స్థితిగతులపై ఉన్న న్యాయపరమైన వివాదాలను కూడా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. ప్రభుత్వ భూములపై కొనసాగుతున్న జేసీబీ పనులు, భూసమీకరణ,ప్లాటింగ్, నిర్మాణ కార్యకలాపాలను వెంటనే నిలిపివేసి హద్దులు నిర్ధారించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, అక్రమ ఆక్రమణలు,అనధికార నిర్మాణాలను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వానికి చెందిన వందల కోట్ల రూపాయల విలువైన భూములను కాపాడేందుకు అవసరమైతే హైకోర్టు, సుప్రీంకోర్టులో అప్పీలు, రివ్యూ పిటిషన్లు దాఖలు చేసి ప్రభుత్వ హక్కులను పరిరక్షించాలని కూడా ఫిర్యాదులో కోరారు. నిజాంపేట్ ప్రవేశ ద్వారం వద్ద ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఈ విలువైన ప్రభుత్వ భూములను భవిష్యత్తులో ప్రభుత్వ ఆసుపత్రి, జూనియర్ కళాశాల, మినీ స్టేడియం, పార్కు లేదా ఇతర ప్రజా అవసరాల కోసం పరిరక్షించాలని ఫిర్యాదుదారులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి.బి. శ్రీనివాస్, ఎల్లస్వామి, పాండు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వచ్ఛ గావ్-సురక్షిత్ జల్ వాయు కార్యక్రమం




**- పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించిన ఎంపీడీవో ప్రవీణ్ కుమార్**
**- వర్షా కాల ముందస్తు చర్యలు, రోడ్డు భద్రత, ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక చర్చ**

**శంకర్‌పల్లి, జూన్ 08 (వుదయం)**

శంకర్‌పల్లి మండలంలోని కొండకల్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం "స్వచ్ఛ గావ్-సురక్షిత్ జల్ వాయు" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.గ్రామ సర్పంచ్ శేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి శంకర్‌పల్లి ఎంపీడీవో వి.ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామాభివృద్ధి, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యానికి సంబంధించిన పలు అంశాలపై ఈ సందర్భంగా విస్తృతంగా చర్చించారు.గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పరిశుభ్రత కార్యక్రమాలు, వన మహోత్సవ కార్యక్రమాలను ప్రజల సహకారంతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ప్రతి ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచడం ద్వారా అంటువ్యాధులను నివారించవచ్చని పేర్కొన్నారు. పర్యావరణ సమతుల్యత కోసం మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి సంరక్షణపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో సూచించారు.మురుగునీటి కాలువలను శుభ్రపరచడం, నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టడం, దోమల వ్యాప్తిని అరికట్టడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.అలాగే రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. హెల్మెట్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనల పాటింపు, సురక్షిత ప్రయాణంపై అధికారులు ప్రజలకు వివరించారు.అదేవిధంగా ఘన వ్యర్థాల నిర్వహణకు సంబంధించి ఇంటి వద్దే చెత్తను వేరు చేయడం, తడి-పొడి వ్యర్థాలను ప్రత్యేకంగా సేకరించడం వంటి చర్యల అవసరాన్ని వివరించారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సీతారాం రెడ్డి, మోకిలా సీఐ శ్రీనివాస్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ సతీష్, ఏపీవో నాగభూషణం, గ్రామ కార్యదర్శి రియాజ్, ఏఎన్ఎం ధనలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు మరియు గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కొత్త ప్రిన్సిపాల్‌కు మెడికోల ఘన స్వాగతం



**నాగర్ కర్నూల్, జూన్ 08 (వుదయం ప్రతినిధి)**

ప్రభుత్వ వైద్య కళాశాల, నాగర్‌కర్నూల్ నూతన ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన డా. దావూద్ సులేమాని మహమ్మద్‌కు కళాశాల విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. డా. దావూద్ సులేమాని మహమ్మద్ నాగర్‌కర్నూల్‌కు బదిలీపై రాకముందు ప్రభుత్వ వైద్య కళాశాల, మంచిర్యాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించారు. అక్కడ ఆయన పరిపాలనా నైపుణ్యం, వైద్య విద్యాభివృద్ధికి చేసిన కృషితో మంచి గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ, ఆయన నాయకత్వంలో కళాశాల విద్యా ప్రమాణాలు, పరిశోధన కార్యక్రమాలు, వైద్య సేవల రంగాల్లో మరింత అభివృద్ధి సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. నూతన ప్రిన్సిపాల్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, కళాశాల అభివృద్ధికి తమ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

## యువ క్రికెటర్‌ను అభినందించిన జగ్గారెడ్డి



**-క్రికెట్ లో మరింతగా రాణించేందుకు తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని క్రికెటర్ మానిత్ కు హామీ**

**సంగారెడ్డి వుదయం**

సంగారెడ్డి పట్టణానికి చెందిన వర్ధమాన క్రికెటర్ నెవిన్ మానిత్‌ను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. మానిత్ ప్రతిభను మానిత్ తండ్రి, కాంగ్రెస్ నాయకుడు, ఫిజియోథెరపిస్ట్ అయిన మధు ద్వారా తెలుసుకున్న ఆయన, భవిష్యత్తులో మంచి క్రికెటర్ గా ఎదగడానికి తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. మానిత్ ఇంకా మెరుగైన శిక్షణ పొందడానికి, వేర్వేరు టోర్నమెంట్లలో ఆడటానికి అయ్యే పూర్తి ఖర్చులను తానే భరిస్తానని జగ్గారెడ్డి భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో మరింత బాగా ఆడి సంగారెడ్డి జిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని జగ్గారెడ్డి ఆకాంక్షించారు. జాతీయ స్థాయిలో రాణి స్తున్న 18 ఏళ్ల నవీన్ మానిత్ ఇటీవలే ఇంటర్ పూర్తి చేశాడు. చిన్నప్పటి నుండి క్రికెట్ మీద ఉన్న ఇష్టంతో కష్టపడి ఆడుతూ రాణిస్తున్నాడు.:జాతీయ స్థాయి లో ప్రతిభస్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (SGFI) తరపున 2024 లో బీహార్ (పాట్నా) లో జరిగిన అండర్17 జాతీయ పోటీల్లో తెలంగాణ తరపున ఆడాడు. 2026 లో చండీగఢ్‌లో జరిగిన అండర్19 జాతీయ పోటీల్లో కూడా పాల్గొని రాణించాడు.వెంకటస్వామి గోల్డ్ కప్ సీనియర్ లీగ్‌లో మెదక్ జిల్లా తరపున ఆడుతూ మహబూబ్‌నగర్ జట్టుపై హాఫ్ సెంచరీ చేశాడు. ఢిల్లీలోని ఒక ప్రముఖ క్లబ్ తరపున ఆడుతూ అద్భుతమైన సెంచరీ చేశాడు ప్రస్తుతం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(HCA) లీగ్స్‌లో స్పోర్టి క్లబ్ తరపున T20, వన్డే, టూడే మ్యాచ్‌లు ఆడుతున్నాడు.కోచ్‌ల శిక్షణలో రాటుదేలి..ఆరవ తరగతి నుంచే ఎమ్మెస్ క్రికెట్ అకాడమీలో కోచ్ చంద్రమౌళి, ఇనాంల దగ్గర మానిత్ క్రికెట్ నేర్చుకున్నాడు. HCA ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి ప్రోత్సాహంతో మరింతగా ఎదిగాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఇక్బాల్ క్రికెట్ అకాడమీలో కోచ్ ఇక్బాల్ దగ్గర శిక్షణ పొందుతున్నాడు.. ఈ అభినందన కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, మాజీ క్రికెటర్ రఘు తదితరులు పాల్గొని మానిత్‌ను అభినందించారు. జగ్గారెడ్డి ఇచ్చిన మద్దతుతో మానిత్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని క్రీడాభిమానులు ఆశాభావం వ్యక్తంచేశారు.

## పీఎండీడీకే వై పథకం వార్షిక ప్రణాళిక పై కలెక్టర్ సమీక్ష



**నారాయణపేట జూన్08 (వుదయం ప్రతినిధి)**

ధన్ ధాన్య కృషి యోజన పథకం వార్షిక ప్రణాళికపై సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సహజ సేంద్రీయ వ్యవసాయాన్ని విస్తరించడం రైతుల ఆదాయాలు గ్రామీణ జీవనోపాధికి మద్దతు ఇస్తూ స్థిరమైన వాతావరణ స్థితిస్థాపక వ్యవసాయాన్ని స్వీకరించడమే పథకం ఉదేశ్యం అన్నారు. అయితే జిల్లాలో ఆ పథకం అమలుకు సంబంధిత శాఖల అధికారులు తమ తమ శాఖలకు సంబంధించిన వార్షిక ప్రణాళికను అమలు చేసేందుకు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. వార్షిక ప్రణాళిక అమలులో ఇన్నోవేటివ్ ఉండాలన్నారు. అంతకు ముందు ఆ పథకం నోడల్ అధికారి సాయిబాబా మాట్లాడుతూ..దేశంలోని 100 జిల్లాలలో నారాయణపేట జిల్లా ఈ పథకం కింద ఎంపిక కావడం ఈ ప్రాంత అభివృద్ధికి శుభ పరిణామం అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ పథకం కింద ఎంపికైన నాలుగు జిల్లాలలో ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే మూడు జిల్లాలు నాగర్ కర్నూల్, గద్వాల, నారాయణపేట ఎంపిక కావడం జరిగిందని ఆయన క్లుప్తంగా వివరించారు. గత జనవరి 3, 4, న జాయింట్ సెక్రెటరీ మినిస్ట్రీ ఆఫ్ కో ఆపరేషన్,పీఎండిడికేవై సెంట్రల్ నోడల్ అధికారి రమణ్ కుమార్ నారాయణ పేట జిల్లాలో పర్యటించి పథకం అమలు తీరును పర్యవేక్షించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డి ఆర్ డి ఓ వెంకట్ రాములు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్, జిల్లా మత్స్య శాఖ అధికారి రెహమాన్, డిపివో సుధాకర్ రెడ్డి, ఎల్ డీ ఎం విజయ్ కుమార్, నాబార్డు అధికారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నియంత్రణకు కఠిన చర్యలు

**- డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరి సహకారం అవసరం,**
**- మాదకద్రవ్యాల నియంత్రణకు అన్ని శాఖల సమన్వయం అవసరం,**
**- యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడాలి,**
**- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్,**

**నాగర్ కర్నూల్ జూన్ 08 (వుదయం ప్రతినిధి)**



జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, విక్రయాలపై అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మరియు జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ ఆదేశించారు. సోమవారం నాగర్‌కర్నూల్ ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా మాదకద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశంలో వారు పాల్గొని పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ ------ యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడటం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యాసంస్థలు, గ్రామాలు, పట్టణాల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు, యువతలో చైతన్యం పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల నియంత్రణలో పోలీసు, రెవెన్యూ, వైద్య, విద్యాశాఖలతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. పాఠశాలలు, కళాశాలల పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టి విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ------. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వలు, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా బృందాలు ఏర్పాటు చేసి అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేస్తున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాల విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే ప్రజలు పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాజంలో మాదకద్రవ్యాల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని ఎస్పీ పేర్కొన్నారు. యువత ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరుచుకునేలా తల్లిదండ్రులు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు యువతలో సానుకూల దృక్పథాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని అన్నారు.ఈ సందర్భంగా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని వంకేశ్వరం గ్రామంలో 16 గంజాయి మొక్కలు, 19 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి గాయత్రి తెలిపారు. అక్రమ గంజాయి సాగు, నిల్వలపై ఎక్సైజ్ శాఖ చేపట్టిన చర్యలను ఎస్పీ అభినందించారు.ఈ సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు, పోలీసు శాఖ ప్రతినిధులు, విద్యాశాఖ, వైద్యశాఖ, ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## సఖి కేంద్రంలో విధులను సమర్థవంతంగా నిర్వహించాలి

**- సిబ్బంది నిబద్ధతతో పని చేయకుంటే కఠిన చర్యలు**
**- సఖి కేంద్రం సేవలపై పెద్ద ఎత్తున ప్రచారం అవసరం**
**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల జూన్ 08 (వుదయం కరస్పాండెంట్)**



సఖి కేంద్రంలో పనిచేసే సిబ్బంది సమర్థవంతంగా తమ విధులను నిర్వర్తించాలని, నిబద్ధతతో పనిచేయకుంటే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.

సోమవారం గద్వాలలోని సఖి కేంద్రంను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఐటీ, స్టోర్, సర్వైవర్, కిచెన్, తదితర విభాగాలను తిరిగి పరిశీలించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ తో పాటు ఇతర రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రంలో పెద్ద సంఖ్యలో సిబ్బంది పనిచేస్తున్నప్పటికీ ఇటీవల సంరక్షించబడ్డ ఓ మహిళ అదృశ్యం కావడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ పనిచేయకపోతే లాభమేమిటని ప్రశ్నించారు. గత రెండేళ్లలో కేంద్రంకు వచ్చిన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. హింసకు గురై, ఇతర సమస్యలతో బాధపడుతున్న మహిళలు, బాల్యవివాహాలు, బాల కార్మికులు, ఇతరాత్ర సమస్యలతో వేదనకు గురైన బాలికలను సంరక్షించేందుకు, కౌన్సిలింగ్ నిర్వహించేందుకు ఉద్దేశించిన సఖి కేంద్రంలో ఎంతో బాధ్యతాయుతంగా పనిచేయాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని మండిపడ్డారు. పోలీసు శాఖ నుంచి రిఫర్ చేసిన కేసులే ఇక్కడికి ఎక్కువగా వస్తున్నాయని, సఖి తరపున సంరక్షించబడుతున్న కేసులు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. సఖి కేంద్రం అందిస్తున్న సేవలపై నిర్వహించే అవగాహన కార్యక్రమాలకు చాలా తక్కువ మంది హాజరయ్యారని, పెద్ద ఎత్తున, ఎక్కువ మందికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రెండు నెలల్లో సఖి సిబ్బంది తమ పనితీరును మెరుగుపరుచుకోకుంటే నిర్లక్ష్యంగా ఉండే వారిని ఉద్యోగంలో నుంచి తొలగించి, అర్హులైన ఇతరులను తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం సఖి కేంద్రం పరిసరాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అక్కడ పొదలు, ఇతర వ్యర్థాలు ఉండడాన్ని గమనించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత మహిళలకు రక్షణ, ఆశ్రయం కల్పించేందుకు ఉద్దేశించిన సఖి కేంద్రాన్ని చిత్తశుద్ధితో నిర్వహించాలని, అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు.

## జూన్ 21న జరిగే నీట్ పునః పరీక్షను సజావుగా నిర్వహించాలి

**వికారాబాద్,జూన్ 8: (వుదయం జిల్లా ప్రతినిధి ):**

జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ.జూన్ 21 న నిర్వహించే నీట్ పరీక్షను సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం లో జూన్ 21న నిర్వహించే నీట్ పునః పరీక్ష పై సంబంధిత శాఖాధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులనుద్దేశించి జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ...జూన్ 21న నిర్వహించే నీట్ పునః పరీక్షను ఏటిఏ ( నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ) మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టాలన్నారు. అందుకు అనుగుణంగా జిల్లాలోని (5) పరీక్షా కేంద్రాల్లో నీట్ పునః పరీక్ష ఉంటుందని ఆయన తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 515 గంటల వరకు పరీక్ష జరుగుతుందని అదే విధంగా వైకల్యం ఉన్న వ్యక్తులకు మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 615 గంటల వరకు పరీక్ష ఉంటుందని ఆయన తెలిపారు. సాంఘీక సంక్షేమ బాలికల కళాశాల, కొత్తగడి లో 384, సాంఘీక సంక్షేమ బాలల కళాశాల, అనంతగిరిపల్లి లో 312, వికారాబాద్ జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో 240, సంఘం లక్ష్మీబాయి బాలిక గురుకుల కళాశాలలో 240, తాండూర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 120 మొత్తం జిల్లాలో 1296 మంది నీట్ పరీక్షకు హాజరు కానున్నట్లు కలెక్టర్ తెలిపారు. నీట్ పునః పరీక్షను ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని, ప్రధానమంత్రి స్వయంగా పరీక్షా తీరును పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇలాంటి తప్పిదాలు జరగకుండా బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా విధులను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల్లో ముందస్తుగానే అన్ని సౌకర్యాలను సమకూర్చుకోవాలని ఆయన తెలిపారు. జూన్ 20, 21వ తేదీల్లో నిరంతర విద్యుత్ సౌకర్యం కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలో జనరేటర్ ను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పరీక్ష కేంద్రంలో ఫ్యాన్లు, తాగునీరు, మంచి లైటింగ్ లతోపాటు మహిళలకు ప్రత్యేకమైన టాయిలెట్ ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రం నుండి లైవ్ టెలికాస్ట్ ఉంటుందని, లైవ్ టెలికాస్ట్ ను కలెక్టరేట్ నుండి వీక్షించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలను ఏజెన్సీల ద్వారా అమర్చాలని, పరీక్ష కేంద్రం లోకి బయట వ్యక్తులు ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అధికారులు సూచించారు. పరీక్ష సమయానికి అనుగుణంగా బస్సు సౌకర్యాలు కల్పించాలని అదేవిధంగా పరీక్ష పూర్తి అయిన తర్వాత సాయంత్రం కూడా బస్సులను సమకూఎ స్కాట్ బృందాలను ఏర్పాటుచేసి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా జాగ్రత్తలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఉమా శంకర్ ప్రసాద్, జిల్లా విద్యాధికారి మహమ్మద్ అబ్దుల్ ఘని, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ నెహమత్ అలీ, నీట్ సిటీ కోఆర్డినేటర్ కే.సాయి లత, చీఫ్ సూపరింటెండెంట్ లు డి.రమాదేవి, వి.యాదయ్య , ఎం.శ్రీశైలం, సి.రాజు, పి.వేణుగోపాల్ రెడ్డి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేసుల విచారణ వేగంగా, పారదర్శకంగా ఉండాలి ఎస్పీ డాక్టర్

**సంగ్రామ్ సింగ్ జి పాటిల్**

**నాగర్ కర్నూల్, జూన్ 08 (వుదయం బ్యూరో)**



ఎఫ్ఐఆర్ నుంచి చార్జిషీట్ వరకు ప్రతి అంశం పారదర్శకంగా ఉండాలని, బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చూడడమే పోలీసుల ప్రధాన బాధ్యత అని జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ స్పష్టం చేశారు. సోమవారం నాడు జిల్లా పోలీస్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన నెలవారి నేర సమీక్షా సమావేశంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలకు ఆయన దిశానిర్దేశం చేశారు. నేరాల నమోదు, పెండింగ్ కేసులు, కోర్ట్ మానిటరింగ్, డయల్ 100 కాల్స్, సీసీ కెమెరాల ఏర్పాటు, ప్రజా ఫిర్యాదులపై స్పందన, సైబర్ క్రైమ్ కేసుల్లో బాధితులకు నగదు రిఫండ్, దొంగతనం, హత్య, అనుమానాస్పద మృతి కేసుల్లో డిటెక్షన్ తదితరాలను సమీక్షించారు. సైబర్ మోసాలు, మహిళా భద్రతపై ప్రజల్లో నిరంతర అవగాహన పెంచాలని, పెండింగ్ కేసులు లేకుండా దర్యాప్తు వేగవంతం చేయాలని, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పాత నేరస్తులు, రౌడీ షీటర్లపై నిఘా పెంచి క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, డీఎస్పీలు సాయి వెంకట్ రెడ్డి, బుర్రి శ్రీనివాస్, శ్రీనివాసులు, సీఐలు, ఎస్ఐలు, స్టేషన్ రైటర్లు తదితరులు పాల్గొన్నారు.

## డాట్ నెట్ డెవలపర్ల అన్వేషణలో గీతం

**పటాన్చెరు (వుదయం):**

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని అధునాతన సాంకేతిక పరిష్కారాల కేంద్రం (CATS) అనుభవజ్ఞులైన డాట్ నెట్ డెవలపర్ల కోసం నియామక ప్రక్రియ ప్రకటించింది. ఆసక్తి గల అభ్యర్థులు 2026 జూన్ 13, 14 తేదీలలో జరిగే డైరెక్ట్ వాక్ఇన్ ఇంటర్వ్యూలో పాల్గొనవలసిందిగా కోరుతూ సోమవారం ఒక ప్రకటనను వెలువరించింది.పటిష్టమైన సాఫ్ట్ వేర్ సొల్యూషన్ల రూపకల్పన, అభివృద్ధి, అమలు చేయడంలో 3 నుంచి 20 సంవత్సరాల అనుభవం ఉన్న ప్రతిభావంతులైన నిపుణుల కోసం విశ్వవిద్యాలయం అన్వేషిస్తోందని తెలిపారు. అభ్యర్థులకు ASP.NET, MVC, .NET కోర్, వెబ్ API, and SQL సర్వర్ డేటాబేస్ టెక్నాలజీలలో బలమైన సాంకేతిక నైపుణ్యం ఉండాలని స్పష్టీకరించారు.దరఖాస్తుదారులు కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ లేదా సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీని కలిగి ఉండాలన్నారు. ఎడ్యుకేషన్ టెక్నాలజీ (EdTech) లేదా హెల్త్ కేర్ ఐటీ సిస్టమ్స్ లో అనుభవం అదనపు అర్హతగా పరిగణిస్తామని తెలిపారు.అభ్యర్థి అనుభవం, నైపుణ్యాలు, ఆయా పోస్టులకు అనుగుణంగా వారు ఒడుపుగా వ్యవహరించే విధానాన్ని అనుసరించి వార్షిక వేతన ప్యాకేజీ 3.5 లక్షల నుంచి 25 లక్షల రూపాయలు, లేదా అంతకంటే ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. అసాధారణ ప్రతిభ ఉన్న వారికి, వారి యోగ్యత, నైపుణ్యం ఆధారంగా అధిక వేతనం అందిస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నోటిఫికేషన్ లో పేర్కొన్న క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేయడం ద్వారా లేదా అధికారిక వెబ్ సైట్ www.gitam.edu ను సందర్శించడం ద్వారా నియామక ప్రక్రియ కోసం నమోదు చేసుకోవచ్చని వివరించారు.ఈ నియామక కార్యక్రమం, అత్యంత నైపుణ్యం కలిగిన టెక్నాలజీ వర్క్ ఫోర్సును నిర్మించడానికి, CATS వ్యవస్థను బలోపేతం చేయడానికి గీతం యొక్క నిరంతర నిబద్ధతను ప్రతిబింబిస్తోందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.




భారత్‌లో వంటగ్యాస్ ధరలు ప్రపంచంలోనే తక్కువగా ఉన్నాయని కేంద్రం మరోసారి స్పష్టం చేసింది. అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా వంటి అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే ఇక్కడ ధరలు గణనీయంగా చౌకగా ఉన్నాయని వివరించింది. ప్రస్తుతం ఢిల్లీలో సాధారణ వినియోగదారులు సిలిండర్‌కు సుమారు రూ.942 చెల్లిస్తుండగా, ప్రతి సిలిండర్‌పై దాదాపు రూ.700 వరకు ప్రభుత్వం భరిస్తోందని వెల్లడించింది. ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద 10.58 కోట్లకుపైగా కనెక్షన్లు అందించగా, అర్హులైన లబ్ధిదారులకు ఏడాదికి నాలుగు సిలిండర్లపై ఒక్కో సిలిండర్‌కు రూ.300 సబ్సిడీ ఇస్తున్నట్లు కేంద్రం తెలిపింది.

- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

## వే'మన' పద్యం

ఆత్మశుద్ధి లేని ఆచారమది యేల
భాండ శుద్ధి లేని పాకమేల
చిత్త శుద్ధి లేని శివ పూజలేలరా
విశ్వదాభిరామ వినుర వేమా!



# రాజకీయ గగనంలో మరో శిఖరం

భారత ప్రజాస్వామ్య చరిత్రలో కొన్ని ఘట్టాలు కేవలం రాజకీయ సంఘటనలుగానే కాకుండా చరిత్ర పుటల్లో శాశ్వత ముద్ర వేసే మైలురాళ్లుగా నిలుస్తాయి. అలాంటి అరుదైన ఘట్టాల్లో ఒకటి నరేంద్ర మోదీ సాధించిన సుదీర్ఘ ప్రధానమంత్రి పదవీకాల రికార్డు. 2014 మే 26న భారతదేశ 15వ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నరేంద్ర మోదీ, 2026 జూన్ 10 నాటికి వరుసగా 4,399 రోజులపాటు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రధానమంత్రిగా కొనసాగి, స్వతంత్ర భారత తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న 4,398 రోజుల ఎన్నికైన ప్రధానమంత్రి పదవీకాల రికార్డును అధిగమించగలగడం సామాన్య విషయం కాదు. ఇది కేవలం ఒక నాయకుడి వ్యక్తిగత రాజకీయ విజయగాథ మాత్రమే కాదు; భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల తీర్పు ఎంత శక్తివంతమైనదో, నాయకత్వ స్థిరత్వం ఎంత ప్రాధాన్యమైనదో చాటిచెప్పే చారిత్రక ఘట్టం.

1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చిన రోజున భారతదేశపు తొలి ప్రధానమంత్రిగా జవహర్‌లాల్ నెహ్రూ బాధ్యతలు స్వీకరించారు. స్వాతంత్ర్యానంతర భారత నిర్మాణానికి పునాదులు వేసిన నాయకుడిగా ఆయనకు చరిత్రలో ప్రత్యేక స్థానం ఉంది. అయితే 1952లో జరిగిన తొలి సాధారణ ఎన్నికల తర్వాత ప్రజల ఓట్లతో ఎన్నికైన ప్రధానమంత్రిగా ఆయన కొత్త ప్రజాస్వామ్య వ్యవస్థకు నాయకత్వం వహించారు. 1952, 1957, 1962 ఎన్నికల్లో వరుస విజయాలు సాధించి దేశాన్ని దాదాపు పదిహేడేళ్ల పాటు నడిపించారు. ఆధునిక భారత నిర్మాణ శిల్పిగా పేరుపొందిన నెహ్రూ, భారీ పరిశ్రమలు, ఆనకట్టలు, శాస్త్ర సాంకేతిక పరిశోధన సంస్థలు, ప్రజాస్వామ్య వ్యవస్థలు, విదేశాంగ విధానానికి పునాదులు వేశారు. ఆయన నాయకత్వం భారత రాజకీయ చరిత్రలో ఒక యుగంగా నిలిచింది. అలాంటి నాయకుడి ఎన్నికల ఆధారిత నిరంతర పదవీకాల రికార్డును అధిగమించడం అనేది సాధారణ విషయం కాదు. నరేంద్ర మోదీ రాజకీయ ప్రయాణం కూడా అసాధారణమే. గుజరాత్ ముఖ్యమంత్రిగా దాదాపు పదమూడు సంవత్సరాలు పరిపాలన సాగించిన ఆయన, 2014లో భారతీయ జనతా పార్టీని చారిత్రక విజయానికి నడిపించారు. 1984 తర్వాత తొలిసారిగా ఒకే పార్టీ స్వయంగా సంపూర్ణ మెజారిటీ సాధించడం భారత రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలికింది. 543 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ 282 స్థానాలు గెలుచుకోవడం ద్వారా దేశ రాజకీయ సమీకరణాలు మారిపోయాయి. అవినీతి ఆరోపణలు, పరిపాలనా స్థబ్దత, ఆర్థిక మందగమనం వంటి అంశాల నేపథ్యంలో ప్రజలు మార్పును కోరుకుంటున్న సమయంలో మోదీ నాయకత్వం జాతీయ స్థాయిలో ఆమోదం పొందింది. 2019లో జరిగిన 17వ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మరింత బలపడింది. ఏకంగా 303 స్థానాలు గెలుచుకొని మరోసారి అధికారంలోకి వచ్చింది. స్వాతంత్ర్యం తర్వాత ఇందిరాగాంధీ కాలం తరువాత ఒక నాయకుడు మరింత బలమైన ప్రజా మద్దతుతో తిరిగి అధికారంలోకి రావడం ఇదే మొదటిసారి. 2024లో జరిగిన 18వ లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి మూడోసారి అధికారాన్ని నిలబెట్టుకుంది. ఈ విజయంతో నెహ్రూ తర్వాత వరుసగా మూడు సాధారణ ఎన్నికల్లో ప్రజల తీర్పుతో ప్రధానమంత్రి పదవిని కొనసాగించిన రెండో నాయకుడిగా మోదీ చరిత్ర సృష్టించారు. కాంగ్రెసేతర రాజకీయ పార్టీకి చెందిన నాయకుడిగా ఈ ఘనత సాధించిన ఏకైక వ్యక్తిగా కూడా ఆయన నిలిచారు.

మోదీ పదవీకాలాన్ని పరిశీలిస్తే భారత రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో పలు కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. 2014లో ప్రారంభమైన జనధన్ యోజన ద్వారా కోట్లాది మంది బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చారు. 2016లో ప్రకటించిన నోట్ల రద్దు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. నల్లధనం, నకిలీ కరెన్సీ, ఉగ్రవాద నిధులపై పోరాటంగా ప్రభుత్వం దీన్ని పేర్కొంది. అయితే దీని ప్రభావంపై ఆర్థిక నిపుణుల మధ్య ఇప్పటికీ భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. 2017లో వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అమలు ద్వారా దేశవ్యాప్తంగా ఏకీకృత పన్ను వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. స్వాతంత్ర్యం తర్వాత అత్యంత పెద్ద ఆర్థిక సంస్కరణగా దీనిని అభివర్ణించారు. 2019లో జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370 రద్దు చారిత్రక రాజకీయ నిర్ణయంగా నిలిచింది. దేశ సమగ్రతను బలోపేతం చేయడానికే ఈ చర్య తీసుకున్నట్లు ప్రభుత్వం ప్రకటించగా, ప్రతిపక్షాలు ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రశ్నలు లేవనెత్తాయి. అదే ఏడాది పౌరసత్వ సవరణ చట్టం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. 2020లో కరోనా మహమ్మారి సమయంలో ప్రపంచంలోనే అతిపెద్ద ఉచిత టీకా కార్యక్రమాన్ని అమలు చేయడం కూడా మోదీ ప్రభుత్వ ప్రధాన విజయాల్లో ఒకటిగా పేర్కొనబడుతోంది. 220 కోట్లకు పైగా వ్యాక్సిన్ డోసులు అందించడం ద్వారా భారతదేశం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది.

## రచనలు పంపండి



వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# మెదడు కణితి సమస్య ప్రమాదకరం, ప్రాణాంతకం !



ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ నిలుస్తున్నది. ప్రతి ఐదేళ్లకు ఓ సారి శాంతియుతంగా ఎన్నికలు జరుగుతున్నాయి. దేశ ప్రధానమంత్రి నుంచి వార్డు మెంబర్ వరకు ఎన్నికలు సజావుగా జరుగుతున్నాయి. 10 జూన్ 2026 రోజు భారత ఆధునిక రాజకీయ ముఖచిత్రాన్ని మార్చి వేసే ఒక చారిత్రాత్మక ఘట్టానికి వేదిక కానుంది. దేశ చరిత్రలో అత్యధిక కాలం ప్రజల చేత "ఎన్నికైన" ప్రధానమంత్రిగా జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న సుదీర్ఘ రికార్డును 10 జూన్ రోజున నరేంద్ర మోదీ అధిగమించనున్నారు. 26 మే 2014 నుంచి జూన్ 10, 2026 వరకు నిరంతరాయంగా పిఎం పదవిలో 4,399 రోజులు పూర్తి కానున్నాయి. గతంలో నెహ్రూ ప్రజాస్వామ్య బద్ధంగా "ఎన్నికైన పిఎం"గా 4,398 రోజుల పాటు (13 మే 1952 నుంచి 27 మే 1964 వరకు) సేవలు అందించారు. నెహ్రూ నెలకొల్పిన రికార్డును 10 జూన్ రోజు నరేంద్ర మోదీ బద్దలుకొట్టి అప్రతిహతంగా అత్యధిక కాలం పాటు నిరాటకంగా ఎన్నికైన పిఎంగా సేవలు అందించడం ఓ అద్భుత సందర్భం.

**నరేంద్రుడి ఖాతాలో మరో అరుదైన రికార్డు:**

సంక్షేమ ఆర్థిక విధానాలు, బలమైన జాతీయ భద్రత, స్పష్టమైన సాంస్కృతిక జాతీయవాదా లాంటి శక్తివంతమైన వ్యూహాలతో నరేంద్రుడు సంప్రదాయ రాజకీయ ఆధిపత్యాన్ని ఆసాంతం మార్చి వేశారు. సుదీర్ఘ కాలం అధికారంలో ఉన్నప్పటికీ ప్రభుత్వ వ్యతిరేకతను తిప్పికొడుతూ ప్రజాదరణ కలిగిన ప్రభుత్వ నమూనాను విజయవంతంగా కొనసాగిస్తున్నారు. ప్రధానిగా "మొత్తం పదవీ కాలాని"కి, "ఎన్నికల ద్వారా పిఎం"గా సేవలందించిన కాలానికి వ్యత్యాసం తెలుసుకోవాలి. మన తొలి ప్రధానమంత్రి నెహ్రూ దాదాపు 17 ఏండ్ల పాటు పిఎంగా సేవలు అందించారు. కాని ఇందులో 15 ఆగష్టు 1947 నుంచి 12 మే 1952 వరకు రాజ్యాంగబద్ధంగా నామినేటెడ్ (ఎన్నికలు లేకుండా) ప్రధానిగా సేవలు అందించారు. స్వాతంత్ర్య భారతంలో ప్రజాస్వామ్య సార్వత్రిక తొలి ఎన్నికలు జరిగి 13 మే 1952 రోజున ఎన్నికైన పిఎంగా నెహ్రూ పదవీ స్వీకారం చేశారు. నాటి నుండి మే 27, 1964 రోజు తుది శ్వాస విడిచే వరకు 4,398 రోజుల పాటు ఎన్నికైన పిఎంగా సేవలు అందించారు. నరేంద్ర మోదీ 10 జూన్ 2026 రోజున అత్యధిక కాలం పాటు ఎన్నికైన ప్రధానమంత్రిగా నెహ్రూ రికార్డును బద్దలుకొట్టి 4,399 రోజులు నిర్విరామంగా పని చేసిన పిఎంగా అరుదైన ఘనతను సాధిస్తున్నారు. నరేంద్రుడు చిన్నతనంలోనే ఆర్ఎస్ఎస్ స్వయంసేవక్‌గా సేవలు అందించి, ఆ తర్వాత భాజపాలో కార్యకర్తగా ఎదిగారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా 07 అక్టోబర్ 2001 నుంచి నిరంతరాయంగా 22 మే 2014 వరకు సుదీర్ఘ కాలం సేవలు అందించి, ఆ తర్వాత నేరుగా పిఎంగా పదవిని చేపట్టి నేటికీ కొనసాగుతున్నారు.

**నాటి స్వతంత్ర భారత పునాదుల నుంచి నేటి డిజిటల్ శకం వరకు :** భారతదేశ రాజకీయ, ప్రజాస్వామ్య పరిపాలనా చరిత్రలో 10 జూన్ 2026 ఒక సువర్ణ అధ్యాయం లిఖించబోతున్నది. నెహ్రూ రికార్డును అధిగమిస్తూ మోదీ అప్రతిహతంగా దూసుకుపోతున్నారు. నాటి "స్వతంత్ర భారత పునాదుల" నుండి నేటి "డిజిటల్ శకం" వరకు భారత పరిపాలనా ప్రస్థానం కొనసాగుతున్నది. ఈ చారిత్రక మైలురాయి కేవలం ఇద్దరు భిన్న ధృవాల వంటి అగ్ర నాయకుల పదవీకాలాలను పోల్చడం వీలుకాదు. గత ఏడు దశాబ్దాలుగా భారతదేశం ఎదుర్కొన్న సవాళ్లు, సంక్షోభాలు, పాలనా నమూనా లాంటి పరిణామాలు సమీక్షించుకోవడానికి ఇదో అరుదైన సందర్భం. శతాబ్దాల వలస పాలన తర్వాత విచ్ఛిన్నమైన ఆర్థిక వ్యవస్థ, రాజకీయ అస్థిరత, సంస్థాగత నిర్మాణం లేని భారతానికి గట్టి పునాదులు వేయడానికి కృషి చేశారు. నాడు 34 కోట్ల ప్రజలు ఉన్న భారతం నేడు 140 కోట్ల జనాభాకు చేరింది. నాడు జనాభాతో పాటు సమస్యలు, సవాళ్లు, సంక్షోభాలు, విపత్తులు, శాస్త్ర సాంకేతిక విప్లవాలను దాటుకుంటూ నేడు డిజిటల్ ఏఐ విప్లవం ఆసరాగా భారతం ముందడుగు వేస్తూ అభివృద్ధి దిశగా పయనిస్తున్నది.

నరేంద్ర మోదీ మార్క్ సమగ్రాభివృద్ధి :

కరోనా విపత్తు విడిచిన చేదు జ్ఞాపకాలతో టెక్నాలజీ తోడుగా, ప్రజారోగ్య గొడుగు, ఆర్థిక స్వావలంభన, వ్యూహాత్మక విదేశీ విధానాలు, యూపిఐ చెల్లింపుల వెల్లువ, సిఏఏ, స్వచ్ఛ భారత్ అభియాన్, జన్ ధన్ ఆధార్ మొబైల్ అనుసంధానం, ఆర్థిక సమ్మిళిత అభివృద్ధి, మౌలిక వనరుల కల్పన, 370 ఆర్టికల్ రద్దు, డిజిటల్ ఇండియా, ఆయుశ్మాన్ భారత్, రవాణా రంగ అభివృద్ధి, మేక్ ఇన్ ఇండియఆ, త్రిపుల్ తలాక్, బేటీ బచావో బేటీ పడావో, సోషల్ మీడియా ఉప్పెనలు, సంక్షేమ పథకాల నీడలను కల్పిస్తూ డిజిటల్ విప్లవ భారతం ఎదగడంలో నరేంద్ర మోదీ కృషి వెలకట్టలేనిది. నాడు రష్యా, అమెరికా అనే రెండు ప్రధాన శక్తికూటములు ఉన్నప్పటికీ నెహ్రూ భారతం అలీన ఉద్యమ బాటన సాగింది. నేడు రష్యాఉక్రెయిన్, పాలస్తీనాఇజ్రాయిల్, అమెరికా/ఇజ్రాయిల్ ఇరాన్ యుద్ధాల నడుమ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని కాపాడుకుంటూ ఆర్థికవృద్ధిని నమోదు చేసుకోవడంలో నమో పాలనా నైపుణ్యం కొనియాడాల్సిందే. అమెరికా, యూరప్, రష్యా, పశ్చిమాసియా, గ్లోబల్ సౌత్ దేశాలతో సత్సంబంధాలను సమర్థవంతంగా విస్తరించడంలో మోదీ కృతకృత్యులు కావడమే కాకుండా భారతదేశ ప్రతిష్ఠను ప్రపంచ దేశాల్లో ఇనుమడింపజేశారు.

**భారతదేశ చరిత్రలో ప్రధానులు:**

నాడు 1947లో పాకిస్థాన్‌తో పోరు, 1962లో చైనాతో సంఘర్షణలను భారత్ చవిచూసింది. నాడు నిరక్షరాస్య దేశంగా చూసిన భారతం నేడు పెద్ద ఐటీ శక్తిగా ఎదగడం శుభ పరిణామం. నమో నేతృత్వంలో "సంస్కరించు, సాధించు, పరివర్తన చెందు' అనే నినాదంతో ముందుడుగు వేస్తున్నది. నరేంద్రుడు పిఎంగా 44 అంతర్జాతీయ ప్రతిష్ఠాత్మక పురస్కారాలు సొంతం చేసుకొని ఆలోచనాత్మక దూకుడుతో అడుగులు వేస్తున్నారు. స్వతంత్ర భారత పిఎంలుగా నెహ్రూ 16 ఏండ్ల 286 రోజులు, 12 ఏండ్లు దాటి కొనసాగుతున్న మోదీ, 15 ఏండ్ల 350 రోజులు ఇందిరాగాంధీ, 10 ఏండ్ల 4 రోజులు మన్మోహన్ సింగ్, 6 ఏండ్ల 64 రోజులు వాజ్‌పాయ్, 5 ఏండ్ల 32 రోజులు రాజీవ్‌గాంధీ, 4 ఏండ్ల 330 రోజులు పి వి నరసింహారావుల వరసలో (మురార్జీ దేశాయ్, లాల్‌బహదూర్ శాస్త్రీ, వి పి సింగ్, ఐ కె గుజ్రాల్, దేవెగౌడ, చంద్రశేఖర్, చరణ్ సింగ్) చివరన 26 రోజులు గుర్జారీలాల్ నందా పిఎంగా పని చేశారు.

10 జూన్ 2026 రోజున మరో అరుదైన, అద్భుత రికార్డును పొందనున్న మోదీ మూడవ టర్మ్‌లో మరో మూడేళ్ల పాటు పిఎంగా సేవలు అందించే అవకాశం ఉంది. అదే జరిగితే మోదీ నెలకొల్పిన ఈ రికార్డును మరొకరు బద్దలు కొట్టడం నేటి అస్థిర రాజకీయ వ్యవస్థలో అసాధ్యంగానే తోస్తున్నది. ఏప్రిల్ 2029లో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎవరు పిఎం అవుతారో స్పష్టత లేనప్పటికీ నరేంద్ర మోదీ నెలకొల్పిన రికార్డు అరుదైనది, అద్వితీయమైనది.



మధుసూదన్ రెడ్డి
9949700037

# ఒంటరితనాన్ని ఓడించలేమా !



ఒంటరితనం ఓ మానసిక భావోద్వేగ ప్రక్రియ. కొందరికి ఒంటరితనం లేదా ఏకాంతం ఓ అద్భుత అవకాశంగా నిలిస్తే మరి కొందరిలో ఒంటరితనం ఓ అవాంఛనీయ అనారోగ్యకర సమస్యగా నిలుస్తున్నది. దాదాపు 50 శాతం జనాభా అంతర్ముఖులుగా ఒంటరితనాన్ని కోరుకుంటారు, అనారోగ్యాల బారిన పడతారు. కొందరికి ఒంటరితనం వరమయితే మరి కొందరికి అది శాపంగా మారుతోంది. పరిమిత ఒంటరితనం శారీరక, మానసిక వికాసానికి, సానుకూల భావనలు జనించడానికి దోహదపడుతుంది. మితి మీరిన ఒంటరితనం ప్రమాదకరంగా మారి చివరికి ప్రాణాంతకం కూడా అవుతుంది. ఒంటరితనాన్ని మనకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలు చేస్తే అది వ్యక్తి సంపూర్ణ శ్రేయస్సుకు ఉపకరిస్తుంది. ఒంటరితనానికి, ఏకాంతవాసానికి తేడా ఉన్నది. ఒంటరితనం అనేది ఒక భావోద్వేగ ప్రతికూల స్థితి. తాను ఇతరులతో కనెక్ట్ కావాలని కోరుకున్నప్పటికీ, వారి చుట్టు ఎవరూ లేరని భావించడాన్ని ఒంటరితనం అనవచ్చు. ఏకాంతం అనేది ఒక వ్యక్తి కావాలని ఒంటరిగా ఉండడం, తమ చుట్టు పక్కలకు దూరంగా ఉంటూ ఆలోచనలు చేయడం అని అర్థం చేసుకోవాలి. ఏకాంతం అనేది ఒక ఆశావహ ప్రయోజనకర మానసిక స్థితి.

ఒంటరితనం అవగాహన వారోత్సవాలు :

ఒంటరితనం అనేది రుగ్మతగా మారితే అత్యంత ప్రమాదకరం అవుతుందని, దాని పట్ల ప్రజలకు కనీస పరిజ్ఞానం అందించడానికి ప్రతి ఏట 09 నుంచి 15 జూన్ వరకు "ఒంటరితనం అవగాహన వారోత్సవాలు లేదా లోన్లీనెస్ అవేర్‌నెస్ వీక్" పాటించడం జరుగుతోంది. 2026 ఒంటరితనం అవగాహన వారం ఇతివృత్తంగా "ఒంటరితనానికి వ్యతిరేకంగా గళం విప్పుదాం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తారు. సహజమైన మానవ భావోద్వేగ ఒంటరితనం పట్ల ప్రజల్లో కళంకంగా భావించబడుతున్న వేళ దానిని అధిగమించడానికి పౌర సమాజం కూడా కృషి చేయాలి. ఒంటరితనం పట్ల నిర్భయంగా, బహిరంగంగా చర్చలు చేయాలి. ఒంటరితనం వలయంలో చిక్కిన అభాగ్యులతో మాట్లాడుతూ వారితో మానవ సంబంధాలు, సంభాషణలు పెరిగే విధంగా చూద్దాం.

ఒంటరితనం దుష్ప్రభావాలు:

నిశ్శబ్ద రుగ్మతగా సమాజంలో వ్యాపిస్తున్న ఒంటరితనాన్ని ఒక దురాచారంగా లేదా ప్రతిష్ఠకు మచ్చగా నిలుస్తున్న వేళ దాని పట్ల అవగాహన కల్పించడం జరగాలి. దీర్ఘకాలం పాటు ఒంటరితనాన్ని అనుభవించిన వారిలో తీవ్రమైన అనారోగ్యాలు కలుగుతాయి. ఒంటరితనం హద్దులు మీరితే మతిమరుపు, హృదయనాళ అనారోగ్య సమస్యలు, స్ట్రోక్, నిరాశ, ఆందోళన, అకాల మరణాలు, అలసట, ఆత్మన్యూనత భావం, మానసిక ఒత్తిడి లాంటి అనారోగ్యాలు కలుగుతాయి. ఒంటరితనం ఫలితంగా శారీరక, మానసిక, భావోద్వేగ, సామాజిక ప్రతికూలతలతో పాటు మానవ సంబంధాల సమస్యలు ఉత్పన్నం అవుతాయి.

ఏకాంతవాసం వల్ల ప్రయోజనాలు:

కొందరు వ్యక్తుల్లో ఒంటరితనం లేదా ఏకాంతవాసం పలు ప్రయోజనాలను కూడా కలిగిస్తుంది. వ్యక్తిగత ఎదుగుదల, ఆత్మ విమర్శ చేసుకునే అవకాశం, గత లోపాలను సరిదిద్దుకునే ఆలోచనలు, రేపటి ప్రణాళికల రచనలు, తనలోని బలాలు/బలహీనతలను విశ్లేషించుకునే సదవకాశం, లక్ష్యాసాధన మార్గాల అన్వేషణలు, తన గూర్చి తాను ఆలోచించుకోవడం, సృజనశీల ఆలోచనలు, ఉత్పత్తికి ఊతం, ఏకాగ్రత పెరుగుదల, ఇతరుల ప్రభావాలకు దూరంగా స్వతంత్ర భావాలకు పట్టం కట్టడం, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, సమతుల సామాజిక సంబంధాల్లో ప్రగతి, ఆత్మ విమర్శకు అవకాశం, విశ్రాంతి దొరకడంతో రేపటికి శక్తిని కూడగట్టుకోవడం లాంటి అనేక ప్రయోజనాలు ఒంటరితనానికి లేదా ఏతడకాంతవాసానికి ఉంటాయి.

ఒంటరితనాన్ని ఓడించడం ఎలా ?

ఒంటరితనాన్ని ఓడించి చురుకుగా, సరదాగా సమాజంతో మమేకం అవుతూ జీవితాన్ని ఆస్వాదించడానికి కొని చిట్కాలను తెలుసుకుందాం. మిత్రులు, బంధువులు, కుటుంబ సభ్యులతో కలివిడిగా ఉండడం, చొరవ తీసుకొని ఇతరులతో మాట్లాడడం, మన అభిరుచులకు తగిన బంధువులు/మిత్రులతో ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ వేదికల్లో గడపడం, మనకు ఇష్టమైన పనులను చేసి ఆలడనందాన్ని పొందడం, మన భావాలను దగ్గరి వారితో పంచుకోవడం/పరిష్కార మార్గాలను తెలుసుకోవడం, ఒంటరిగా, ముభావంగా ఉండే వారికి దగ్గర కావడం లాంటి చర్యలు ఒంటరితనమనే రుగ్మతను దూరం చేస్తాయి. ఒంటరితనాన్ని పరిమితం చేస్తూ, పౌర సమాజంతో దగ్గరవుతూ, సంతోష సాగరంలో మునుగుతూ, జీవితాన్ని సుసంపన్నం చేసుకుంటూ, ఎంపిక చేసుకున్న లక్ష్యాలను అధిగమిస్తూ, అందరి మన్ననలు పొందుతూ, చలాకీగా ప్రవర్తిస్తూ ఆయుకారోగ్యాలతో జీవితాంతం ఆనందంగా ఉందాం, ఆనందాన్ని పంచుదాం.

- మధుసూదన్ రెడ్డి
9949700037

# సుదీర్ఘ రాజకీయ అనుభవశాలి ఆచార్య రంగా

గోగినేని రంగనాయకులు... ఈ పేరు అంతగా ప్రాచుర్యం లేనిది. ఈ పేరు చెపితే దేశంలో గుర్తుపట్టే వారు దాదాపు ఉండక పోవచ్చు. ఆయన ఒక నిబద్ధత కలిగిన పాతతరం రాజకీయ నాయకులు. ఆయనను భారత రైతాంగ ఉద్యమపితగా భావిస్తారు.

సుదీర్ఘ పార్లమెంటేరియన్‌గా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కిన ప్రజాప్రతినిధి. లోక్‌సభలోనూ, ఇటు రాజ్యసభలోనూ 60 ఏళ్ళు రైతుల పక్షాన పోరాడిన నాయకులు. రాజకీయ అవగాహన కలిగిన వారికి ఇప్పుడు ఆయనెవరో స్ఫురణకు వచ్చి ఉంటుంది. రైతాంగ విధానాలకు మద్దతునిచ్చిన ఆయనే సుదీర్ఘ రాజకీయ నేపథ్యం ఉన్న ఆచార్య ఎన్.జి.రంగా.

రంగా, 1900, నవంబరు 7 న గుంటూరు జిల్లా నిడుబ్రోలులో గోగినేని నాగయ్య, అచ్చమాంబ దంపతులకు జన్మించారు. నిడుబ్రోలులో ప్రాథమిక విద్యను ముగించుకొని, గుంటూరు ఆంధ్రా క్రిష్టియన్ కళాశాల నుండి పట్టభద్రు లైనారు. 1924లో భారతీ దేవితో రంగా వివాహం జరిగింది.

1926 లో ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయం నుండి అర్థ శాస్త్రములో బి.లిట్ పొంది భారత దేశానికి తిరిగి వచ్చిన తర్వాత మద్రాసు లోని పచ్చయప్ప కళాశాలలో ఆర్థిక శాస్త్ర ఆచార్యునిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. ఆయన ప్రధానంగా హేతువాది. 1930లో మహాత్మా గాంధీ పిలుపుకు స్పందించి రంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. 1933లో రైతు కూలీ ఉద్యమానికి నేతృత్వం వహించారు. కిసాన్ కాంగ్రేస్ పార్టీని స్థాపించారు. రైతుకూలీల పరిస్థితిపై గాంధీతో చారిత్రాత్మక చర్చలు జరిపారు. ఈ చర్చలలోని ముఖ్యాంశాలపై "బాపు దీవెనలు" అన్న పేరుతో రంగా ఒక పుస్తకాన్ని వెలువరించారు. ఆంధ్రలో తొలిసారి రాజకీయ పాఠశాలలను ప్రారంభించిన ఖ్యాతి రంగాదే. నిడుబ్రోలులో రామనీడు పేరుతో రాజకీయ పాఠశాలను ఏర్పాటు చేసారు. 1933వ సం.లో రంగా స్థాపించిన రాజకీయ విద్యాలయాన్ని మహాత్మాగాంధీ ప్రారంభించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రులు నారా చంద్రబాబు నాయుడు , కొణిజేటి రోశయ్య కూడా రంగా శిష్యులే. ఆ పాఠశాల గత మధుర స్మృతులకు సజీవ సాక్ష్యంగా నేటికి నిడుబ్రోలులో కొనసాగుతుంది. తొలి రాజకీయ పాఠశాలలో పుచ్చలపల్లి సుందరయ్యతో సహా కొందరు కమ్యూనిసులూ పాల్గొన్నారు. రంగా ఆంగ్లంలోను, తెలుగులోను మంచి రచయిత. 'హరిజన నాయకుడు' అనే నవల కూడా రాశారు. ఆంధ్ర రాజకీయాలలో గాంధీ అనుచరుడిగా పట్టాభి సీతారామయ్య ఉండగా, రంగా గాంధీకి సన్నిహితుడు కాలేక పోయారు. అయినా పార్టీ సిద్ధాంత పరంగా గాంధేయుని గానే కొనసాగారు. సుభాస్ చంద్ర బోస్ అంటే ఇష్టపడేవారు. 1937 నుంచి వాహిని అనే పత్రికను నడిపారు.

1938 నాటికే ఇందూలాల్ యాగ్నిక్‌తో కలిసి కిసాన్ సభలు నిర్వహించారు. ప్రకాశం పంతులుతో కలిసి ఆంధ్ర రాజకీయాలలో కీలక పాత్ర వహించిన రంగాకు చాలా మంది శిష్యులు ఉండేవారు. గౌతు లచ్చన్న, పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, కందుల ఓబుల రెడ్డి, చేగిరెడ్డి బాలిరెడ్డి, ఎన్.వి. నాయుడు, నీరుకొండ రామారావు, బీశెట్టి అప్పారావు, పి.రాజగోపాల నాయుడు ఇత్యాదులు ఎందరో రంగా పిలుపు నందుకొని రాజకీయాలలో ప్రవేశించారు. స్వాతంత్ర్య పోరాటంలో నిర్విరామంగా పాల్గొన్న రంగా అనేక పర్యాయాలు జైలు పాలయ్యారు. జైళ్ళలోకూడా రాజకీయ ఖైదీలకు పాఠశాలలు నిర్వహించారు. ఇంగ్లాండ్‌లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయంలో ఉన్నత విద్యాభ్యాసం చేశారు. మద్రాసు లోని పచ్చయప్పాస్ కళాశాలలో ఆర్థిక శాస్త్రాచార్యుడిగా చేరి నాలుగేళ్ళ పాటు ఉన్నప్పుడు రంగాకు విద్యార్థిగా అన్నాదొరై తమిళనాడు ముఖ్యమంత్రి) ఉండేవారు.

రంగా, అంతర్జాతీయ వ్యవసాయ ఉత్పత్తిదారుల సమాఖ్య వ్యవస్థాపకులలో ఒకరు. 1946లో కోపెన్ హేగెన్‌లో జరిగిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ సదస్సులో, 1948లో శాన్ ఫ్రాన్సిస్కోలో జరిగిన అంతర్జాతీయ శ్రామిక సంస్థ సదస్సులోనూ, 1952లో ఒట్టావాలో జరిగిన అంతర్జాతీయ కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సులోను, 1954లో న్యూయార్కులో జరిగిన ఇంటర్నెషనల్ పెజెంట్ యూనియన్, 1955లో టోక్యోలో జరిగిన ఆసియన్ కాంగ్రెస్ ఫర్ వరల్డ్ గవర్నమెంటు లోను భారత దేశం తరఫున ప్రతినిధిగా పాల్గొన్నారు.

స్వాతంత్ర్యానంతరం తొలి ఎన్నికలు వచ్చేనాటికి ముఠా తగాదాల కారణంగా రంగా కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చి కృషీకార్ లోక్ పార్టీ స్థాపించారు. ఆ ఎన్నికలలో చిత్తూరు, శ్రీకాకుళం జిల్లాల్లో మాత్రమే కృషీకార్ లోక్ పార్టీ అభ్యర్థులు గెలిచారు. తరువాత సహకార రంగ వ్యవసాయానికి బద్ధ వ్యతిరేకి అయిన రాజాజీతో కలిసి స్వతంత్ర పార్టీని స్థాపించారు. రంగా స్వతంత్ర పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులై ఒక దశాబ్దం పాటు నిర్వహించారు. 1962 సార్వత్రిక ఎన్నికలలో పార్టీ 25 స్థానాలలో గెలిచి బలమైన ప్రతి పక్షముగా రూపుదిద్దు కొన్నది. 1972లో రంగా తిరిగి కాంగ్రెస్ (ఐ)లో చేరి, ఇందిరా గాంధీ కి సన్నిహితులై చివరి వరకూ కాంగ్రెస్ లోనే కొనసాగారు.

నెహ్రూ నాయకత్వాన్ని, ఆయన ప్రతిపాదించిన సహకార వ్యవసాయాన్ని కాదని దేశ వ్యాప్తంగా స్వతంత్ర పార్టీ ఏర్పడగా, దానికి తొలి అధ్యక్షులుగా ఆచార్య రంగా ఉన్నారు. రాజగోపాలాచారి, మినూ మసానీ, పీలూ మోడీ, రత్నస్వామి, బెజవాడ రామచంద్రా రెడ్డి మొదలైనవారు ఎందరో రంగాతో చేతులు కలిపారు. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఏర్పడిన పార్టీలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి కూడా తొలిదశలో ఉన్నారు. క్రమేణా స్వతంత్ర పార్టీకి రంగా దూరం అవుతూ వచ్చారు. జాతీయ నాయకులలో అంబేద్కర్‌తో రంగా సన్నిహితంగా ఉండేవారు. రాజ్యాంగ సభకు అంబేద్కర్ పేరును ప్రతిపాదించడంలో ఆయన కీలకపాత్ర వహించారు. ఆంధ్రలో సంస్కరణ వివాహాలను రంగా ప్రోత్సహించారు.

1952 నుండి 62 వరకు తెనాలి, 62 నుండి 67 వరకు చిత్తూరు, 67 నుండి 70 వరకు శ్రీకాకుళం, 80 నుండి 84, 84 నుండి 89 వరకు, 89 నుండి 91వరకు మూడుసార్లు వరుసగా గుంటూరు లోకసభ నియోజకవర్గ స్థానాలకు ప్రాతినిథ్యం వహించారు.

1946లో కోపెన్ హేగన్‌లో జరిగిన వ్యవసాయ సమాఖ్యలో పాల్గొన్నారు. 1952లో కామన్వెల్త్ పార్లమెంటరీ సమావేశంలో పాల్గొని అటావా నగరంలో ప్రసంగించారు. 1954లో న్యూయార్క్‌లో జరిగిన అంతర్జాతీయ రైతు సమాఖ్యలో ప్రధానోపన్యాసం చేశారు. 1955లో టోక్యోలో జరిగిన 'ఏషియన్ కాంగ్రెస్ ఫర్ వరల్డ్ గవర్నమెంట్' సభలో సుదీర్ఘోపన్యాసం చేశారు. రైతు సమస్యల్ని అంతర్జాతీయ సభ ల దృష్టికి తీసుకువచ్చారు. పొగాకు, పత్తి రైతుల, చేనేత కార్మికుల సమస్యలకు అధిక సమయాన్ని వినియోగించారు. ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ పుంఖాను పుంఖంగా రచనలు చేశారు. రైతులు విప్లవోద్యమాలలో నిర్వహించిన పాత్రను అధ్యయనం చేసి రి వ ల్యూ ష న రీ పెజెంట్స్, ది క్రెడో ఆఫ్ వరల్డ్ పెజెంట్స్ అనే గ్రంథాలు రాశారు.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

# జాతీయం-అంతర్జాతీయం

## జూన్ 21న నీట్ పకడ్బందీగాపరీక్ష




హైదరాబాద్: గత నెల 3న నిర్వహించిన నీట్ పేపర్ లీక్ అయిన విషయం తెలిసిందే. రాజస్థాన్ లో పేపర్ లీక్ కారణంగా దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ రద్దు చేసింది. అదే విధంగా జూన్ 6న కాక్రోచ్ జనతా పార్టీ నీట్ పేపర్ లీక్‌ను వ్యతిరేకిస్తూ, కేంద్ర విద్యామంత్రి రాజీనామా చేయాలని జంతర్ మంతర్ పెద్ద యెత్తున్న ధర్నా కూడా చేశారు. తాజాగా కేంద్ర విద్యాశాఖ, NTA కీలక నిర్ణయం తీసుకున్నాయి. నీట్ పేపర్ సెట్ చేసిన ప్రొఫెసర్లకు లాక్ డౌన్ విధిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. మరోసారి పేపర్ లీకేజీ లాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఈ కఠిన నిర్ణయంతో లాక్ డౌన్ అమలు చేస్తున్నారు.

లాక్ డౌన్ పరీక్ష పూర్తయ్యేలోపు కొనసాగనుంది. అంటే జూన్ 21న పరీక్ష పూర్తయ్యేలోపు అజ్ఞాతంలోనే ఉండాల్సి వస్తుంది.లాక్ డౌన్ లో ఉన్న అధ్యాపకులకు ఫోన్ తో పాటు.. ఇంటర్నెట్ సదుపాయం లాంటివి ఏవీ ఉండవు. వారి దగ్గరికి వచ్చి పోయేవారిని ఎల్లప్పుడూ కెమెరా నిఘాలో పర్యవేక్షిస్తుంటారు. కేవలం ప్రభుత్వం అనుమతించిన వారినే వారి దగ్గరకు ప్రవేశం ఇస్తారు.

## యూరప్ పర్యాటకులకు 'టాక్స్' సెగ



నెదర్లాండ్స్ రాజధాని ఆమ్‌స్టర్‌డామ్ ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన పర్యాటక నగరాల్లో ఒకటి. కనువిందు చేసే నీటి కాలువలు, చారిత్రక భవనాలు, మ్యూజియంలు, సాంస్కృతిక వైవిధ్యంతో ఏటా కోట్లాది మంది సందర్శకులను ఆకర్షిస్తున్న ఈ నగరం ఇప్పుడు 'ఓవర్ టూరిజం' సమస్యను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో పర్యాటకుల సంఖ్యను నియంత్రించడంతో పాటు నగర నిర్వహణకు అదనపు నిధులు సమకూర్చుకునేందుకు ఆమ్‌స్టర్‌డామ్ సిటీ ప్రభుత్వం పర్యాటక పన్నును భారీగా పెంచే ప్రతిపాదనను ముందుకు తీసుకొచ్చింది.

**12.5 శాతం నుంచి 20 శాతానికి..**

ప్రస్తుతం ఆమ్‌స్టర్‌డామ్‌లో హోటళ్లు, హాస్టళ్లు, ఇతర వసతి కేంద్రాల్లో బస చేసే పర్యాటకులపై గది అద్దెపై 12.5 శాతం పర్యాటక పన్ను వసూలు చేస్తున్నారు. అలాగే క్రూయిజ్ నౌకల ద్వారా ఒక రోజు పర్యటనకు వచ్చే వారిపై ఒక్కొక్కరికి 15 యూరోలు అంటే భారత కరెన్సీలో సుమారు రూ.1650 పన్ను విధిస్తున్నారు.

కొత్త సంకీర్ణ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రణాళిక ప్రకారం 2027 నుంచి ఈ పన్నును 16 శాతానికి పెంచి, ఆ తర్వాత ప్రతి ఏడాది ఒక శాతం చొప్పున పెంచుతూ 2030 నాటికి 20 శాతానికి చేర్చనుంది. ఇది అమలైతే ప్రపంచంలోనే అత్యధిక పర్యాటక పన్నులు విధించే నగరాల్లో ఆమ్‌స్టర్‌డామ్ ఒకటిగా నిలవనుంది.

**నగరంపై పెరుగుతున్న ఒత్తిడే కారణం**

పర్యాటకం నగర ఆర్థిక వ్యవస్థకు కీలక ఆదాయ వనరు అయినప్పటికీ, అదే సమయంలో జనసమ్మర్థ ప్రదేశాలు, మౌలిక సదుపాయాలు, స్థానికుల జీవన ప్రమాణాలపై తీవ్ర ఒత్తిడిని సృష్టిస్తోందని సిటీ ప్రభుత్వం పేర్కొంది. అందుకే నగర నిర్వహణ, పరిశుభ్రత, భద్రత, చట్ట అమలు, మౌలిక వసతుల అభివృద్ధికి అయ్యే ఖర్చుల్లో పర్యాటకులు కూడా తగిన వాటా భరించాలని భావిస్తోంది. పన్ను పెంపు ద్వారా వచ్చే ఆదాయాన్ని నగరాన్ని మరింత పరిశుభ్రంగా, సురక్షితంగా, నివాసయోగ్యంగా తీర్చిదిద్దేందుకు వినియోగించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

**క్రూయిజ్ టెర్మినల్‌కు కూడా గుడ్‌బై?**

పన్ను పెంపుతో పాటు మరికొన్ని కఠిన నిర్ణయాలపై కూడా ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. సముద్ర క్రూయిజ్ నౌకల ద్వారా వచ్చే పర్యాటకుల సంఖ్యను తగ్గించేందుకు నగరంలోని ప్రధాన క్రూయిజ్ టెర్మినల్‌ను మూసివేసే ప్రతిపాదనను పరిశీలిస్తోంది. జాతీయ ప్రభుత్వం, ప్రాంతీయ అధికారులతో చర్చల అనంతరం ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై నిర్ణయం తీసుకోనుంది. అదనంగా, కాలువలపై బోటు టూర్లు, అద్దె పడవలు వంటి వినోద కార్యకలాపాలపై కూడా అధిక రుసుములు విధించే అవకాశాలు ఉన్నాయి. నగర కేంద్రంలోని కొన్ని భవనాలను కొనుగోలు చేసి, వాటి వినియోగాన్ని మార్చడం ద్వారా అధిక పర్యాటక ఒత్తిడిని తగ్గించే ప్రణాళికలను కూడా పరిశీలిస్తున్నారు.

**రెడ్ లైట్ ప్రాంతానికి ప్రత్యామ్నాయం**

ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఆమ్‌స్టర్‌డామ్ రెడ్ లైట్ డిస్ట్రిక్ట్‌పై ఒత్తిడిని తగ్గించేందుకు నగర దక్షిణ ప్రాంతంలో ప్రత్యేక "ఎరోటిక్ సెంటర్" ఏర్పాటు చేసే ప్రతిపాదనను కూడా సంకీర్ణ ప్రభుత్వం కొనసాగిస్తోంది. సెక్స్ వర్కర్లకు మరింత భద్రత కల్పించడం, నేర కార్యకలాపాల ప్రభావాన్ని తగ్గించడం, నగర కేంద్రంలో రద్దీని నియంత్రించడం ఈ ప్రణాళిక ప్రధాన లక్ష్యాలుగా పేర్కొంటున్నారు.

**పర్యాటకులను ఆహ్వానిస్తూనే నియంత్రణ**

గత కొన్నేళ్లుగా ఆమ్‌స్టర్‌డామ్ 'టూరిజం ఇన్ బ్యాలెన్స్' విధానాన్ని అమలు చేస్తోంది. పర్యాటకులను పూర్తిగా నిరోధించడం కాకుండా, నగర సామర్థ్యానికి మించి పెరుగుతున్న సందర్శకుల ప్రవాహాన్ని సమతుల్యం చేయడమే లక్ష్యమని అధికారులు చెబుతున్నారు. ప్రపంచ ప్రసిద్ధ మ్యూజియంలు, యునెస్కో వారసత్వ హోదా పొందిన కాలువల వలయం, సైకిల్ సంస్కృతి కారణంగా ఆమ్‌స్టర్‌డామ్ ఇప్పటికీ ఐరోపాలో అత్యధికులు సందర్శించాలనుకునే పర్యాటక గమ్యస్థానాల్లో ఒకటిగా కొనసాగుతోంది. అయితే ఇకపై అక్కడికి వెళ్లే పర్యాటకులు మరింత ఖర్చుకు సిద్ధంగా ఉండాల్సి రావచ్చు.

## మమతా బెనర్జీకి భారీ షాక్




**పశ్చిమబెంగాల్ :** మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ ఎంపీ సుఖేందు శేఖర్ రాయ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. టీఎంసీతో తన బంధాన్ని తెంచుకుంటున్నట్లు వెల్లడించారు. పార్టీ అసెంబ్లీ సభ్యుల్లో తిరుగుబాటు పార్లమెంట్ వైపు కూడా పాకొచ్చని ఇటీవలే ఆయన పార్టీ తీరుపై అసంతృప్తి వ్యక్తంచేశారు. టీఎంసీలో అంతర్గత విభేదాలు పెరుగుతున్న వేళ ఆయన పార్టీ నుంచి వైదొలగడం ప్రాధాన్యం సంతరించుకుంది. టీఎంసీలో అత్యంత వాక్చాతుర్యం గల సీనియర్ నాయకులలో ఒకరిగా సుఖేందు పేరు సంపాదించారు.పార్టీని వీడుతున్నట్లు సుఖేందు తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీకి లేఖ రాశారు. అందులో పార్టీలో విచ్చలవిడిగా పెరిగిపోయిన అవినీతిని, మహిళలపై తీవ్ర అణచివేతను, విద్య, ఆరోగ్య సంరక్షణ, పరిశ్రమ, ఉపాధి, శాంతిభద్రతలతో సహా పలు రంగాలలో నెలకొన్న తీవ్ర అరాచకాన్ని ప్రజలు తిరస్కరించారని పేర్కొన్నారు. మరోవైపు భాజపాపై ప్రశంసలు కురిపించారు. బెంగాల్ చరిత్రలో తొలిసారిగా ఓటర్లు ఆ పార్టీకి భారీ విజయాన్ని అందించారన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీల అమలు దిశగా కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించిందని ప్రశంసించారు. ఇప్పటికే దాదాపు 61 మంది ఎమ్మెల్యేలు పార్టీ రెబల్ నేత రితబ్రతకు మద్దతివ్వడంతో శాసనసభలో ప్రతిపక్ష నాయకుడిగా స్పీకర్ ఆయనను నియమించారు. అసమ్మతి ఎమ్మెల్యేలతో ఆ పార్టీ ఎంపీలు కూడా టచ్‌లో ఉన్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో సుఖేందు తన పదవికి రాజీనామా చేయడం గమనార్హం. మరో ఎంపీ కోయల్ మల్లిక్ కూడా తన రాజ్యసభ స్థానానికి రాజీనామా చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరో 14మంది టీఎంసీ ఎంపీలు బెంగాల్ సీఎం సువేందు అధికారిని కలిసినట్లు మీడియా వర్గాలు వెల్లడించాయి. వారు భాజపాలో చేరనున్నట్లు తెలుస్తోంది.



చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌తో చర్చలు జరిపేందుకు సోమవారం ప్యాంగ్‌యాంగ్‌కు చేరుకున్నారని చైనా జిన్హువా వార్తా సంస్థ నివేదించింది. ఇరు నేతలు ఇరు దేశాల మధ్య దీర్ఘకాలిక స్నేహాన్ని కొనసాగించడానికి,
ద్వైపాక్షిక సంబంధాలను మరింత అభివృద్ధి చేసే దిశలో చర్చలు జరగనున్నాయని జిన్హువా వార్తా సంస్థ వెల్లడించింది.దాదాపు ఈ ఏడేళ్లలో తొలిసారి జిన్‌పింగ్ ఉత్తరకొరియాలో పర్యటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.2024లో రష్యా అధ్యక్షుడు పుతిన్ ఉత్తరకొరియాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇరు నేతలు రక్షణ ఒప్పందంపై సంతకాలు చేశారు.

## బీరుట్‌పై ఇజ్రాయిల్ దాడులు

- **ఇరాన్ డ్రోన్లను కూల్చేశాం**
- **అమెరికాపశ్చిమాసియాలో ఆగని ఉద్రిక్తతలు**



**టెహ్రాన్/వాషింగ్టన్ :** **వుదయం డెస్క్** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడుస్తూ దాడులు, ప్రతి దాడులు కొనసాగుతున్నాయి. ఆదివారం ఇజ్రాయిల్ సేనలు లెబనాన్‌పై దాడులు కొనసాగించగా, అమెరికా ఇరాన్ డ్రోన్‌లను కూల్చివేసింది. మరోవైపు కువైట్, బహ్రెయిన్‌లలో ఉన్న అమెరికా స్థావరాలపై క్షిపణులతో ఇరాన్ ప్రతిదాడి చేసింది. బీరుట్‌పై భీకర దాడులు.. లెబనాన్‌లో రాజధాని బీరుట్‌పై ఆదివారం ఇజ్రాయిల్ సేనలు దాడులను ఉధృతం చేశాయి. మార్చి 2 నుంచి లెబనాన్‌పై ఇజ్రాయిల్ జరిపిన ఘోరమైన దాడుల్లో దాదాపు 3,613 మంది మృతి చెందారని, వేలాది మంది గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇజ్రాయిల్, హిజ్బుల్లా మధ్య ఇటీవలే కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ దాడులు ఏ మాత్రం ఆగడం లేదు. దక్షిణ లెబనాన్‌లో ఓ సైనిక వాహనంపై ఇజ్రాయిల్ జరిపిన దాడిలో ఇద్దరు లెబనాన్ సైనికాధికారులు, ఓ సైనికుడు మరణించారు. నబాటియే జిల్లాలో జిఫ్తా రోడ్డుపై ఒక మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిపై దాడి చేసి హత్య చేసింది. దువైర్ పట్టణంలోని ఘమికా పరిసర ప్రాంతంలో నివాస ప్రాంతాలపై ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు దాడులు చేసి ధ్వంసం చేశాయి. నబాతియే నగరం,కఫోర్ పట్టణంపై కూడా కాల్పులు జరిగాయని, అబ్బా,దువైర్ పట్టణాల మధ్య ఉన్న వాతాఅబ్బా రహదారిపై డ్రోన్ దాడి చేయడంతో, ఇద్దరు సిరియన్లు మరణించగా, అనేక మంది గాయపడ్డారని హర్మూజ్ జలసంధిలో ఇరాన్‌కు చెందిన డ్రోన్‌లను కూల్చివేశామని అమెరికా ప్రకటించింది. జలసంధికి ముప్పు కల్గిస్తున్నాయని అందుకే వాటిపై దాడి చేసామంటూ అమెరికా అధికారులు పేర్కొన్నారు. అయితే అమెరికా తరచూ తన వైఖరిని మార్చుకుంటూ దాడులు చేస్తుందని, పరస్పర విరుద్ధ వైఖరులు అవలంబిస్తోందని, అందుకే శాంతి చర్చలు ముందుకు సాగడం లేదని ఇరాన్ విమర్శించింది. ఇరాన్ విదేశాంగ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘై ఆదివారం టెహ్రాన్‌లో ఒక వార్తా సంస్థతో మాట్లాడుతూ పాకిస్తాన్ మధ్యవర్తుల ద్వారా అమెరికాతో సందేశాలు పంచుకుంటున్నామని చెప్పారు. 'వైఖరులను తరచూ మార్చుకుంటున్న కారణంగానే ట్రంప్ ప్రభుత్వంతో చర్చలు జరపడం ఇబ్బందిగా ఉంది. లక్ష్యాలను మార్చుకోవడం, విభిన్న ప్రకటనలు చేయడం, అధికారులు పరస్పర విరుద్ధమైన వ్యాఖ్యలు చేయడం... ఇవన్నీ చర్చలకు ప్రతిబంధకంగా ఉన్నాయి' అని అన్నారు. ఇరాన్ హక్కులను గుర్తించాలన్న విషయాన్ని అమెరికన్లు అర్థం చేసుకోవాలని, అదే ప్రధాన విషయమని తెలిపారు.
అంతర్జాతీయ అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం కింద శాంతియుత అణు శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఇరాన్‌కు హక్కు ఉన్నదని విషయాన్ని కూడా వారు గ్రహించాలని చెప్పారు. 'అదే సమయంలో స్తంభింపజేసిన మా ఆస్తుల గురించి అడుగుతుంటే వారు ఎలాంటి రాయితీలు ఇవ్వడం లేదు' అని అన్నారు.

## ఉత్కంఠ పోరులో పాక్‌పై భారత్ ఘన విజయం

**20 పరుగుల తేడాతో చిరకాల ప్రత్యర్థి చిత్తు!**



**వుదయం డెస్క్** సిప్రి ఇయర్‌బుక్ 2026 ప్రకారం.. భారత్ వద్ద ప్రస్తుతం సుమారు 190 అణు వార్‌హెడ్స్ ఉండగా, పాకిస్థాన్ వద్ద సుమారు 170 మాత్రమే ఉన్నాయని అంచనా వేసింది. ఇరు దేశాలు 2025లో కూడా తమ అణు ఆయుధ వ్యవస్థలను ఆధునీకరించడంపై దృష్టి పెట్టాయని.. ముఖ్యంగా భారత్ తన దీర్ఘశ్రేణి అణు సామర్థ్యాన్ని పెంచుకుంటూ చైనా వరకు చేరగలిగే డెలివరీ సిస్టమ్స్ అభివృద్ధిపై దృష్టి పెట్టినట్లు నివేదిక పేర్కొంది. అదే సమయంలో పాకిస్థాన్ కూడా ఫిషైల్ మెటీరియల్ సేకరణ, కొత్త డెలివరీ సిస్టమ్స్ అభివృద్ధిని కొనసాగిస్తున్నట్లు తెలిపింది.

**ఆపరేషన్ సిందూర్ టైంలో..**

2025 మే నెలలో భారత్-పాక్ మధ్య చోటుచేసుకున్న సైనిక ఉద్రిక్తతను సిప్రి "అసాధారణంగా తీవ్రమైన మిలిటరీ క్రైసిస్"గా అభివర్ణించింది. అయితే అణు ఘర్షణ దిశగా వెళ్లకుండా ఇరు దేశాలు నియంత్రణ పాటించినట్లు నివేదిక స్పష్టం చేసింది. అయినప్పటికీ భవిష్యత్తులో ప్రమాదాలు పెరుగుతున్నాయని హెచ్చరించింది.
ప్రపంచ స్థాయిలో చూస్తే మొత్తం 9 అణు దేశాల వద్ద కలిపి సుమారు 12,241 వార్‌హెడ్స్ ఉన్నాయని సిప్రి తెలిపింది. వీటిలో అత్యధికంగా అమెరికా, రష్యా వద్దే అధిక భాగం ఉండగా, చైనా వేగంగా తన అణు సామర్థ్యాన్ని విస్తరిస్తోందని నివేదిక పేర్కొంది. చైనా వద్ద ఇప్పటికే సుమారు 620 వార్‌హెడ్స్ ఉన్నాయని అంచనా. భారత్ విషయానికి వస్తే..
కొత్త తరహా అణు ఆయుధ వ్యవస్థలు, దీర్ఘశ్రేణి క్షిపణులు అభివృద్ధి చేయడం ద్వారా తన వ్యూహాత్మక స్థాయిని పెంచుకుంటోందని సిప్రి స్పష్టం చేసింది. పాకిస్థాన్ కూడా తన అణు శక్తిని విస్తరించే ప్రయత్నాల్లో ఉందని, వచ్చే దశాబ్దంలో ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరించింది.

**డేంజర్ జోన్ ఎందుకంటే..**

సిప్రి నివేదికలో మరో కీలక అంశం కూడా వెలుగులోకి వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా అణు ఆయుధాలపై ఆధారపడే ధోరణి పెరుగుతోందని, డిసార్మ్‌మెంట్ ప్రయత్నాలు బలహీనపడుతున్నాయని స్పష్టం చేసింది. దేశాలు రక్షణ పేరుతో అణు ఆయుధాల వైపు మరింత మొగ్గు చూపుతున్నాయని, ఇది ప్రమాదకర పరిణామాలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించింది.
అణు ఆయుధాలపై పారదర్శకత తగ్గడం, దేశాల మధ్య చర్చలు-ఒప్పందాలు బలహీనపడటం, రాజకీయ ఉద్రిక్తతలు పెరగడం వల్ల.. భవిష్యత్తులో విపరీతాలు జరగొచ్చని సిప్రి నిపుణులు ఆందోళన చెందుతున్నారు. అవతలి దేశం దాడి చేయబోతుందనుకుని ఇవతలి దేశం పొరపడడం, చిన్న సంఘటనను పెద్ద ముప్పుగా భావించడం, అవసరం లేని సమయంలో సైనిక చర్యలకు వెళ్లడం లాంటివి జరిగే అవకాశం ఎక్కువగా జరగొచ్చని అంటున్నారు. పెద్ద దేశాల మధ్య చిన్న పొరపాటు కూడా పెద్ద యుద్ధ ప్రమాదంగా మారే అవకాశం ఉందంటూ గతంలో భారత్-పాక్ మధ్య గతంలో చోటు చేసుకున్న సైనిక ఘర్షణలను ప్రస్తావిస్తున్నారు.

## చాగోస్ దీవులపై ట్రంప్ నజర్



**వాషింగ్టన్:** హిందూ మహాసముద్రంలో అత్యంత కీలకమైన చాగోస్ దీవులను కొనుగోలు చేసేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యోచిస్తున్నట్లు వస్తున్న వార్తలు ఇప్పుడు అంతర్జాతీయంగా కలకలంరేపుతున్నాయి. గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేయాలనే ప్రతిపాదన తరహాలోనే, ఇప్పుడు బ్రిటన్‌ను పూర్తిగా పక్కనపెట్టి, చాగోస్ దీవులపై సార్వభౌమాధికారం ఉన్న మారిషస్‌తో అమెరికా నేరుగా ఒప్పందం కుదుర్చుకోవాలని చూస్తోంది. ఈ మేరకు అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ ఒక ప్రత్యేక ప్రతిపాదనను ట్రంప్ ముందుకు తెచ్చినట్లు ప్రముఖ అంతర్జాతీయ వార్తా సంస్థ 'టెలిగ్రాఫ్' వెల్లడించింది.అమెరికా రూపొందించిన ఈ సరికొత్త ప్రతిపాదన ప్రకారం.. బ్రిటన్‌తో సంబంధం లేకుండా చాగోస్ దీవులను నేరుగా మారిషస్ నుండి కొనుగోలు చేయాలని ట్రంప్ యంత్రాంగం భావిస్తోంది. అయితే దీనికంటే ముందు ఆ దీవులకు పూర్తి సార్వభౌమాధికారం లభించాల్సి ఉంటుంది. ప్రస్తుతం పరిశీలనలో ఉన్న పలు ఆప్షన్లలో ఇది ప్రాథమిక దశలోనే ఉన్నప్పటికీ, అమెరికా అధికారుల్లో దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చైనాకు మిత్రదేశంగా ఉన్న మారిషస్‌కు ఈ భూభాగాన్ని పూర్తిగా అప్పగిస్తే, అక్కడ గూఢచర్య ముప్పు పెరిగే అవకాశం ఉందని కొందరు అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మధ్య హిందూ మహాసముద్రంలో ఉన్న ఈ చాగోస్ దీవులలోని 'డియెగో గార్సియా' సైనిక స్థావరం అమెరికాకు అత్యంత వ్యూహాత్మకమైనది. ప్రస్తుతం ఇరాన్‌తో నడుస్తున్న ఉద్రిక్తతల నేపథ్యంలో, ఇరాన్ నుండి సుమారు 3,800 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ బేస్ నుండి అమెరికా లాంగ్‌రేంజ్ మిసైళ్లను ప్రయోగించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. గత మార్చిలో ఈ సంయుక్త సైనిక స్థావరంపై ఇరాన్ క్షిపణి దాడులకు ప్రయత్నించగా, అమెరికా యుద్ధనౌక దాన్ని తిప్పికొట్టింది. ఇరాన్ క్షిపణి కేంద్రాలపై దాడులు చేసేందుకు యూకే ఆలస్యంగా అనుమతి ఇవ్వడంపై ట్రంప్ గతంలోనే అసంతృప్తి వ్యక్తం చేశారు.
యూకే హ్యాండ్‌ఓవర్ సస్పెన్స్.. శరణార్థుల ఆవేదన ఈ దీవుల సార్వభౌమాధికారాన్ని మారిషస్‌కు బదిలీ చేసే ప్రక్రియకు అమెరికా మద్దతు ఉపసంహరించుకోవడంతో, గత ఏప్రిల్‌లోనే దీనికి సంబంధించిన చట్టం నిలిచిపోయింది. తాజాగా బ్రిటన్ ప్రభుత్వ ప్రతినిధి స్పందిస్తూ.. డియెగో గార్సియాపై నియంత్రణకు ముప్పు పొంచి ఉన్నందున, జాతీయ ప్రయోజనాల రక్షణ కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అమెరికా మద్దతు లేకుండా బ్రిటన్ ఎలాంటి సార్వభౌమత్వ ఒప్పందానికి ముందుకు వెళ్లబోదని స్పష్టం చేశారు.
మరోవైపు తమ జన్మభూమి భవిష్యత్తును బ్రిటన్ రాజకీయాలు హైజాక్ చేశాయని, స్వదేశానికి తిరిగి వెళ్లే హక్కు తమకు ఉందని చాగోస్ శరణార్థుల బృందం ఆవేదన వ్యక్తం చేస్తోంది.

## అమెరికా రైల్వే స్టేషన్‌లో కాల్పుల కలకలం


**న్యూయార్క్:** అమెరికాలోనే అత్యంత రద్దీగా ఉండే రవాణా కేంద్రాలలో ఒకటైన న్యూయార్క్ లోని పెన్ స్టేషన్ రక్తపాతానికి వేదికైంది. స్టేషన లోపల ఒక దుండగుడు విచక్షణారహితంగా కత్తులతో దాడికి తెగబడటంతో ఆరుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దారుణ ఘటనతో ఒక్కసారిగా అమెరికా ఉలిక్కిపడింది. ఆ సమయంలో స్టేషన్ లో ఉన్న ప్రయాణికులు భయాందోళనలతో పరుగులు తీశారు. సమాచారం అందిన వెంటనే రంగంలోకి దిగిన ఆమ్‌ట్రాక్ పోలీస్ డిపార్ట్‌మెంట్ నిందితుడిని చాకచక్యంగా అదుపులోకి తీసుకుంది. ప్రతిష్ఠాత్మక క్రీడా ఈవెంట్‌లు జరగనున్న తరుణంలో ఈ దాడి చోటుచేసుకోవడం కలకలం రేపుతోంది.

**రక్తసిక్తంగా మారిన రైల్వే స్టేషన్**

పెన్ స్టేషన్‌లోని ట్రాక్ 5, 6 సమీపంలో ఈ ఘోర దాడి జరిగింది. ఘటన జరిగిన ఆ ప్రాంతమంతా భీతావహంగా మారింది. న్యూయార్క్ ఫైర్ డిపార్ట్‌మెంట్, నగర మేయర్ జోహ్రాన్ మమ్దానీ స్పందిస్తూ, ఈ దాడిలో ఆరుగురు గాయపడ్డారని, వారిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించామని పేర్కొన్నారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం.

**మానసిక స్థితి సరిగ్గా లేని వ్యక్తే..**

ఈ దారుణానికి ఒడిగట్టిన నిందితుడి వివరాలను, దాడికి గల కారణాలను అధికారులు ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. అయితే నిందితుడు మానసిక వికలాంగుడైన ఒక నిరాశ్రయుడని భావిస్తున్నట్లు న్యూయార్క్ సిటీ కంప్ట్రోలర్ మార్క్ లెవిన్ తెలిపారు.
ఈ దాడిని న్యూయార్క్ గవర్నర్ క్యాథీ హోచుల్ తీవ్రంగా ఖండించారు. ఇదొక 'భయంకరమైన హింసాత్మక చర్య' అని అభివర్ణించిన ఆమె, ప్రజల భద్రతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. పోలీసులు ఈ దాడి వెనుక గల కారణాలపై దర్యాప్తు జరుపుతున్నారు
.ప్రతిష్ఠాత్మక టోర్నీల వేళ భద్రత కట్టుదిట్టంమరో కొన్ని రోజుల్లో న్యూయార్క్ నగరం రెండు ప్రధాన క్రీడా ఈవెంట్‌లకు ఆతిథ్యం ఇవ్వబోతున్న తరుణంలో ఈ ఘటన జరగడం భద్రతా సంస్థలను ఆందోళనలో పడేసింది. మేడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో ఎన్‌బీఏ ఫైనల్స్ (గేమ్స్ 3, 4), అలాగే పొరుగున ఉన్న న్యూజెర్సీలోని మెట్‌లైఫ్ స్టేడియంలో జరిగే ఫిఫా వరల్డ్ కప్ మ్యాచ్‌ల కోసం నగరం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో నగరవ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు.
అత్యవసర చర్యల దృష్ట్యా పెన్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఏడీఎంసీని తొలగించాలి

**ఏడీఎంసీ తొలగింపునకు బీఆర్ఎస్ మహిళా విభాగం డిమాండ్! కలెక్టర్‌కు వినతి**

- **బిఆర్ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో కలెక్టర్కు ఏ డి యమ్ సి ని తొలగించాలని వినతి.**

**వరంగల్ జిల్లా**
**వుదయం ప్రతినిధి జూన్ 8.**




వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదకు బి ఆర్ ఎస్ మహిళ విభాగం ఆధ్వర్యంలో ఏడి ఎం సి ని తొలగించాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సంపేట పట్టణ మహిళా సమైక్యలో ప్రభుత్వ పోస్టును నామినేట్ పోస్టులాగా నిబంధనలకు విరుద్ధంగా నియమించిన ఏడిఎంసి ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ భారత రాష్ట్ర సమితి మహిళా విభాగం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సత్య శారదను కలిసి గ్రీవెన్ సెల్ లో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు వాసం కరుణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా నర్సంపేట పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాలతో ప్రభుత్వ పోస్టు సైతం నోటిఫికేషన్ క్వాలిఫికేషన్ లేని వ్యక్తులకు రాజకీయ నామినేట్ పోస్టులాగా నియమించడం ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రలో నర్సంపేట అంతర్భాగం కాదా లేదా ప్రభుత్వ నిబంధనలు, ప్రత్యేక రాజ్యాంగం సపరేట్ గా ఉన్నాయా అని ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎ డి యం సి ల బదిలీల లో భాగంగా మే 4 న జనగామ నుండి నర్సంపేట కు బదిలీ అయి వచ్చిన ఎం డి యం సి ని జాయిన్ కాకుండా రాజకీయ వత్తిడి తెచ్చి వెనక్కి పంపడం వెనుక ఉన్న రహస్యం ఇదేనా నిన్నటిదాకా టిఎల్ఎఫ్ కు అధ్యక్షురాలుగా ఉన్న ఆమె రెండు సంవత్సరాల కాలంలో జరిగిన ఆర్థిక లావాదేవీలపై సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) చేయకుండా మహాసభ జరపకుండా కనీసం ఓబి కార్యవర్గానికి తెలియపరచకుండా రాజీనామా చేసిన వ్యక్తి ఎలా అర్హురాలు అయితదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. మెప్మా అధికారులు జిల్లా కలెక్టర్ స్పందించి తగు చర్యలు తీసుకోకపోతే సి డి ఎం ఏ వరకు కూడా వెళ్లి న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 18 వ వార్డు కౌన్సిలర్ దొమ్మటి రమ్య, 14వ వార్డు కౌన్సిలర్ భూస శిరీష, మహిళ నాయకురాలు వడ్లకొండ సరూప తదితరులు పాల్గొన్నారు.




## మన ఊరికే ప్రీ-ప్రైమరీ స్కూల్

**విద్యార్థుల నమోదు కోసం ఇంటింటి ప్రచారం**

**నల్లగొండ, జూన్ 8(వుదయం)**

11వ డివిజన్ కతాల్‌గూడ ప్రాథమిక పాఠశాలకు ప్రీప్రైమరీ పాఠశాల నిర్వహణకు అనుమతి లభించిన నేపథ్యంలో విద్యార్థుల నమోదు కోసం గ్రీన్ సిటీ కాలనీలో సోమవారం ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న విద్యా సదుపాయాలు, ప్రీప్రైమరీ విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. తమ పిల్లలను సమీప ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి నాణ్యమైన విద్యను అందించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చాంద్ బీ, ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ దండెంపల్లి సరోజ, మాజీ కౌన్సిలర్ దండెంపల్లి సత్తయ్య, వార్డు పెద్దలు కంకణాల నాగిరెడ్డి, పజ్జూరి పరమేష్, గ్రీన్ సిటీ కాలనీ అధ్యక్షుడు యాదయ్య, ఆర్పీ పజ్జూరి మమత, ఉపాధ్యాయులు రాజశేఖర్, భవాని, సరిత తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ అధిక సంఖ్యలో విద్యార్థులను చేర్పించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## హాస్టళ్లు, స్కూళ్లపై ప్రత్యేక నిఘా

**పాఠశాలలు, వసతి గృహాల పునఃప్రారంభానికి పక్కా ఏర్పాట్లు చేయాలి**

- **మంత్రి సీతక్క**
- **కలెక్టరేట్ సమీక్షలో ఫోన్ ద్వారా దిశానిర్దేశం చేసిన రాష్ట్ర మంత్రి**
- **విద్యార్థుల భద్రత, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులకు ఆదేశం**

**ములుగు, జూన్ 08 (వుదయం ప్రతినిధి) :**



ములుగు జిల్లాలోని పాఠశాలలు, వసతి గృహాల పునఃప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారంతో పాటు సురక్షితమైన వాతావరణం కల్పించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. సోమవారం ములుగు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బోర్ఢే హేమంత్ సహదేవరావు, అదనపు కలెక్టర్లు మహేందర్ జీ, సంపత్ రావులతో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశానికి మంత్రి హైదరాబాద్ నుండి టెలిఫోన్ ద్వారా హాజరై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, వర్షాకాలం దృష్ట్యా విద్యాసంస్థల భవనాలు, తాగునీటి ట్యాంకులు, మరుగుదొడ్లను పూర్తిస్థాయిలో శుభ్రపరచాలని, దోమల నివారణకు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థుల్లో "నమస్కారం - మన సంస్కారం" అనే భావనను పెంపొందిస్తూ శ్రమదానం, విజ్ఞాన యాత్రలు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా ఆదివాసీ, గిరిజన విద్యార్థుల స్థానిక సంస్కృతీ సంప్రదాయాలను గౌరవిస్తూ విద్యా కార్యక్రమాలు ఉండాలని స్పష్టం చేశారు. వసతి గృహాల్లో ఆహార నాణ్యతపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. కాగా, పదో తరగతి ఫలితాల్లో ములుగు జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడంపై జిల్లా యంత్రాంగం, ఉపాధ్యాయులను మంత్రి అభినందించారు. జిల్లా కలెక్టర్ బోర్ఢే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో అధికారులు ఆర్వో ప్లాంట్లు, విద్యుత్ వైరింగ్, తాగునీటి సరఫరాను పరిశీలించి లోపాలు ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో విద్యాసంస్థల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించి, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. బాలికల వసతి గృహాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఆర్ఓ రవి కుమార్, ఆర్డీవో కృష్ణవేణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లే ప్రభుత్వ లక్ష్యం

**ఖమ్మం వుదయం బ్యూరో**
**కూసుమంచి, జూన్-08:**



ప్రతి అర్హులైన పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. సోమవారం కూసుమంచి మండలంలోని రాజుపేట, గట్టు సింగారం గ్రామాల్లో పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తోందన్నారు. కేవలం ఇళ్ల మంజూరుతోనే బాధ్యత ముగిసిపోయిందని భావించకుండా నిర్మాణ పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రతి సోమవారం బిల్లులు విడుదల చేస్తున్నామని తెలిపారు.రాజుపేట గ్రామంలో చన్నాప్రగడ సుభద్ర, దాసరి భద్రయ్య, కోట వీరారెడ్డి, సంద్ర ఎల్లమ్మ, గట్టు సింగారం గ్రామంలో గుంటి దుర్గా, గుడిపల్లి వెంకట నరసమ్మ, దేవర్ల మహేష్, గుడిపల్లి జ్యోతి నిర్మించుకున్న ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. రాజుపేట గ్రామంలో మంజూరైన గృహాల్లో నాలుగు పూర్తయ్యాయని, మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయని, గట్టు సింగారం గ్రామంలో 19 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, ఇప్పటికే 10 ఇళ్లు పూర్తై గృహ ప్రవేశాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు.ఈ లక్ష్యంతోనే రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించామని వెల్లడించారు. అర్హులైన చివరి లబ్ధిదారుడికి కూడా ఇందిరమ్మ ఇల్లు అందే వరకు దశల వారీగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇల్లు లేని పేద కుటుంబాలు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. నూతనంగా ఇళ్లు నిర్మించుకుని గృహ ప్రవేశం చేసిన కుటుంబాలకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త ఇంట్లో సుఖ సంతోషాలతో, ఆత్మగౌరవంతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శ్రీనివాస్, సంబంధిత ప్రజా అధికారులు, ఆర్డీ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు తక్షణ న్యాయం

**గ్రీవెన్స్ డేలో అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పి**




**సూర్యాపేట జూన్: 08**
**వుదయం ప్రతినిధి**

సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పి నరసింహ ఐపీఎస్ పిర్యాదుదారుల నుండి వినతులు స్వీకరించారు. జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితులు వివిధ సమస్యలపై ఫిర్యాదులకు సంబంధించి బాధితులు ఎస్పి గారిని ప్రత్యక్షంగా కలిసి వినతులు సమర్పించారు.ఈ సందర్భంగా ఎస్పి ప్రతి ఒక్క బాధితుడి సమస్యను విని, వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీస్ అధికారులుతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు జారీ చేశారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా, వారి సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అలాగే, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఎస్పి తెలిపారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

**యాదాద్రి భువనగిరి జిల్లా**
**జూన్ 8(వుదయం)**



ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. సోమవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి , వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 72 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 48, మున్సిపాలిటీ 7, సర్వే ల్యాండ్ 3, గ్రామీణ అభివృద్ధి 3, పిడి హౌసింగ్ 3, సంక్షేమ శాఖ 2, వ్యవసాయ, ఇరిగేషన్, ఉపాధి కల్పన, విద్య, బీసీ వెల్ఫేర్, ఎస్సీ కార్పొరేషన్ శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ , జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి , ఆర్డీవో శేఖర్ రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కోదాడలో అవినీతి రాజ్యం

**: మల్లయ్య యాదవ్**
**కోదాడ, జూన్ 8(వుదయం)**




కోదాడ నియోజకవర్గంలో అభివృద్ధి కంటే అవినీతి, అక్రమాలకే ప్రాధాన్యం లభిస్తోందని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆరోపించారు. పట్టణంలోని దుర్గాపురం సమీపంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

మున్సిపల్ కార్యాలయం తరలింపునకు రూ.25 లక్షలు, సెంట్రల్ లైటింగ్ పనులకు టెండర్లు లేకుండానే రూ.50 లక్షలు ఖర్చు చేయడంపై ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో ఖర్చుల వ్యవహారంలో పారదర్శకత కొరవడిందని,సమావేశాల నిర్వహణ పేరుతో అధిక మొత్తాలు బిల్లులుగా చూపుతున్నారని విమర్శించారు.

పట్టణంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు, పెద్ద చెరువు పరిధిలో కబ్జాలు పెరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. అక్రమ ఇసుక రవాణా, చెరువుల నుంచి మట్టి తరలింపును అరికట్టడంలోనూ సంబంధిత శాఖలు విఫలమయ్యాయని ఆరోపించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శంకుస్థాపనలకే పరిమితమవుతున్నాయని, ప్రజలకు ఉపయోగపడే పనుల అమలుపై పర్యవేక్షణ లేదన్నారు. రెవెన్యూ అధికారులు రాజకీయ ప్రభావాలకు లోనుకాకుండా విధులు నిర్వహించాలని సూచించారు.

పట్టణంలో నేరాల నియంత్రణలో పోలీసు వ్యవస్థ విఫలమైందని, చట్ట అమలులో రాజకీయ పక్షపాతం కనిపిస్తోందని విమర్శించారు. మున్సిపల్ ఉద్యోగ నియామకాల్లో అవకతవకలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కోదాడలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, ప్రజా సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే స్పష్టత ఇవ్వాలని మల్లయ్య యాదవ్ కోరారు. ప్రజాధనాన్ని కాపాడడంలో ప్రభుత్వం, అధికారులు విఫలమైతే ప్రజల తరఫున ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కోదాడ పట్టణ అధ్యక్షులు ఖాజా, తొగర్రాయి మాజీ సర్పంచ్ దొంగల లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కార లక్ష్యమే ప్రజాదివాస్

**జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**
**జయశంకర్ భూపాలపల్లి జూన్ 08(వుదయం జిల్లా ప్రతినిధి)**



ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కార లక్ష్యమే ప్రజాదివాస్ జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ప్రజాదివాస్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన పిర్యాదుదారుల నుండి మొత్తం 15 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తక్షణ సూచనలు చేశారు. ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ, సంబంధిత పోలీస్ స్టేషన్ల సిఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి, సమస్యల పరిష్కారానికి అవసరమైన దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజలకు మరింత చేరువగా ఉండడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు.ప్రతి సోమవారం ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత అధికారుల సహకారంతో వాటిని పరిష్కరిస్తున్నామని, ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు.

## నక్ష పైలట్ ప్రాజెక్టును వేగవంతంగా పూర్తి చేయాలి

- **రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు**
- **మణుగూరు మున్సిపాలిటీలో నక్ష సర్వే పనులు పురోగతిలో ఉన్నాయి : జిల్లా కలెక్టర్**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 8 (వుదయం ప్రతినిధి)**



భూముల రీసర్వే, పట్టణ భూముల హద్దుల గుర్తింపు కార్యక్రమాల పురోగతిపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. రాష్ట్రంలో వివాదాలు లేని పారదర్శక భూపరిపాలన వ్యవస్థను తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం డిజిటల్ సర్వే కార్యక్రమాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ నక్ష పైలట్ ప్రాజెక్టులకు ఎంపికైన జిల్లాల్లో సర్వే మరియు రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేసి క్షేత్రస్థాయిలో రోవర్ పరికరాల ద్వారా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ఆస్తులకు ఖచ్చితమైన సర్వే చేపట్టి, రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్ఓఆర్) నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో ఐడీఓసీ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నక్ష పైలట్ ప్రాజెక్టు కింద జిల్లాలోని మణుగూరు మున్సిపాలిటీ ఎంపికైందని తెలిపారు. ప్రాజెక్టు అమలులో భాగంగా సర్వే మరియు రెవెన్యూ శాఖల ద్వారా క్షేత్రస్థాయిలో సర్వే పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. మున్సిపల్ శాఖ ద్వారా ఆర్ఓఆర్ నమోదు ప్రక్రియ ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని వివరించారు.మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 15 రెవెన్యూ వార్డులు ఉండగా, వాటిని 97 బ్లాక్‌లుగా విభజించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ప్రాంతంలో సుమారు 7,524 ఆస్తులను గుర్తించడం జరిగిందని, వాటిలో 5064 ఆస్తుల సర్వే పూర్తయిందని చెప్పారు. అలాగే 2,074 ఆస్తులకు సంబంధించిన డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. నక్ష ప్రాజెక్టు లక్ష్యాలను నిర్దేశిత గడువులో పూర్తి చేసి ప్రజలకు పారదర్శకమైన భూ రికార్డులను అందుబాటులోకి తీసుకురావడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పనిచేస్తున్నాయి అని తెలిపారు . ఈ వీడియో కాన్ఫరెన్స్లో ఏడి సర్వే శ్రీనివాస్,మణుగూరు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నీట్-2026 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- **జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**

**హనుమకొండ, జూన్ 08 (వుదయం జిల్లా ప్రతినిధి) :**



ఈ నెల 21వ తేదీన జరగనున్న నీట్ 2026 (NEETUG) ప్రవేశ పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో ఆమె అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని 12 పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని సూచించారు.

మౌలిక సదుపాయాలు, పరీక్షా కేంద్రాల్లో నిరంతరాయ విద్యుత్ సరఫరా, తాగునీరు, సీసీ కెమెరాలు, లైటింగ్, ఫ్యాన్లు మరియు పరిశుభ్రమైన మరుగుదొడ్ల వసతి కల్పించాలి.భద్రత, ట్రాఫిక్ కేంద్రాల వద్ద శాంతిభద్రతలను కట్టుదిట్టం చేయడంతో పాటు, విద్యార్థులు సమయానికి చేరుకునేలా ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రత్యేక పోలీస్ ప్రణాళికను అమలు చేయాలి.

వైద్య సేవలు: వేసవి/వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి కేంద్రంలో ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు మరియు అవసరమైన వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలి.

గోప్యత: ప్రశ్నాపత్రాల రవాణా, భద్రత విషయంలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని, ఇన్విజిలేటర్లకు మార్గదర్శకాలపై పూర్తి అవగాహన కల్పించాలని ఆదేశించారు.

దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న పరీక్ష కాబట్టి, నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో నీట్ జిల్లా కోఆర్డినేటర్ బిక్షపతి, హనుమకొండ ఏసీపీ నరసింహారావు, కలెక్టరేట్ ఏఓ గౌరీశంకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.



## సపాయిలు వారే. గ్రామ పాలకులు వారే

**చిట్యాల జూన్ 08**
**(వుదయం ప్రతినిధి)**

***డ్లను శుభ్రం చేస్తూ శ్రమదానం చేశారు అంతేకాకుండా గ్రా మంలోని చెత్త సేకరణ చేస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచే విధంగా శ్రీకారం చుట్టారు***

తిరుమలపూర్ గ్రామంలో గ్రామ పాలకులు సపాయిల పని చేస్తుంటే గ్రామంలో సపాయిలు వారే గ్రామ పాలకులు వారే అనే పరిస్థితి నెలకొంది జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని తిరుమలపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీలో పారిశుధ్య సిబ్బంది కొరత ఉండడంతో వర్షాకాలం కావడం వలన గ్రామంలో ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు దానిని గమనించిన గ్రామ సర్పంచ్ జన్నె సురేష్ ఉప సర్పంచ్ నల్ల అశోక్, తోపాటు పాలకవర్గ సభ్యులు అంతా కలిసి స్వయంగా మురుగుకాల్వలు, రోడ్లను శుభ్రం చేస్తూ శ్రమదానం చేశారు అంతేకాకుండా గ్రామంలోని చెత్త సేకరణ చేస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచే విధంగా శ్రీకారం చుట్టారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామం పై ప్రభుత్వం ఎమ్మెల్యే తోపాటు జిల్లా స్థాయి అధికారులు దృష్టి సారించి సపాయిల కొరత లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఇలా ఉంటే గ్రామ పాలకులు సపాయిల పని చేస్తుంటే గ్రామంలోని ప్రజలు ప్రభుత్వ తీరుపై పలు రకాలుగా అనుకుంటున్నారు.

## ప్రజావాణిలో వినతులకు తక్షణ స్పందన

- **వికలాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లు మంజూరు**
- **వికలాంగుల జీవనోపాధికి తోడుగా బ్యాటరీ ట్రై సైకిళ్లు**

**జనగామ, జూన్ 08 (వుదయం ప్రతినిధి) :**



జిల్లాలోని ఘనపూర్ (స్టేషన్) మండల పరిధిలోని సముద్రాల గ్రామానికి చెందిన వికలాంగురాలు ఈగ పారిజాతం, అలాగే కొడకండ్ల మండలం నరసింగపురం గ్రామానికి చెందిన జేడీ చంద్రకళ తమ జీవనోపాధి కోసం బ్యాటరీ ట్రై సైకిల్ అవసరమని ఈరోజు ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వినతిపత్రాలు సమర్పించారు.తమ దైనందిన అవసరాలు తీర్చుకోవడం, స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవడం కోసం రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు తమ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.ఈ క్రమంలో వినతులను జిల్లా కలెక్టర్ వెంటనే సంబంధిత అదనపు కలెక్టర్ (రెవెన్యూ), వికలాంగుల సంక్షేమ శాఖ అధికారి (DWO) బెన్షాలోమ్ కు వారి అర్హతలు పరిశీలించి, తగిన చర్యలు తీసుకొని, ఇద్దరు లబ్ధిదారులకు బ్యాటరీ ట్రై సైకిళ్లు మంజూరు చేయాలని సూచించారు.అనంతరం శాఖాధికారులు అవసరమైన ప్రక్రియను పూర్తిచేసి, లబ్ధిదారులకు బ్యాటరీ ట్రై సైకిళ్లను అందజేశారు. ఈ చర్య ద్వారా వారి రవాణా సమస్యకు తక్షణ పరిష్కారం లభించింది.

*** లబ్ధిదారుల ఆనందం**

బ్యాటరీ ట్రై సైకిళ్లు అందుకున్న ఈగ పారిజాతం, జేడీ చంద్రకళలు సంతోషం వ్యక్తం చేశారు. తమకు ఇంత త్వరగా సహాయం అందుతుందని ఊహించలేదని వారు పేర్కొన్నారు. రోజువారీ అవసరాలకు, బయటకు వెళ్లడానికి, అలాగే చిన్నపాటి జీవనోపాధి పనులు చేసుకోవడానికి రవాణా సౌకర్యం లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు. ఇప్పుడు బ్యాటరీ ట్రై సైకిల్ అందడంతో స్వతంత్రంగా తిరగగలమని, ఇది తమ జీవితంలో పెద్ద మార్పు తీసుకువస్తుందని ఆనందం వ్యక్తం చేశారు.

ప్రజావాణిలో చేసిన వినతికి వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించిన జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ), డీడబ్ల్యూఓ లకు వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. వికలాంగులైన లబ్ధిదారులకు బ్యాటరీ ట్రై సైకిళ్లు అందజేయడం వారి జీవనోపాధికి, స్వతంత్ర జీవనానికి మరింత బలం చేకూర్చింది.ఈ ఘటన ద్వారా కలెక్టర్ స్పందనాత్మకత, సామాజిక సంక్షేమంపై ఉన్న కట్టుబాటు మరోసారి స్పష్టమైంది. ప్రజల సమస్యలకు వేగవంతమైన పరిష్కారాలు అందిస్తోంది. వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న సహాయ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో అమలవుతుండటానికి ఈ ఘటన మరో ఉదాహరణగా నిలిచింది.

## గాజుల గట్టు గ్రామములో ప్రజా పాలన

**మహబూబాబాదు జిల్లా/గూడూరు**
**జూన్ 8 (వుదయం ప్రతినిధి):-**




గూడూరు మండలంలోని గాజుల గట్టు హరిచంద్ర తండా గ్రామాలలో ప్రజా పాలన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. గ్రామ సభలో రైతులను ఉద్దేశించి ఏవో అబ్దుల్ మాలిక్ పలు సూచనలు చేసినారు. ఖేత బచావో అభియాన్ వరి కొయ్యలను కాల్చడము నిషేధించాలని నానో యూరియా వలన లాభాలు పంట మార్పిడి వలన నేల సారవంతం పెరుగుతుందని పురుగులు మరియు వ్యాధులు తగ్గుతాయని ఎరువుల ఖర్చు తగ్గుతుందని కలుపు మొక్కలు నియంత్రణలో ఉంటాయని ఉత్పత్తి ఎక్కువగా వస్తుందని నీటి వినియోగం సమర్థవంతముగా ఉంటుందని రైతులకు ఆర్థిక భద్రత కలుగుతుందని తెలిపినారు. ఈ కార్యక్రమములో గాజుల గట్టు సర్పంచ్ హరిచంద్ర తండా సర్పంచ్ ప్రజలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణకు విస్తృత తనిఖీలు



**మంథని, జూన్ 8**

జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంథని పట్టణంలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు మంథని ఎస్ఐ దేగా రమేష్ తెలిపారు. సోమవారం డాగ్ స్క్వాడ్ సిబ్బందితో కలిసి బస్టాండ్, పలు దుకాణాలు, విద్యా సంస్థల పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా అనుమానాస్పద వస్తువులు, మాదక ద్రవ్యాల నిల్వలు, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి పరిశీలించినట్లు తెలిపారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గంజాయి లేదా ఇతర నిషేధిత పదార్థాల విక్రయాలు, వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారని, ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఎస్ఐ దేగా రమేష్ పేర్కొన్నారు. డాగ్ స్క్వాడ్ సిబ్బంది, పోలీసు సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

## సమయపాలన తప్పనిసరి వైద్య సేవల్లో అలసత్వం వద్దు

**ప్రభుత్వ ఆసుపత్రిలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకస్మిక తనిఖీ**

**వర్షాకాలం నేపథ్యంలో వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి**

**రోగులకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం**

**మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి**

**ధర్మపురి,జూన్ 8(వుదయం ప్రతినిధి):**

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోం దని ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి పేర్కొన్నారు. సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆదేశాల మేరకు సోమ వారం ధర్మపురి పట్టణ కేంద్రంలో ని ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికం గా సందర్శించారు.ఆసుపత్రి పనితీరును,రోగులకు అందుతు న్న వైద్య సేవలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు.వర్షాకాలం ప్రారంభ మవుతున్న నేపథ్యంలో పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రమైన అన్ని రకాల వైద్య సేవలు, మందులను అందించేం దుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. పట్టణ ప్రజలు ఎలాంటి



ఈ తని ఖీలు చేపట్టారు.ఆసుపత్రిలోని ల్యాబ్‌లు,వైద్యులు,సిబ్బంది హాజరు పట్టిక, వైద్య పరికరాల లభ్యత, మందుల నిల్వలను పరిశీలించారు.ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకా శం ఉన్నందున వైద్య సిబ్బంది అంతా విధిగా సమయపాలన పాటించాలని ఆదేశించారు.ఆసు పత్రికి వచ్చే ప్రతి రోగికి సరైన వైద్యం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.ప్రజల ఆరోగ్యానికి అవస ఆరోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి, ఉచిత వైద్య సేవలను సద్విని యోగం చేసుకోవాలి. ఈ కార్య క్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, కౌన్సిలర్లు సంగనబట్ల సంతోషిని, చిపిరిశెట్టి రాజేష్, సంగి ఆనంద్,కొమురెల్లి పవన్, జంజీరిజాని.సువర్ణ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎస్ కే షౌకత్, సుల్తానా, అశెట్టి మమతతో, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు 50% ఫీజు రాయితీ ఇవ్వాలి

**సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా ( ఐ ఏ ఎస్ ) కు టి డబ్ల్యూ జే ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వడ్నాల వెంకన్న వినతి**



**కాగజ్‌నగర్, ( వుదయం ప్రతినిధి )**

ఎలాంటి వేతనాలు లేకుండా, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలిచి అహర్నిశలు శ్రమిస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ( టి డబ్ల్యూ జె ఎఫ్) కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు వడ్నాల వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం సబ్కలెక్టర్ శ్రద్ధా శుక్లా ఐఏఎస్ కు యూనియన్ నాయకులతో కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 80 శాతం మంది జర్నలిస్టులు ఎలాంటి నెలవారీ జీతాలు లేక, నిత్యావసరాల ధరలు పెరిగి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమాజం కోసం నిరంతరం తపించే జర్నలిస్టులు ప్రజాస్వామ్యంలో నాలుగవ స్తంభం అయినప్పటికీ కార్పొరేట్ విద్యాసంస్థల్లో వేలాది రూపాయల ఫీజులు చెల్లించలేక తమ పిల్లల చదువులను సాగించలేని దుస్థితిలో ఉన్నారన్నారు. జర్నలిస్టుల కుటుంబాల దయనీయ ఆర్థిక పరిస్థితులను మానవీయ కోణంలో పరిశీలించి, ప్రతి ఒక్క జర్నలిస్టు పిల్లలకు రాబోయే 2026–27 విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికే 50 శాతం ఫీజు రాయితీ వర్తించేలా తక్షణమే ప్రత్యేక సర్క్యులర్ జారీ చేయాలని సబ్ కలెక్టర్‌ను కోరారు.

# అధికారం కోసం పాకులాడే వారికి గులాబీ గూటిలో స్థానం లేదు

**గోడలు దూకే నాయకులకు నో ఎంట్రీ**

**కాంగ్రెస్ అక్రమ కేసులకు భయప డొద్దు లీగల్ సెల్ అండగా ఉంటుంది**

**రెండేళ్లలోనే ధర్మపురిలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం కష్టపడే కార్యకర్తలే మా బలం**

**బీఆర్ ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం సభ్యత్వాల నమోదు**

**బీఆర్ ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి,మాజీ మంత్రి కొప్పుల**

**ధర్మపురి,జూన్ 8(వుదయం ప్రతినిధి):**

కార్యకర్తల కోసం, పార్టీ కోసం ప్రాణం పెట్టి నిలబడే నాయకులే బీఆర్ఎస్ పార్టీకి అవసరమని, కేవలం అధికారం చూసుకుని వచ్చే వారికి పార్టీలో ఎలాంటి స్థానం ఉండబోదని బీఆర్ ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ స్పష్టం చేశారు. సోమవారం ధర్మపురి నియో జకవర్గ కేంద్రంలోని ఎస్‌హెచ్ గార్డెన్‌లో బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు విస్తృత స్థాయి సమావేశం, ఎస్ఐఆర్ ప్రక్రియపై నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్య క్రమానికి జీవన్ రెడ్డి, కొప్పుల ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రైతులను నిలువునా వంచించిందని విమర్శించారు.వరి ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం చేయడంతో పాటు,రకర కాల కోతలు పెట్టడం వల్ల అన్నదాతలు రోడ్లపై పడి అల్లాడిపోయారని మండిపడ్డారు.అనంతరం కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో కార్యకర్తలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని,పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.పార్టీ కోసం క్షేత్రస్థా యిలో కష్టపడి పనిచేసే



నిజమైన నాయ కులను గుర్తించి, భవిష్యత్తులో తగిన ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రె స్ ప్రభుత్వం బీఆర్ఎస్ శ్రేణులపై అక్రమ కేసులు పెడుతోందని, వీటికి ఎవరూ భయపడాల్సిన పనిలేదని పేర్కొన్నా రు. బాధితు లకు పార్టీ లీగల్ సెల్ తో పాటు వ్యక్తిగతంగా తాను కూడా అం డగా ఉంటానని హామీ ఇచ్చారు. ప్రభు త్వ అధికారులు ప్రజల కోసం పనిచే యాలి తప్ప పార్టీల కోసం కాదన్నా రు.ధర్మపురి నియోజక వర్గంలో కొందరు పోలీసులు కాం గ్రెస్ పార్టీ ఏజెంట్లలా వ్యవహరిస్తు న్నారని ఆయన తీవ్రంగా ఆరోపించారు. రాబోయే రెండున్నర సంవ త్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం.అధికారం కోసం గోడలు దూకే నాయకులకు ఇకపై పార్టీలో స్థానం లేదు. కష్టపడే వారికే భవి ష్యత్తు ఉంటుందన్నారు.కొప్పుల ఈశ్వర్,మాజీ మంత్రి ఈ సమా వేశానికి నియోజకవర్గ నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన కార్యక ర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా అందరూ సమిష్టిగా, సైనికుల్లా పనిచేయాలని పిలు పుని చ్చారు.అనంతరం సభ్యత్వ నమోదు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మూల విజయ రెడ్డి, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి,ఓరగంటి రమణారా వు, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, మాధవరావు, బీఆర్ఎస్ మండల కన్వీనర్ అయ్యోరి రాజేష్,మాజీ మున్సి పల్ చైర్మన్ సంగి సత్తెమ్మ, పట్టణ కన్వీనర్ బండారి రంజిత్, మండ లాల అధ్యక్షులు,నాయకులు, భారీ సంఖ్యలో గులాబీ శ్రేణులు పాల్గొన్నారు.

# హరీష్ రావు అబద్ధాలకోరు: విప్ విజయ రమణారావు

**సోలార్ పంపు సెట్లతో విద్యుత్ ఆదా – రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం**

**పెద్దపల్లి, జూన్ 8: (వుదయం కరస్పాండెంట్)**

మాజీ మంత్రి హరీష్ రావు అబద్ధాలు ప్రచారం చేస్తూ ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు విమర్శించారు. సోమవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని, అధికారం కోల్పోయిన తర్వాత హరీష్ రావు మతిభ్రమించి అసత్య వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ కొనసాగుతుందని, సోలార్ పంపు సెట్లను ప్రోత్సహించడం ద్వారా విద్యుత్ పొదుపు చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. రైతులకు ఉచిత కరెంటు ఇవ్వకుంటే ఎన్నికల్లో ఓట్లు అడగబోమని కాంగ్రెస్ ప్రకటిస్తే, హరీష్ రావు, కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.వరంగల్ రైతు డిక్లరేషన్ ప్రకారం 25.50 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల వ్యయంతో రూ.2



లక్షల వరకు రుణమాఫీ చేశామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో నాలుగు దఫాలుగా ఎకరాకు రూ.6 వేల చొప్పున రైతు భరోసా అందించిందన్నారు. సన్న వడ్లకు బోనస్ ఇవ్వడంలో బీఆర్ఎస్ విఫలమైందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రెండు విడతల్లో రూ.2,590 కోట్ల బోనస్ చెల్లించిందని తెలిపారు.కేంద్రం సహకరించకపోయినా రాష్ట్రంలో రైతుల నుంచి 75 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో 40 లక్షల మెట్రిక్ టన్నుల కంటే ఎక్కువ ధాన్యం కొనుగోలు చేశారా అని ప్రశ్నించారు.కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్ష కోట్ల రూపాయలు దోచుకున్నవారికి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేసే నైతిక హక్కు లేదని మండిపడ్డారు. కాళేశ్వరం నీటిని పెద్దపల్లి జిల్లాకు ఒక్క గుంటకైనా అందించారా అని నిలదీశారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులు, కాళేశ్వరం ప్రాజెక్టు పనితీరుపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.రాష్ట్రంలో రూ.3,500 కోట్లతో మక్కజొన్న కొనుగోలు చేశామని, బీఆర్ఎస్ హామీ ఇచ్చిన డబుల్ బెడ్రూం ఇళ్లను పూర్తిగా అందించలేకపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని తెలిపారు. దళిత కాలనీల్లో విద్యుత్ బకాయిల పేరుతో గత ప్రభుత్వం కరెంటు నిలిపివేస్తే, ప్రస్తుతం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు.దేశంలో రేషన్ ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని పేర్కొన్నారు. రాష్ట్రంలోని కుటుంబాలకు రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించనున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులో కూడా హరీష్ రావు ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తే సహించబోమని హెచ్చరించారు.ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య, మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్లు ప్రకాశ్ రావు, కూర మల్లారెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

# శుభ్రత పరిశుభ్రత అందరి బాధ్యత–జిల్లా కలెక్టర్

**మంచిర్యాల/జూన్ 08 (వుదయం ప్రతినిధి)**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన గ్రామ/ డివిజన్/వార్డు సభలలో ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాల అమలు, ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 31, 32 డివిజన్లకు సంబంధించి లక్ష్మీ గార్డెన్స్ లో నిర్వహించిన డివిజన్ సభకు డిసిపి ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, మంచిర్యాల నగరపాలక సంస్థ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్, 31వ డివిజన్ కార్పొరేటర్ సంపత్ రెడ్డిలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రత్యేక గ్రామ / డివిజన్ / వార్డు సభలు నిర్వహించి, పారిశుధ్యం, ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ, అరైవ్– అలైవ్, ఇందిరమ్మ ఇండ్లు, సంబంధిత అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఘన వ్యర్థాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, తడి చెత్త, పొడి చెత్త, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు వేరువేరుగా సేకరించి నిర్వీర్యం చేయడం ద్వారా పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుందని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా కొనసాగించినట్లయితే వ్యాధుల నియంత్రణ సులభతరం అవుతుందని, వర్షం వచ్చినప్పుడు లోతట్టు ప్రాంతాలలో నీరు నిల్వ కాకుండా ఉంటుందని తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్ల సహకారంతో ఇంటింటికి తిరిగి ఎన్యుమరేషన్ ఫారాల అందజేత, స్వీకరణ, చనిపోయిన, డబుల్, షిఫ్టెడ్ ఓటర్ల తొలగింపు ప్రక్రియ క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని, ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అరైవ్– అలైవ్ కార్యక్రమం నిర్వహించడం ద్వారా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. విద్యావవస్థ బలోపేతం దిశగా




ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని, గత సంవత్సరం లాగానే ఈ విద్యా సంవత్సరం కూడా ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించాలని తెలిపారు. 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుండి మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహార పథకం కూడా అందించడం జరుగుతుందని, జూనియర్ కళాశాలలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. వైద్యం, విద్య, మహిళా రక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు అంశాలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో ప్రజలకు ఎదురయ్యే సమస్యలపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల తహసిల్దార్ల దృష్టికి తీసుకురావచ్చని, ప్రజా సమస్యల పరిష్కారంపై అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేస్తుందని తెలిపారు. డిసిపి మాట్లాడుతూ ప్రజలందరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు, రోడ్డు భద్రత నియమాలు పాటించడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం ద్వారా అకస్మాత్తుగా జరిగే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. రాత్రి సమయంలో డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్ పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, బాలికల సంరక్షణ కొరకు షీ టీం సభ్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా చూడాలని, తెలిసిన వాళ్ళు ఎవరైనా మత్తు పదార్థాలు వినియోగించినట్లు సమాచారం ఇస్తే వారిని డి–అడిక్షన్ సెంటర్ కు తరలించి కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఏదైనా ఇబ్బందులు తలెత్తితే 100 నెంబర్ కు డయల్ చేసి వెంటనే సమాచారం అందించడం ద్వారా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.మంచిర్యాల నగరపాలక సంస్థ మేయర్ మాట్లాడుతూ "మంచిర్యాల శుభ్రత– ప్రతి ఒక్కరి ఆరోగ్య భద్రత" నినాదంతో పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, వీధి దీపాలు, రోడ్ల మరమ్మత్తులు, త్రాగునీటి సదుపాయం, మురుగు కాలువల నిర్వహణ, తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ తదితర అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ పలు కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు.

# నిర్దేశిత గడువులోగా అభివృద్ధి పనులను పూర్తి చేయాలి- జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఆదిలాబాద్, వుదయం :**

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, సమగ్ర రూపాంతరం కేవలం ప్రజా భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం నార్నూర్ మండలం కొత్తపల్లి (హెచ్) గ్రామంలోని నిర్వహించిన గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.గ్రామసభలో గ్రామస్తుల నుంచి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్న కలెక్టర్.. వాటి పరిష్కారానికి తక్షణమే నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, అంతర్గత రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, నిధులను సద్వినియోగం చేసుకుంటూ నాణ్యతతో పనులు పూర్తి చేయాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వ్యవసాయం వర్షపాతంపైనే ఆధారపడి ఉన్నందున, రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంచుకోవాలని సూచించారు. ఆగస్టు 15 నాటికి ఆశించిన వర్షాలు పడకపోతే పెసర్లు, కందులు, మినుములు, సోయాబీన్ వంటి ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలన్నారు. ముందస్తు విత్తనాలు వేసి నష్టపోవద్దని, పదును పడ్డాకే విత్తాలని వ్యవసాయ అధికారుల సలహాలను గుర్తు చేశారు.



## ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి...

**పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి రాజ గౌడ్**



**జగిత్యాల జూన్ 08 (వుదయం ప్రతినిధి)**

ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి రాజ గౌడ్ అదేశించారు సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ప్రసాద్తో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులు వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి రాజ గౌడ్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా తేది 8 6 2026 సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 104 ఫిర్యాదులు వినతులు వచ్చాయని వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా స్థాయి అధికారులు మున్సిపల్ కమిషనర్ లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి బాధితులకు జిల్లా కలెక్టర్ భరోసా



**కరీంనగర్, జూన్ 8 (వుదయం ప్రతినిధి):**

కరీంనగర్ జిల్లాలో ప్రజావాణి కార్యక్రమం వినూత్నంగా కొనసాగుతోంది. సోమవారం జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి వారి సమస్యలను శ్రద్ధగా విన్నారు.ప్రత్యేకంగా వృద్ధులు, దివ్యాంగుల వద్దకే వెళ్లి వారి అర్జీలను స్వీకరించిన కలెక్టర్, సంబంధిత అధికారులను సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి అర్జీని జాగ్రత్తగా పరిశీలించి, సమస్యలకు తగిన పరిష్కార మార్గాలు సూచించాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులు, దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పేర్కొన్నారు. వివిధ శాఖల్లో ఫైళ్లను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే క్లియర్ చేయాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 144 దరఖాస్తులు అందాయి. జిల్లాలో 4, 6, 8, 10వ తేదీల్లో జిల్లా వ్యాప్తంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా గ్రామసభలు జరుగుతున్నాయి. ప్రజావాణి కార్యక్రమానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామ సభల నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేపట్టింది.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, డీఆర్వో స్వామి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటరెడ్డి, జిల్లా ఉపాధి కల్పనాధికారి తిరుపతిరావుతో పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 65 దరఖాస్తులు



**కామారెడ్డి, జూన్ 8 (వుదయం ప్రతినిధి):**

ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రజల నుండి వినతులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలు, ఫిర్యాదులు, అభ్యర్థనలకు సంబంధించిన దరఖాస్తులను కలెక్టర్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా మొత్తం 65 దరఖాస్తులు వచ్చాయని, అర్జీదారులు సమర్పించిన వినతులను జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ, వాటిని పరిశీలించి నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ఎన్ వి గిరి, డిఆర్వో పాండు, జడ్పీ సీఈవో చందర్, జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే సత్వర ప్రగతి కలెక్టర్


**నిజామాబాద్, జూన్ 08 :**

ప్రజల భాగస్వామ్యంతోనే సత్వర ప్రగతి సాధ్యమవుతుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కలెక్టర్ ప్రత్యేక చొరవతో సోమవారం నగరంలోని 41వ డివిజన్ వసంత్ నగర్ లో శ్రమదానం నిర్వహించారు. కలెక్టర్ తో పాటు నగర మేయర్ కూరగాయల ఉమారాణి, డిప్యూటి మేయర్ సల్మా తహ సీన్, కమిషనర్ దిలీప్ కుమార్ తదితరులు స్థానికులతో కలిసి పాల్గొన్నారు. మున్సిపల్ పరిధిలోని ఖాళీ స్థలాన్ని శ్రమదానంతో శుభ్రం చేశారు.



# చక్కని ఆరోగ్యం

## వ్యాయామం చేయాలంటే బద్ధకిస్తున్నారా?





సంపూర్ణ ఆరోగ్యం సొంతమవ్వాలంటే ఆహారంతో పాటు వ్యాయామమూ కీలకమే! అయితే దీని ప్రాధాన్యం తెలిసినా కొంతమంది వ్యాయామం చేయడానికి బద్ధకిస్తుంటారు. నిజానికి దీన్ని అధిగమించాలంటే వ్యాయామంపై సానుకూల దృక్పథం అలవరచుకోవడం ముఖ్యమంటున్నారు నిపుణులు. అందుకు కొన్ని చిన్న చిన్న చిట్కాలు దోహదం చేస్తాయని చెబుతున్నారు. ఏ పని చేసినా స్పష్టత ఉంటే ఏకాగ్రత దానంతటదే వస్తుంది. ఇదే నియమం వ్యాయామానికీ వర్తిస్తుంది. ఈ క్రమంలో 'అసలు నేను వ్యాయామం ఎందుకు చేయాలి?' అనే విషయంపై స్పష్టత ఉండాలి. ఉదాహరణకు.. 'వర్కౌట్స్ చేయడం వల్ల రోజంతా యాక్టివ్‌గా ఉండగలుగుతున్నా..' లేదంటే 'వ్యాయామం నా జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది..', 'ఎక్సర్‌సైజ్ నా శారీరక నొప్పుల్ని దూరం చేస్తుంది'.. ఇలా ఒక్కొక్కరి లక్ష్యాలు, వ్యక్తిగత అవసరాలు ఒక్కోలా ఉంటాయి. మరి, మీ అవసరమేంటో స్పష్టంగా తెలుసుకోగలిగితే.. వ్యాయామాలపై ఏకాగ్రత పెట్టగలుగుతారంటున్నారు నిపుణులు. అలాగే వర్కవుట్ ఇబ్బందిగా అనిపించినప్పుడల్లా మీ అవసరాన్ని ఒక్కసారి గుర్తు చేసుకుంటే బద్ధకం, నీరసం.. అన్నీ దూరమైపోతాయని చెబుతున్నారు. నచ్చిన పని చేస్తే ఎంత కష్టమైనా ఇష్టంగా పూర్తిచేస్తాం. అలాగే వ్యాయామం చేసే క్రమంలోనూ మీకు ఆసక్తి ఉన్న అంశాలపై దృష్టి పెట్టండి. ఉదాహరణకు.. జిమ్‌కు వెళ్లినప్పుడు కొన్ని వ్యాయామాలపై అనుకోకుండానే మనసు పారేసుకుంటాం. ఈ క్రమంలో కొంతమందికి పుషప్స్, మరికొందరికి బరువులెత్తడం.. వంటివి నచ్చచ్చు. ఇవన్నీ కాకుండా నడక, జాగింగ్.. వంటివి ఇష్టమైతే వీటితోనూ మొదలుపెట్టచ్చు. ఇలా నచ్చేవి ఎంచుకుంటే మరింత ఆసక్తిగా వర్కవుట్లు చేయగలుగుతాం. తద్వారా వ్యాయామ ప్రక్రియ కూడా ఇబ్బందిగా అనిపించదంటున్నారు నిపుణులు. ఫలితాలు వేగంగా రావాలని కొంతమంది మొదట్లోనే కష్టమైన వ్యాయామాలు చేస్తుంటారు. ఫలితంగా ఒళ్లు నొప్పులు రావడం, శరీరంపై గాయాలవడం.. వంటివి జరగచ్చు. దానివల్ల వ్యాయామం అంటేనే ఒక ఫోబియాలా మారిపోతుంటుంది. మీకు కూడా ఇలాంటి భయమే ఉందా? అయితే చిన్న చిన్న వ్యాయామాలతో వర్కౌట్ మొదలుపెట్టాలని సూచిస్తున్నారు నిపుణులు. వాకింగ్, జాగింగ్, సైక్లింగ్.. వంటి సులువైన వ్యాయామాలతో మొదలుపెట్టి.. నెమ్మదిగా తీవ్రత పెంచుకుంటూ పోవాలి. ఫలితంగా వ్యాయామ రొటీన్‌పై ఇష్టం ఏర్పడుతుంది.. శరీరం పైనా ప్రతికూల ప్రభావం పడకుండా జాగ్రత్తపడచ్చని చెబుతున్నారు నిపుణులు. కొంతమంది తోడు లేనిదే ఏ పనీ చేయలేరు. వ్యాయామాలు కూడా! ఇలాంటి వారు స్నేహితులు, పెట్స్‌తో కలిసి వ్యాయామాలు చేయడం వల్ల తమ ఒంటరితనాన్ని అధిగమించి వ్యాయామాలపై దృష్టి పెట్టే అవకాశాలున్నా యంటున్నారు నిపుణులు. అంతేకాదు.. ఒకవేళ మధ్యమధ్యలో జిమ్ షెడ్యూల్ బోర్ కొట్టినా, మీరు మానేసినా.. వారు మిమ్మల్ని తిరిగి వ్యాయామాలు చేసే దిశగా ప్రోత్సహించే అవకాశాలుంటాయంటున్నారు. ఇలా తోడుంటే రెండు విధాలుగా మేలే!

## దంతాలు మెరవాలా?

అందమైన నవ్వు అమ్మాయిల సహజ ఆభరణం. అది ఆకర్షణీయంగా కనిపించాలంటే దంతాలదీ ప్రధాన పాత్రే! మరి అవి పసుపు పచ్చగా ఉంటే ఏం బాగుంటుంది? అందుకే సహజంగా మెరిపించండి ఇలా...



బేకింగ్‌సోడా తీసుకుని, తగినన్ని నీళ్లు కలిపి పేస్టులా చేయాలి. ఆ మిశ్రమంతో బ్రష్ చేయండి. పళ్లమీది మరకలన్నీ పోయి తెల్లగా మెరుస్తాయి. అప్పుడప్పుడూ ప్రయత్నించవచ్చు కానీ... తరచూ మాత్రం చేయొద్దు. ఎనామిల్‌పై ప్రభావం పడుతుంది. సమపాళ్లలో యాపిల్ సిడార్ వినెగర్, నీళ్లను తీసుకోండి. ఆ మిశ్రమంతో పుక్కిలించి ఊసినా మేలే. వినెగర్‌లోని సహజ గుణాలు పళ్లు తెల్లబడేలా చేస్తాయి. అయితే తరచూ మాత్రం చేయొద్దు. ఆయిల్ పుల్లింగ్ చేయండి. ఇది పురాతన ఆయుర్వేద పరిష్కారం కూడా. కొంచెం కొబ్బరినూనె తీసుకుని 5-10 నిమిషాలు బాగా పుక్కిలించాలి. ఇది వెంటనే దంతాలను తెల్లగా మార్చేయదు కానీ... పాచి, ఇరుక్కుపోయిన ఆహారం, సూక్ష్మజీవులను తొలగిస్తుంది. పళ్లు శుభ్రంగా కనిపించేలా చేయడమే కాదు... నోటి ఆరోగ్యానికీ మేలు చేస్తుంది. టీ, కాఫీలు దంతాల రంగుని మార్చేస్తుంటాయి. కాబట్టే, తెల్లదనం కోల్పోతాయి. అందుకే వీటినే కాదు కూల్‌డ్రింక్‌లను తాగినా వెంటనే నీటితో పుక్కిలించి ఊయండి. పళ్ల మీద మరకలు పడకుండా ఉంటాయి. పండిన అరటి తొక్క లోపలి భాగంతో పళ్లను రెండు నిమిషాలు రుద్దండి. ఆపై పదినిమిషాలు అలాగే ఉండాలి. తరవాత నీటితో పుక్కిలించి ఊయడమే. తొక్కలోని పొటాషియం, మెగ్నీషియం దంతాలను మెరిపించడంలో సాయపడతాయి. తరచూ చేస్తే ఫలితం కనిపిస్తుంది.

## ఉదయాన్నే మడమ నొప్పా..

చాలా మందికి ఉదయం నిద్రలేవగానే మడమ నొప్పి తీవ్రంగా ఉంటుంది. దీనికి ప్రధాన కారణం ఎక్కువసేపు నిలబడటం. సరైన పాదరక్షలు ధరించకపోవడంతోపాటు అధిక బరువు ఉండటం మరో కారణం. రోజంతా మన శరీర బరువు మొత్తం మన పాదాలపై పడుతుంది. అందుకే మడమ నొప్పి కారణంగా చాలామంది ఉదయాన్నే లేవడానికి ఇబ్బంది పడతారు. మరి



ముఖ్యంగా ఉదయం వేళ మనం పాదం నేలపై ఆనించిన వెంటనే మడమలో తీవ్రంగా గుచ్చుతున్నట్లుగా నొప్పి ఉంటుంది. వైద్య పరిభాషలో దీనిని ప్లాంటార్ ఫాసైటిస్ అంటారు. ప్లాంటార్ ఫాసియా అనేది మన మడమ నుంచి కాలి వేళ్ళ వరకు విస్తరించి ఉండే ఒక మందపాటి కండర కణజాలం. మనం నడిచేటప్పుడు లేదా పరిగెత్తేటప్పుడు మన పాదాలపై పడే ఒత్తిడిని గ్రహించడానికి అది ఒక షాక్ అబ్జార్బర్‌లా పని చేస్తుంది. ఈ కణజాలంపై అధిక ఒత్తిడి పడటం వల్ల స్వల్ప వాపు రావచ్చు. దీనినే ప్లాంటార్ ఫాసైటిస్ అని అంటారు. అధిక సమయం నిలబడి ఉండటం.. ఉదాహరణకు ఉపాధ్యాయులు, కూరగాయలు లేదా ఇతర వ్యాపారులు, వంట పని చేసేవారు గంటల తర బడి నిలబడి పనిచేసే మహిళలకు ఈ నొప్పి వచ్చే అవకాశం ఉంటుంది. ఫ్లాట్ చెప్పులు లేదా హీల్స్ అతిగా వాడటంవల్ల పాదం లో అసమతుల్యత ఏర్పడి మడమపై ఒత్తిడి పెరుగుతుంది. శరీర బరువు అధికంగా ఉన్నప్పుడు, నడిచేటప్పుడు మొత్తం బరువు మడమ పై పడుతుంది. దీనివల్ల ప్రధానంగా మడమ నొప్పి వస్తుం ది.

ఒక ప్లాస్టిక్ వాటర్ బాటిల్‌లో నీళ్లు నింపి డీప్ ఫ్రిజ్‌లో పెట్టాలి. అందులో నీరు గడ్డకట్టిన తర్వాత ఆ బాటిల్‌ను నేలపై ఉంచి మీ పాదాలను ముఖ్యంగా మడమలను, దానిపై ముందుకు వెనుకకు రుద్దాలి. రోజుకు 10 నుంచి 15 నిమిషాలపాటు ఇలా చేయడంవల్ల వాపు తగ్గి, నొప్పి నుంచి తక్షణ ఉపశమనం లభిస్తుంది.

ఒక తొట్టిలో గోరువెచ్చని నీటిని తీసుకుని అందులో రెండు టేబుల్ స్పూన్ల రాతి ఉప్పు లేదా ఎప్సమ్ సాల్ట్ కలపాలి. ఆ నీటిలో మీ పాదాలను 15 నిమిషాల పాటు నానబెట్టాలి. ఉప్పునీటిలోని మెగ్నీషియం కండరాల నొప్పిని అలసటను త్వరగా తగ్గిస్తుంది. ఉదయం నిద్రలేచే ముందు మీ పాదాలు, కాలివేళ్ళను పైకి కిందకి సాగదీయండి. అలాగే నేలపై ఒక చిన్న టవల్ పరిచి, ఆ టవల్‌ను మీ కాలివేళ్ళకు దగ్గరగా లాగడానికి ప్రయత్నించండి. ఇది ప్లాంటార్ పాసియా కండరాలను బలపరు స్తుంది. మడమ భాగంలో మృదువైన కుషన్లు ఉన్న బూట్లను మాత్రమే వాడాలి. కాళ్లకు ఏమీ లేకుంటా నేలపై ఎప్పుడూ నడవవద్దు. ఈ జాగ్రత్తలతో పాటు సూచించిన చిట్కాలను క్రమం తప్పకుండా పాటిస్తే మీకు కొన్ని రోజుల్లో మడమ నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.

## పోషకాలు పోకుండా వండాలంటే..!

సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడంలో ఆకుకూరలు, ఆకుపచ్చటి కాయగూరల పాత్ర కీలకం. కంటి ఆరోగ్యానికి, బరువును అదుపులో ఉంచుకోవడానికి, చర్మ ఆరోగ్యానికి, రోగనిరోధక శక్తికి.. ఇలా వీటితో బోలెడన్ని ప్రయోజనాలు చేకూరతాయి. అయితే వీటిని వండుకునే క్రమంలో కొన్ని జాగ్రత్తలు పాటిస్తేనే ఈ కూరగాయలు/ఆకుకూరల్లోని పోషకాలు పూర్తిగా శరీరానికి అందుతాయంటున్నారు నిపుణులు. మరి, అవేంటో తెలుసుకుందాం రండి..



పాలకూర, తోటకూర, బచ్చలి కూర, గోంగూర, కొత్తిమీర, మెంతి.. వంటి ఆకుకూరలతో పాటు బ్రకలీ, క్యాబేజీ, క్యాలీఫ్లవర్ మొదలైనవన్నీ ఆకుపచ్చటి కాయగూరల కిందకే వస్తాయి. అయితే వీటిని వండుకునే క్రమంలో టీస్పూన్ నూనె/వెన్న/ నెయ్యి.. ఉపయోగిస్తే.. అందులోని పోషకాలు తరిగిపోవంటున్నారు నిపుణులు. పైగా దీనివల్ల ఈ పోషకాలన్నీ శరీరం త్వరగా గ్రహిస్తుందట! వండే ముందు ఆకుపచ్చటి కాయగూరల్ని శుభ్రంగా కడిగి కాసేపు వేడి నీళ్లలో ఉంచితే.. కూర వండే క్రమంలో అవి త్వరగా ఉడుకుతాయి. ఫలితంగా త్వరగా వంట పూర్తవుతుంది. అలాగే స్టీమింగ్ పద్ధతిలో కూడా ఈ కాయగూరల్ని ఉడికించచ్చు. వాటిలోని పోషకాలు తరిగిపోకుండా ఉండేందుకు ఇది కూడా ఓ చక్కటి పద్ధతి అంటున్నారు నిపుణులు. ఆకుపచ్చటి కాయగూరల్ని వండే క్రమంలో మిరియాల పొడి, ఆలివ్ నూనె, వినెగర్, అల్లం-వెల్లుల్లి పేస్ట్.. వంటివి ఉపయోగిస్తే ఆ కూర రుచి ఇనుమడిస్తుంది. అలాగే ఆయా పదార్థాల్లోని పోషకాలూ శరీరానికి అందుతాయి. కొంతమందికి కూర గ్రేవీగా/జారుడుగా ఉంటే నచ్చదు. అందుకే నీళ్లు పోయకుండా డ్రైగా వేయిస్తారు. ఆకుపచ్చటి కాయగూరల్ని ఇలా వండడం వల్ల వాటిలోని పోషకాలు తరిగిపోవడంతో పాటు రంగు కూడా మారిపోతాయి. కాబట్టి వీటిని వండే క్రమంలో కొద్దిగా నీళ్లు పోయడం మంచిదంటున్నారు నిపుణులు. ఫలితంగా కూర రుచి రెట్టింపవుతుందని చెబుతున్నారు. ఆకుపచ్చటి కాయగూరల్ని చిన్నగా తరగడం కంటే పెద్ద ముక్కలు చేయడం మంచిదని చెబుతున్నారు నిపుణులు. ఏ పదార్థాన్నైనా పదే పదే వేడి చేయడం ఆరోగ్యానికి హానికరం. అలాగే అందులోని పోషకాలూ నశిస్తాయి. గ్రీన్ వెజిటబుల్స్‌కి కూడా ఇది వర్తిస్తుంది. కాబట్టి ఒక్కసారి కూర వండాక మళ్లీ వేడి చేయకపోవడం మంచిదని చెబుతున్నారు నిపుణులు.


## పదార్థాలు పాడవకుండా బీస్‌వాక్స్ ర్యాప్స్!



ఆధునిక వంటగదిలో అల్యూమినియం ఫాయిల్ వాడకం విపరీతంగా పెరిగిపోయింది. అది పర్యావరణానికే కాదు, మన ఆరోగ్యానికీ అంత మంచిది కాదు. ముఖ్యంగా వేడి ఆహార పదార్థాలను అల్యూమినియం ఫాయిల్‌లో ప్యాక్ చేసినప్పుడు, ఆ లోహం ఆహారంలోకి చేరే ప్రమాదం ఉంది. దీనికి పూర్తి భిన్నంగా, సురక్షితమైన ప్రత్యామ్నాయంగా బీస్‌వాక్స్ ర్యాప్స్ మార్కెట్లోకి వచ్చాయి. బీస్‌వాక్స్, ఆర్గానిక్ కాటన్ వస్త్రం, జొజోబా ఆయిల్ వంటి సహజసిద్ధమైన పదార్థాలతో తయారవుతాయివి. సాధారణంగా అల్యూమినియం ఫాయిల్‌ను ఒక్కసారి వాడి పారేయాల్సి వస్తుంది, కానీ బీస్‌వాక్స్ ర్యాప్స్‌ను ఉతికి, ఆరబెట్టి దాదాపు ఏడాది పాటు వాడుకోవచ్చు. దీనివల్ల ప్లాస్టిక్, మెటల్ వ్యర్థాలు తగ్గి పర్యావరణానికీ ఎంతో మేలు జరుగుతుంది. అన్నింటికీ మించి బీస్‌వ్యాక్స్‌లో సహజంగానే యాంటీ-బ్యాక్టీరియల్, యాంటీ-ఫంగల్ గుణాలు ఉంటాయి. ఇవి ఆహార పదార్థాలు కుళ్లిపోకుండా, బ్యాక్టీరియా చేరకుండా చేస్తాయి. అల్యూమినియం ఫాయిల్ గాలి చొరబడకుండా గట్టిగా మూసి ఉంచితే, బీస్‌వాక్స్ ర్యాప్స్ మాత్రం ఆహారానికి గాలి తగిలేలా చేసి.. ఎక్కువ రోజులు తాజాగా ఉంచుతాయి. కూరగాయలు, ఆకుకూరలు, రొట్టెలు లేదా పండ్ల ముక్కలను చుట్టడానికి ఇది ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. దీన్ని ఏ ఆకారంలోనైనా సులభంగా మలుచుకోవచ్చు. ఆరోగ్యకరమైన జీవనశైలిని కోరుకునే వారికి చక్కని ఎంపిక.

## రోజూ ఉదయం ఈ యోగాసనాలను వేస్తే.. రోజంతా మనశ్శాంతిగా ఉండవచ్చు..


ఉదయం లేవగానే చాలా మంది చేసే పనులు ఆ రోజు మొత్తం మానసిక స్థితి, శక్తి స్థాయిలు, ఉత్పాదకతపై ప్రభావం చూపుతాయి. అయితే చాలా మంది ఉదయం నిద్రలేచిన వెంటనే మొబైల్ ఫోన్‌లో సందేశాలు, సోషల్ మీడియా లేదా ఈ-మెయిల్స్ చూడటంతో రోజును ప్రారంభిస్తారు. దీంతో రోజు మొదలయ్యే సమయానికే ఒత్తిడి, ఆందోళన పెరిగి మిగతా సమయం కూడా హడావుడిగా గడిచే అవకాశం ఉంటుంది. ఉదయం నిదానంగా, ప్రశాంతంగా



ప్రారంభమైతే శరీరం, మనసు రెండూ సమతుల్యంగా పనిచేస్తాయి. ఇందుకోసం యోగా, శ్వాసాభ్యాసాలు, తేలికపాటి వ్యాయామాలను దినచర్యలో భాగం చేసుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది. ఉదయాన్నే కొద్దిసేపు సూర్యరశ్మిలో గడపడం, తగినంత నీరు తాగడం, శరీరాన్ని కదిలించే వ్యాయామాలు చేయడం వంటివి రోజంతా ఉత్సాహంగా ఉండేందుకు తోడ్పడతాయి. ఉదయం యోగా సాధనను 20 నుంచి 30 నిమిషాల వరకు కొనసాగించవచ్చు. యోగా ప్రారంభించే ముందు వేళ్లను, అరచేతులను, చేతులను, మోచేతులను నెమ్మదిగా స్ట్రెచ్ చేయడం ద్వారా చిన్న కీళ్లను చురుకుగా మార్చుకోవచ్చు. అలాగే ఛాతీ విస్తరణ వ్యాయామాలు, కాళ్ల స్ట్రెచింగ్, మోకాళ్ల కదలికలు, పాదాల వ్యాయామాలు చేయడం ద్వారా శరీరాన్ని సిద్ధం చేయవచ్చు. తాడాసనం ఉదయం చేయడానికి అనువైన ఆసనాల్లో ఒకటి. ఇందులో రెండు పాదాలను కలిపి నిటారుగా నిలబడి, బరువును రెండు కాళ్లపై సమానంగా ఉంచి, శ్వాసపై దృష్టి పెట్టాలి. ఇది శరీర భంగిమను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. పాదహస్తాసనంలో నడుము నుంచి ముందుకు వంగి పాదాల వైపు చేతులను చాపాలి. మోకాళ్లను గట్టిగా బిగించకుండా సౌకర్యంగా ఉంచాలి. ఈ ఆసనం వెన్నెముక, కాళ్ల కండరాలకు మంచి స్ట్రెచ్‌ను అందిస్తుంది. పార్శ్వ ఉర్ధ్వ హస్తాసనంలో చేతులను తలపైకి ఎత్తి, శరీరాన్ని మెల్లగా ఒక వైపుకు వంచాలి. దీని వల్ల శరీరపు పక్క భాగాలు సాగి వశ్యత పెరుగుతుంది. మెడ స్ట్రెచింగ్ కూడా ఉదయపు దినచర్యలో భాగం అవుతుంది. మెడను ముందుకు, వెనక్కి, ఎడమ, కుడి వైపులకు నెమ్మదిగా కదిలించడం ద్వారా గట్టిపడిన కండరాలు సడలుతాయి. భుజాలను ముందుకు, వెనక్కి గుండ్రంగా తిప్పే షోల్డర్ రొటేషన్ వ్యాయామం భుజాల కదలికలను మెరుగుపరచడంతోపాటు ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే శరీరపు పైభాగాన్ని కుడి, ఎడమ వైపులకు మెల్లగా తిప్పే ట్విస్టింగ్ వ్యాయామాలు వెన్నెముక వశ్యతను పెంచి శరీరాన్ని చురుకుగా ఉంచుతాయి. యోగా ఆసనాలతోపాటు శ్వాసాభ్యాసాలు కూడా ఉదయపు దినచర్యలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. లోతైన డయాఫ్రాగ్మాటిక్ బ్రీతింగ్ ద్వారా శరీరం ప్రశాంత స్థితిలోకి వెళ్లేందుకు సహాయపడుతుంది. ఇందులో సౌకర్యంగా కూర్చొని ముక్కు ద్వారా నెమ్మదిగా శ్వాస పీల్చుకోవాలి. ఈ సమయంలో పొట్టను బయటకు విస్తరించాలి. అనంతరం నెమ్మదిగా శ్వాసను విడిచేటప్పుడు పొట్ట సాధారణ స్థితికి రావాలి. అనులోమ విలోమ ప్రాణాయామం కూడా ఏకాగ్రతను పెంచడంలో సహాయపడుతుంది. ఇందులో ఒక ముక్కు రంధ్రాన్ని మూసి మరో రంధ్రం ద్వారా శ్వాస తీసుకుని, తరువాత ప్రత్యామ్నాయంగా శ్వాసను మార్చుతూ కొనసాగించాలి. బాక్స్ బ్రీతింగ్ పద్ధతిలో నాలుగు సంఖ్యల వరకు శ్వాస పీల్చి, నాలుగు సంఖ్యల వరకు ఆపి, నాలుగు సంఖ్యల వరకు శ్వాసను విడిచి, మళ్లీ నాలుగు సంఖ్యల వరకు ఆపాలి. ఈ విధానం మనసును ప్రశాంతంగా ఉంచడంలో సహాయపడుతుంది. ప్రారంభ స్థాయిలో ఉన్నవారు అన్ని శ్వాసాభ్యాసాలను ఒకేసారి చేయాల్సిన అవసరం లేదు. మొదట కొన్ని నిమిషాలు డయాఫ్రాగ్మాటిక్ బ్రీతింగ్‌తో ప్రారంభించి, క్రమంగా ఇతర పద్ధతులను కూడా అలవాటు చేసుకోవచ్చు. రోజువారీ జీవితంలో ఇటువంటి చిన్న మార్పులు తీసుకురావడం ద్వారా శక్తి, ఏకాగ్రత, మానసిక ప్రశాంతతను మెరుగు పరుచుకోవచ్చు.

## ఐలైనర్ చెదిరిపోకుండా..!

కంటిని ఇంపుగా తీర్చి దిద్దుకోవడానికి ఎంతో కష్టపడి ఐ-లైనర్ పెట్టు కుంటాం. అయితే రోజంతా ఐ-లైనర్ అలాగే నిలిచి ఉంటుందా అంటే.. కష్టమే అని చెప్పాలి. అయితే కొన్ని చిట్కాలు పాటిస్తే ఇది సాధ్యమేనంటున్నారు నిపుణులు. ముఖానికి మాయిశ్చరైజర్ రాసుకునే క్రమంలో కళ్లు, కనురెప్పల చుట్టూ కూడా అప్లై చేసుకొని.. ఆపై ఐ-లైనర్ పెట్టుకుంటుంటారు చాలా మంది. అయితే దీనివల్ల ఐ-లైనర్ త్వరగా చెదిరిపోయే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. కాబట్టి కళ్లకు ఐ-లైనర్ పెట్టుకో



వాలనుకుంటే ఆ ప్రదేశంలో మాయిశ్చరైజర్ రాసుకోకపోవడమే మంచిది. పదే పదే ముఖం కడుక్కోవడం, చెమట పట్టడం వల్ల కూడా ఐ-లైనర్ ఎక్కువ సమయం నిలిచి ఉండదు. అలాంటప్పుడు వాటర్ ప్రూఫ్ లేదా జెల్ తరహా ఐ-లైనర్ ఎంచుకోవడం మేలు. అద్దీ అద్దనట్లుగా కొద్దిపాటి పౌడర్‌ని ఉపయోగిస్తే ఐ-లైనర్ మెరుపు తగ్గకుండా చూసుకోవచ్చు. అలాగే ముందు పౌడర్ రాసుకొని ఆపై ఐ-లైనర్ అప్లై చేసుకున్నా ఫలితం ఉంటుందట. ముఖానికి మేకప్ వేసుకునే ముందు ప్రైమర్ ఎలాగైతే రాసుకుంటామో.. ఐ-లైనర్ పెట్టుకోవడానికి ముందు కూడా ఐ ప్రైమర్ అప్లై చేసుకోవడం వల్ల చక్కటి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. అయితే అది కూడా తక్కువ మొత్తంలో రాసుకుంటే ఐ-లైనర్ ఎక్కువసేపు నిలిచి ఉంటుందట. ఐషాడో కూడా ఐ-లైనర్ ఎక్కువ సమయం నిలిచి ఉండేందుకు సహకరిస్తుంది.

## టీ, కాఫీలు మంచివేనా?

టీ, కాఫీలు కేవలం పానీయాలు కాదు, చాలా మందికి ఇవో అవసరంగా మారాయి. ఇవి లేకుండా కొందరికి రోజు మొదలవ్వదు. మరి టీ, కాఫీలు మంచి చేస్తాయా, చెడుకు దారి తీస్తాయా.. అనేదానిపైన సందేహాలెన్నో! వీటిపై నిపుణులు ఏం చెబుతున్నారంటే. టీ, కాఫీలలో ఉండే కెఫీన్ హృదయ స్పందన వేగాన్ని, రక్తపోటును పెంచుతుందని ఇప్పటివరకూ అధ్యయనాలు చెబుతూ వచ్చాయి. అయితే 2026లో వచ్చిన ఓ అధ్యయనం మాత్రం కెఫీన్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్, వాపు నివారణ లక్షణాలు రక్తనాళాల పనితీరుని మెరుగు పరుస్తాయని చెబుతోంది. రోజులో 2-3 కప్పుల టీ/కాఫీ(200-300 మి.గ్రా. కెఫీన్) గుండె జబ్బుల్నీ, మధుమేహాన్నీ దూరం చేస్తుందట. దీనికి కారణం కాఫీలో ఉండే క్లోరోజనిక్ యాసిడ్స్, టీలో ఉండే ఫ్లేవనాయిడ్స్. ఇవి జీవక్రియను పెంచి, వాపుని తగ్గిస్తాయి. కానీ అంతకంటే ఎక్కువ పరిమాణంలో వీటిని తీసుకుంటే రక్తపోటుకు దారి తీస్తుంది. మహిళల్లో హార్మోన్ల హెచ్చుతగ్గుల కారణంగా గుండె మీద భిన్నరకాలుగా ప్రభావం ఉంటుంది. కాబట్టి వీళ్లు మరింత జాగ్రత్తగా ఉండడం అవసరమని చెబుతున్నారు.





## మ్యూచువల్ ఫండ్ రంగంలోకి ఆల్ఫాగ్రెప్




మ్యూచువల్ ఫండ్ పరిశ్రమలోకి ఆల్ఫాగ్రెప్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ అడుగుపెట్టడానికి సిద్ధమైంది. వచ్చే నెలలో సంస్థ తమ తొలి పథకాన్ని తీసుకు రానుంది. రాబోయే 3–5 ఏళ్లలో రూ.25,000– 30,000కోట్ల నిర్వహణలోని ఆస్తులను లక్ష్యంగా పెట్టుకున్నామని ఆల్ఫాగ్రెప్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ సీఈఓ భౌతిక్ అంబానీ తెలిపారు. ఫండ్ కార్యకలాపాల ప్రారంభానికి కంపెనీ ఇప్పటికే సెబీ అనుమతి పొందింది. ఆల్ఫాగ్రెప్ మొట్టమొదటి న్యూ ఫండ్ ఆఫర్‌గా మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్‌ను తీసుకురానుంది. ఈ పథకం జులై 6న ప్రారంభమై 20న ముగియనుంది. ఈఫండ్ ద్వారా సమీకరించిన నిధులను ఈక్విటీ,డెట్,మనీ మార్కెట్,పసిడి,వెండి,ఇతర ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు పెట్టనున్నారు.




# భారీ నష్టాల్లో సూచీలు..

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు రాజుకోవడం, చమురు ధరలు పెరగడం, అమెరికాలో వడ్డీ రేట్లు పెరుగుతాయన్న అంచనాలు ప్రపంచ మార్కెట్‌లతో పాటు మన మార్కెట్‌నూ పడేశాయి. సెన్సెక్స్ ఓ దశలో 800 పాయింట్ల నష్ట రోజంతా నష్టల్లో కదలాడింది. ఇంట్రాడేలో 73,318.94 – 73,934.35 మధ్య చలించిన సూచీ.. చివరికి 719.08 పాయింట్ల నష్టంతో 73,524.26 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 243.70 పాయింట్ల నష్టంతో 23,123 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.70గా ఉంది.




సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, మహీంద్రా అండ్ మహీంద్రా, ట్రెంట్, ఇండిగో, రిలయన్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టెక్ మహీంద్రా, బీఈఎల్, భారతీ ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 96.95 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు 4290 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. పశ్చిమాసియాలో ఇరాన్–ఇజ్రాయెల్ పరస్పర దాడులు మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీంతో ఆసియా మార్కెట్‌లు దాదాపు నష్టాల్లో ముగిశాయి. యూరప్ మార్కెట్‌లూ నష్టాల్లో ట్రేడవుతున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న పోగా.. మధ్యలో కోలుకున్నట్లు కనిపించింది. ఆఖరిలో మళ్లీ అమ్మకాల ఒత్తిడితో 700 పాయింట్ల నష్టపోయింది. సెన్సెక్స్ ఉదయం 73,421.61 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,243.34) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. తాజా ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో మరోసారి ముడి చమురు ధరలు భగ్గుమన్నాయి. 93 డాలర్ల వద్ద ట్రేడవుతున్న క్రూడాయిల్ 96 డాలర్ల స్థాయికి చేరడం మన మార్కెట్‌లో సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.


# హార్మూజ్ మరో నెల మూతపడినా ఢోకా లేదు: హర్‌దీప్ సింగ్




దేశంలో ఇంధన నిల్వలకు ఢోకా లేదని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి వెల్లడించారు. హార్మూజ్ జలసంధి మరోనెల రోజుల పాటు మూతపడి ఇంధన సరఫరాకు అవరోధం ఏర్పడినా 30 నుంచి 60 రోజుల పాటు ఆ షాక్‌ను భారత్ తట్టుకోగలదని, ఆ మేర ఇంధన నిల్వలు ఉన్నాయని పేర్కొన్నారు. సీఎన్ఎన్–న్యూస్ 18కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ మేరకు ఆయన మాట్లాడారు. వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు, రిఫైనరీ ఇన్వెంటరీలు, కమర్షియల్ స్టాక్స్‌తో కలిపి దేశంలో ప్రస్తుతం 76–80 రోజులకు సరిపోయే ఇంధన నిల్వలు ఉన్నాయని పురి అన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా హార్మూజ్ జలసంధి ద్వారా చమురు సరఫరాకు అంతరాయం ఏర్పడినా, భారతదేశం సులువుగా తట్టుకోగలదని పేర్కొన్నారు. గల్ఫ్ వెలుపల ఉన్న ఇతర చమురు ఉత్పాదక దేశాల నుంచి సరఫరాను పెంచడం, అలాగే మొజాంబిక్ నుంచి అదనపు గ్యాస్ సరఫరాను అందుకోవడం ద్వారా భారత్ తన ఇంధన భద్రతను మరింత బలోపేతం చేసుకుంటోందని హర్‌దీప్ సింగ్ పురి వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో అదనపు ఎల్‌పీజీ కార్గోలను సరఫరా చేయడానికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి కీలక భాగస్వామ్య దేశాలు సిద్ధంగా ఉన్నాయని ఆయన వెల్లడించారు.


అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు ఎక్కువ కాలం పాటు గరిష్ఠ స్థాయిలో కొనసాగే అవకాశం లేదని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ మార్కెట్లో అస్థిరత ఉన్న సమయంలో దేశీయంగా రిఫైనింగ్ సామర్థ్యాన్ని భారత్ నిరంతరం విస్తరిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం 24 రిఫైనరీలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. చమురు ధరలు కనిష్ఠ స్థాయికి చేరినప్పుడు దాన్ని వినియోగించుకోవడంలో భారత్ విఫలమైందంటూ కొందరు చేస్తున్న విమర్శలపైన మంత్రి స్పందించారు. ముడిచమురును శాశ్వతంగా నిల్వ చేయలేమని, ఎప్పటికప్పుడు వాణిజ్య అవసరాల కోసం వినియోగిస్తూ.. దాన్ని తిరిగి భర్తీ చేస్తుండాలని చెప్పారు.

# త్వరలోనే జెప్టో ఐపీఓ!




క్విక్ కామర్స్ సంస్థ జెప్టో సవరించిన తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ముసాయిదా పత్రాలను మార్కెట్ల నియంత్రణాధికార సంస్థ సెబీకి ఈ వారంలోనే సమర్పించే అవకాశం ఉందని ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు తెలిపాయి. ఆదిత్ పలీచా నేతృత్వంలోని ఈ కంపెనీ పత్రాలు సమర్పించిన తర్వాత ఇన్వెస్టర్ రోడ్‌షోలను కూడా నిర్వహించేందుకు సన్నాహాలు చేసుకుంటోంది. ఈ నెలాఖరున లేదంటే జులైలో ఐపీఓ ఉండొచ్చని సమాచారం. ఈ పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.10,000 కోట్లకు పైగా నిధులు సమీకరించాలని జెప్టో భావిస్తోంది. ఈ సంస్థ త్రైమాసిక నికర ఆర్డరు విలువ (ఎన్ఓవీ) 1 బిలియన్ డాలర్ల (సుమారు రూ.9,500 కోట్ల)ను అధిగమించింది. 2021లో ఆదిత్ పలీచా, కైవల్య వోహ్రా జెప్టోను స్థాపించారు.దేశంలో అతి పెద్ద క్విక్ కామర్స్ కంపెనీల్లో ఒకటిగా అత్యంత వేగంగా ఎదిగింది. తొలుత గత డిసెంబరులో కాన్ఫిడెన్షియల్ పద్ధతిలో ఐపీఓ ముసాయిదా పత్రాలను కంపెనీ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా సెబీ అడిగిన మరిన్ని అంశాలు జోడించి పత్రాలు సమర్పించబోతోంది.

## చైనాతో పోలిస్తే భారత్‌లో కంపెనీలకు ప్రభుత్వ మద్దతు తక్కువే



2005–24 మధ్య కాలంలో 15 కీలక రంగాల్లో ప్రపంచంలోని 525 అతి పెద్ద తయారీదార్లను పరిగణనలోకి తీసుకుని నివేదిక రూపొందించింది. ఈ కొలత మూడు సాధనాల ద్వారా జరుగుతుంది. అందులో గ్రాంట్లు, ఆదాయపు పన్ను రాయితీలు, మార్కెట్ విలువ కంటే తక్కువ వడ్డీకి రుణాలు ఉన్నాయి. 2005–24 మధ్య కాలంలో చైనాసంస్థలు ఓఈసీడీ ఆధారిత సంస్థల కంటే సగటున 3–8 రెట్లు ఎక్కువగా ప్రభుత్వ మద్దతు పొందాయి. బ్రెజిల్, భారత్, ఇండోనేషియా వంటి ఓఈసీడీ యేతర ఆర్థిక వ్యవస్థల్లోని సంస్థలు పొందిన మద్దతు కంటే ఈసబ్సిడీలు ఎక్కువగా ఉన్నాయి. ఇది చైనా తయారీరంగ పోటీతత్వం వెనుక ఉన్న కీలక కారకాలలో ఒకదాన్ని ప్రతిబింబిస్తోందని నివేదిక తెలిపింది.

2005–2024 మధ్య కాలంలో భారతీయ సంస్థలు తమ చైనా ప్రత్యర్థి కంపెనీల కంటే గణనీయంగా తక్కువ ప్రభుత్వ మద్దతును పొందాయని ఓఈసీడీ (ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో–ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్) నివేదిక వెల్లడించింది. సంస్థలు వాస్తవంగా ఏమి పొందుతున్నాయో (ప్రభుత్వాలు వెల్లడించేది కాదు) ఓఈసీడీ మ్యాజిక్ డేటాబేస్ ఆఫ్ ఇండస్ట్రియల్ సబ్సిడీస్ కొలుస్తుంటుంది. ఇది

# ఎస్ఏఎఫ్ అభివృద్ధిని వేగవంతం చేయాలి



రియో డి జనీరో (బ్రెజిల్): ప్రస్తుత ఇంధన సంక్షోభం నేపథ్యంలో పర్యావరణ అనుకూలమైన పునరుత్పాదక ఇంధనాలు, ముఖ్యంగా సుస్థిర విమాన ఇంధనం (ఎస్ఏఎఫ్) అభివృద్ధిని మరింత వేగవంతం చేయాల్సిన అత్యవసర పరిస్థితి ఏర్పడిందని విమానయాన సంస్థల సంఘం ఐఏటీఏ డైరెక్టర్ జనరల్ విల్లీ వాల్ష్ పేర్కొన్నారు. రియో డి జనీరోలో జరుగుతున్న ఐఏటీఏ వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం)లో అంతర్జాతీయ ఇంధన సంక్షోభం, విమాన ఇంధన ధరల పెరుగుదల, ప్రత్యామ్నాయ పర్యావరణ ఇంధనాల అవసరాలపై కీలక చర్చలు జరిగాయి. 2050 నాటికి సున్నా కర్బన లక్ష్యాన్ని చేరుకుంటామని విమానయాన రంగం ప్రతిజ్ఞ చేసి అయిదేళ్లు గడుస్తున్నా, 2026లో అంతర్జాతీయ ఎస్ఏఎఫ్ ఉత్పత్తి కేవలం 2.4 మిలియన్ టన్నులుగా మాత్రమే ఉంది. ఇది ప్రపంచ విమాన ఇంధన వినియోగంలో కేవలం 0.8 శాతం మాత్రమే. దీని కోసం విమానయాన సంస్థలు 4.3 బిలియన్ డాలర్ల భారీ వ్యయాన్ని భరిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఎస్ఏఎఫ్ ఉత్పత్తి సామర్థ్యం 9 మిలియన్ టన్నులు ఉన్నప్పటికీ.. ప్రభుత్వ విధానాల కారణంగా కంపెనీలు పునరుత్పాదక డీజిల్ ఉత్పత్తికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాయని ఐఏటీఏ నెట్ జీరో రీసెర్చ్ హెడ్ ప్రీతి జైన్ విమర్శించారు. చమురు కంపెనీల ఉదాసీనత, ప్రభుత్వ విధానాల వల్ల 2050నాటికి 65% ఇంధన అవసరాలకు ఎస్ఏఎఫ్ ద్వారా భర్తీ చేయాలనే లక్ష్యం ఏటా కష్టతరంగా మారుతోందని విల్లీ వాల్ష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏటీఎఫ్ ధరల స్థిరీకరణ నిధి భేష్: విమాన ఇంధన (ఎఫ్‌టీఎఫ్) ధరల అస్థిరత సమస్యను పరిష్కరించడానికి భారత ప్రభుత్వం రూ.10000 కోట్ల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయడం చాలా మంచి నిర్ణయమని ఐఏటీఏ ఎనర్జీ ట్రాన్సిషన్ డైరెక్టర్ హేమంత్ మిస్త్రీ ప్రశంసించారు. పశ్చిమాసియా సంక్షోభం వల్ల అంతర్జాతీయ విమానయాన పరిశ్రమ మొత్తం నికర లాభం 2026లో సగానికి తగ్గి 23 బిలియన్ డాలర్ల(సుమారు రూ.2.2 లక్షల కోట్లు)కు చేరొచ్చని ఐఏటీఏ అంచనా కట్టింది. అంతే కాక నికర లాభాల మార్జిన్ సైతం 2 శాతానికి తగ్గుతుందని తెలిపింది. ఒక్కో ప్రయాణికుడిపై నికర లాభం 4.5 డాలర్లకు పరిమితం కావొచ్చని అంటోంది. 2025లోని 9.10 డాలర్లతో పోలిస్తే ఇది సగం కంటే తక్కువ. విమాన ఇంధన ధరలు 70% మేర పెరగడంతో లాభాలపై ప్రభావం పడిందని తెలిపింది.




## సీఎం విజయ్‌కు చెక్ పెట్టిన ప్రజ్ఞానంద



ప్రతిష్ఠాత్మక నార్వే చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. విన్సెంట్ కీమర్ (జర్మనీ)పై గెలుపొంది నార్వే చెస్ టోర్నీ టైటిల్ విజేతగా నిలిచిన తొలి భారతీయుడిగా ప్రజ్ఞానంద రికార్డు సృష్టించాడు. ఈ నేపథ్యంలో సోమవారం తమిళనాడు సెక్రటేరియట్‌లో ముఖ్యమంత్రి సీఎం విజయ్‌ని ప్రజ్ఞానంద తన తల్లిదండ్రులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా విజయ్ కాసేపు ప్రజ్ఞానందతో సరదాగా చెస్ ఆడాడు. కొద్దిసేపే జరిగిన ఈ గేమ్‌లో కొన్ని ఎత్తుల్లోనే సీఎం విజయ్‌కు ప్రజ్ఞానంద చెక్ పెట్టాడు. నార్వే చెస్ టోర్నీలో అద్భుతమైన విజయం సాధించి విజేతగా నిలిచినందుకు ప్రజ్ఞానందను సీఎం విజయ్ అభినందించారు. అతడి ప్రదర్శనతో తమిళనాడు గర్విస్తోందని ఆయన పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వం తరపున రూ.50 లక్షల చెక్కును రివార్డుగా అందజేశారు. అనంతరం ప్రజ్ఞానంద మీడియాతో మాట్లాడాడు. ముఖ్యమంత్రి చదరంగ నైపుణ్యాలను చూసి తాను నిజంగా ఆశ్చర్యపోయానన్నాడు.

# 'నేను తప్పుకోవాలని కోరుకుంటున్నారా?' హర్మన్‌ప్రీత్




మహిళల టీ20 ప్రపంచకప్ జూన్ 12 నుంచి ప్రారంభం కానుంది. టోర్నీ ఆరంభానికి సమయం దగ్గరపడటంతో ప్రచార కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ఇటీవల అన్ని జట్ల కెప్టెన్లతో ఫొటోషూట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించగా భారత జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌ను విలేకరులు పలు ప్రశ్నలు అడిగారు. ఈ టీ20 ప్రపంచ కప్ మీకు చివరిది అవుతుందా అని ఓ రిపోర్టర్ హర్మన్‌ప్రీత్‌ను ప్రశ్నించారు. దీనికి ఆమె 'నేను తప్పుకోవాలని మీరు కోరుకుంటున్నారా'' అని ఎదురు ప్రశ్న వేశారు. 'మీ ప్రణాళికలు గురించి తెలుసుకునేందుకే ఈ ప్రశ్న అడిగా. టీ20 నుంచి వైదొలగడానికి సమయం రాలేదని మీరు భావిస్తున్నందుకు సంతోషిస్తున్నాను' అని విలేకరి సమాధానమిచ్చారు. అయినప్పటికీ హర్మన్‌ప్రీత్ తగ్గలేదు. 'మరి అలాంటప్పుడు ఈ ప్రశ్న ఎందుకు అడుగుతున్నారు' అంటూ అసహనం వ్యక్తం చేశారు. హర్మన్‌ప్రీత్ సారథ్యంలో గతేడాది జరిగిన వన్డే ప్రపంచకప్‌ను భారత్ సాధించడంతో ఈ టీ20 వరల్డ్ కప్‌లో టీమ్ఇండియాపై అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. బయటి నుంచి వచ్చే ఒత్తిడి గురించి ఎక్కువగా ఆలోచించకుండా ఉండటానికి ప్రయత్నిస్తానని హర్మన్‌ప్రీత్ పేర్కొన్నారు. ''విజయంతో (వన్డే వరల్డ్ కప్) సహజంగానే మరిన్ని అంచనాలు వస్తాయి. కానీ, మహిళల క్రికెట్‌కు ఇది సానుకూల సంకేతంగా నేను చూస్తున్నాను. మ్యాచ్‌ల విషయంలో ప్రజలు ఎంతో భావోద్వేగంతో ఉంటారు. వారు ఎప్పటికప్పుడూ మమ్మల్ని నిశితంగా పరిశీలిస్తారు. వ్యక్తిగతంగా నేను బయటినుంచి వచ్చే ఒత్తిడి గురించి ఆలోచించకుండా ఉండటానికి ప్రయత్నిస్తాను. సన్నద్ధత, జట్టుకు సహకారం అందించడం, వర్తమానంలో ఏం జరుగుతుంది అనే దానిపైనే నా దృష్టి ఉంటుంది. భారీ అంచనాలు ఎల్లప్పుడూ ఉంటాయి. ఇలాంటి సమయంలో బయటి విషయాలను పట్టించుకోకుండా నా ఆట పైనే ఫోకస్ ఉండేలా చూసుకోవాలి'' అని హర్మన్‌ప్రీత్ వివరించారు. టీ20 ప్రపంచకప్‌లో భారత్ తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్‌తో తలపడనుంది. ఎడ్జ్‌బాస్టన్‌లో జూన్ 14న ఈ దాయాదుల పోరు జరగనుంది.

# జర్మనీ స్టార్‌దే ఫ్రెంచ్ ఓపెన్

అలెగ్జాండర్ జ్వెరెవ్.. ఈ జర్మనీ ఆటగాడు పుష్కర కాలం నుంచి సర్క్యూట్‌లో ఉన్నాడు. ఫెదరర్, నాదల్, జకోవిచ్ లాంటి దిగ్గజాలను ఎదుర్కొన్నాడు. నాలుగుసార్లు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో ఫైనల్‌కు వెళ్లాడు. అయినా ఆఖరి మెట్టుపై తడబడ్డాడు. జ్వెరెవ్ మళ్లీ టైటిల్ పోరుకు అర్హత సాధించాడు. ఈసారి ఆటకు అనుభవాన్ని జోడించి.. కీలక సమయంలో ఒత్తిడికి నిలిచి ఫ్రెంచ్ ఓపెన్ రూపంలో తొలి టైటిల్‌ను ముద్దాడాడు. జ్వెరెవ్ అదరగొట్టాడు. చాలా కాలంగా స్థిరంగా ఆడుతున్నా గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో సత్తా చాటలేకపోతున్న ఈ జర్మనీ ఆటగాడు ఫ్రెంచ్ ఓపెన్ గెలిచి టైటిళ్ల కరువు తీర్చుకున్నాడు. ఆదివారం నాలుగు గంటలకు పైగా హోరాహోరీగా సాగిన పురుషుల సింగిల్స్ తుది పోరులో రెండో సీడ్ జ్వెరెవ్ 6–1, 4–6, 6–4, 6–7 (5–7), 6–1తో పదోసీడ్ ఫ్లావియో కొబోలి (ఇటలీ)పై విజయం సాధించాడు. తొలి సెట్లో జ్వెరెవ్ జోరు ప్రదర్శించాడు. బలమైన ఫోర్‌హ్యాండ్ షాట్లు, డ్రాప్ షాట్లతో చాలా తేలిగ్గా పాయింట్లు సాధించాడు. ప్రత్యర్థికి ఒక్క గేమ్ మాత్రమే కోల్పోయిన ఈ జర్మనీ స్టార్ తొలి సెట్ కైవసం చేసుకున్నాడు. కానీ రెండో సెట్లో కొబోలి పుంజుకున్నాడు. నియంత్రణతో కూడిన దూకుడును ప్రదర్శించిన ఈ ఇటలీ కుర్రాడు.. జ్వెరెవ్‌కు గట్టిపోటీ ఇచ్చాడు. ఏ దశలోనూ జ్వెరెవ్‌కు బ్రేక్ చేసే అవకాశం ఇవ్వని అతడు.. తొమ్మిదో గేమ్‌లో బ్రేక్ సాధించి 5–4తో ఆధిక్యంలో నిలిచాడు. అదే ఊపులో సెట్ గెలిచి మ్యాచ్‌లో నిలిచాడు. మూడో సెట్లోనూ గట్టిపోటీనే జరిగినా.. తొమ్మిదో గేమ్‌లో కొబోలి సర్వీస్ బ్రేక్ చేసిన జ్వెరెవ్.. ఆపై సెట్ గెలిచి మళ్లీ ఆధిక్యంలోకి వెళ్లాడు. నాలుగో సెట్లో ఒక దశలో జ్వెరెవ్ 3–1తో నిలవడంతో ఈ జర్మనీ స్టార్ ఇక సెట్‌తో పాటు మ్యాచ్ గెలుచుకుంటాడనిపించింది. అయితే కొబోలి పట్టు వదల్లేదు. 3–3తో స్కోరు సమం చేశాడు. ఇద్దరూ తగ్గకపోవడంతో సెట్ టైబ్రేకర్‌కు మళ్లింది. టైబ్రేకర్‌లో జ్వెరెవ్ ఒక దశలో 3–1తో ఆధిక్యంలో నిలిచినా.. కొబోలి అనూహ్యంగా పుంజుకున్నాడు. ఈ సెట్‌ను దక్కించుకుని మ్యాచ్‌ను అయిదో సెట్‌కు తీసుకెళ్లాడు. అక్కడ నుంచి కొబోలి అలిసిపోయినట్లు కనిపించగా.. ఇలాంటి ఒత్తిడి మ్యాచ్‌లు ఎన్నో ఆడిన జ్వెరెవ్ కీలక సమయంలో దూకుడు ప్రదర్శించాడు. నిర్ణయాత్మక అయిదో సెట్లో విజృంభించిన ఈ జర్మనీ స్టార్ 4–0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. అదే జోరుతో సెట్‌తో పాటు టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు.



# సూర్యకుమార్ ముంబయి ఇండియన్స్‌కు గుడ్ బై చెబుతాడా?

టీమ్ఇండియా ఆటగాడు సూర్యకుమార్ యాదవ్‌కు ప్రస్తుతం కష్టకాలం నడుస్తోంది. కొంత కాలంగా పేలవఫామ్‌తో సతమతమవుతున్న అతడిని భారత టీ20 కెప్టెన్‌గా తొలగించడమే కాకుండా జట్టులోకి కూడా తీసుకోలేదు. యువ ఆటగాళ్ల నుంచి పోటీ ఎక్కువకావడంతో అతను తిరిగి జట్టులో చోటు దక్కించుకోవాలంటే చాలా కష్టపడాలి. ఈ క్రమంలో అతని గురించి మరో వార్త బయటికొచ్చింది. సూర్యకుమార్ యాదవ్ ఐపీఎల్‌లో ముంబయి ఇండియన్స్‌కు గుడ్ బై చెప్పే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. చాలాకాలంగా ఆ జట్టుకు కీలక ఆటగాడిగా ఉన్న సూర్య.. గత సీజన్‌లో తీవ్రంగా నిరాశపర్చాడు. అతను 270 పరుగులు మాత్రమే చేశాడు. పైగా ముంబయి ఇండియన్స్ కూడా కొన్నాళ్లుగా తమస్థాయికి తగ్గ ప్రదర్శన చేయట్లేదు. దీంతో వచ్చే ఏడాది ఆ ఫ్రాంచైజీ జట్టులో భారీ మార్పులు చేసే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యం లో సూర్యకుమార్ ముంబయి ఇండి యన్స్‌కు గుడ్ బై చెబుతాడనే ప్రచారం మొదలైంది. అతను ఇన్‌స్టాగ్రామ్‌లో ముంబయిని ఫాలో కాకపోవడం ఇందుకు మరింత బలం చేకూరుస్తోంది. సూర్య తన ఇన్‌స్టా ఖాతాలో ఆ ఫ్రాంచైజీకి సంబంధించిన 100కి పైగా పోస్టులను డిలీట్ చేశాడు. అతని ప్రొఫైల్‌లో ఇటీవల ముంబయి ఇండియన్స్‌కు సంబంధించిన ఒక్క ఫొటో మాత్రమే ఉంది. రోహిత్ శర్మ, ధోనీతో కలిసి దిగిన చిత్రమది. దీంతో సూర్య ముంబయికి గుడ్ బై చెబుతాడన్న ప్రచారం ఊపందుకుంది.



## మానవ్ సుతార్‌కు ఆరు వికెట్లు.. అఫ్గాన్ 152 ఆలౌట్




భారత్‌తో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో అఫ్గానిస్థాన్ తక్కువ స్కోరుకే కుప్పకూలింది. 113/5తో మూడో రోజు ఆటను మొదలుపెట్టిన అఫ్గాన్ 152 పరుగులకే ఆలౌటైంది. దీంతో భారత్‌కు 412 పరుగుల ఆధిక్యం లభించింది. అఫ్గాన్ బ్యాటర్లలో రహ్మత్ షా (60; 135 బంతుల్లో) అర్ధ శతకం చేశాడు. టెస్టుల్లో భారత్‌పై అర్ధ శతకం చేసిన తొలి అఫ్గాన్ క్రికెటర్‌గా ఇతను ఘనత సాధించాడు. మిగతా బ్యాటర్లు తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. అరంగేట్ర స్పిన్నర్ మానవ్ సుతార్ (6/33) సత్తా చాటాడు. ప్రసిద్ధ్ కృష్ణ 3, వాషింగ్టన్ సుందర్ ఓ వికెట్ పడగొట్టారు. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో భారత్ 564/8 వద్ద డిక్లేర్ చేసింది.

ఈ ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు సాధించిన సుతార్ ఓ ఘనత సాధించాడు. టెస్టుల్లో తొలి ఇన్నింగ్స్‌లోనే 5 వికెట్లు సాధించిన రెండో భారత బౌలర్‌గా సుతార్ నిలిచాడు. అంతకుముందు 2008లో అమిత్ మిశ్రా ఆస్ట్రేలియాపై (5/71) ఈ ఫీట్ అందుకున్నాడు. భారీ ఆధిక్యం సంపాదించిన టీమ్ఇండియా.. అఫ్గాన్‌ను ఫాలోఆన్ ఆడిస్తోంది. లంచ్ బ్రేక్ సమయానికి ఫాలోఆన్‌లో అఫ్గాన్ 18/0 స్కోరుతో చేసింది. సెధిఖుల్లా అటల్ (16★), అబ్దుల్ మాలిక్ (2★) క్రీజులో ఉన్నారు.

వుదయం సినిమా MOVIE TIME!



## 'స్లమ్‌డాగ్'లో ఆమె నటన.. కంటతడి పెట్టించింది: పూరి జగన్నాథ్

వుదయం సినిమా కోలీవుడ్ నటుడు విజయ్ సేతుపతి హీరోగా టాలీవుడ్ దర్శకుడు పూరి జగన్నాథ్ తెరకెక్కించిన చిత్రం 'స్లమ్‌డాగ్' . సంయుక్త, టబు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్‌ను చెన్నైలో సోమవారం నిర్వహించారు. పూరి జగన్నాథ్ మాట్లాడుతూ.. ''స్లమ్‌డాగ్.. నా తొలి తమిళ సినిమా. విజయ్ సేతుపతి సింప్లిసిటీ నాకు ఇష్టం. రోజూ సెట్‌కు కొత్త నటుడిగానే వస్తారు. ఎంత వెతికినా ఆయన నటనలో కొంచెం కూడా అహంకారం కనిపించదు. ఈ సినిమాలో ఆయన కొత్తగా కనిపిస్తారు. పవర్‌ఫుల్‌గా ఉంటారు. సంయుక్త చాలా చలాకీ. బ్యాడ్‌గాయ్ రోల్ చేయమని దునియా విజయ్‌ను కోరా. పెర్ఫామెన్స్‌తో అదరగొట్టారు. జరీనా వహాబ్ తల్లి పాత్ర పోషించారు.

# 'పెద్ది' థ్యాంక్ యూ మీట్




వుదయం: మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ లేటెస్ట్ సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ 'పెద్ది'. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మిం చారు. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులు, విమర్శకుల ప్రశంసలు అందుకుని రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్లతో సంచలన విజయాన్ని సాధించింది. అన్ని ప్రాంతాల్లో హౌస్‌ఫుల్ కలెక్షన్లతో విజయవంతంగా ప్రదర్శితమౌతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం 'థాంక్ యూ' ప్రెస్ మీట్‌ను నిర్వహించింది.మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మాట్లాడుతూ... ప్రేక్షకులు, అభిమానులు, మీడియా మిత్రులు అందరికీ మనస్ఫూర్తిగా థ్యాంక్స్ చెప్పడానికి ఇక్కడికి వచ్చాను. ఇష్టపడి, ప్రేమిస్తూ ఒక పని చేస్తూ ఇంకా చెప్పాలంటే నాకు తెలిసిన పని చేస్తూ ఇంత ప్రేమను పొందడం సర్ప్రైజింగ్ గా వుంది. ఇది ఎవరో పుష్ చేస్తే చేసిన సినిమా కాదు. బుచ్చిబాబు చెప్పిన కథను నమ్మి ఈ సినిమా చేసినందుకు నాకు ఎంతో సంతృప్తిగా ఉంది.

# విజయ్ ఆంటోని 'వంద దేవుళ్ళు' ట్రైలర్ రిలీజ్

వుదయం: విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పోరేషన్, ఫాతిమా విజయ్ ఆంటోనీ సమర్పణలో.. సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్ మీద రామంజనేయులు జవ్వాజి నిర్మించిన చిత్రం 'వంద దేవుళ్ళు'. ఈ మూవీని జూన్ 19న విడుదల చేయబోతోన్నారు. ఈ సినిమాలో విజయ్ ఆంటోని, స్వాసిక, అజయ్, కావ్య, శక్తి, పదిని, కర్నాస్, బాలాజీ శక్తివేల్, దివాకర్, అరుళ్ దాస్, బక్స్, వినోదిని, మునిష్ కాంత్, కొడంగి వడివేలు తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన గ్లింప్స్, టీజర్, పాటలు, పోస్టర్లు ఆడియెన్స్‌లో అంచనాల్ని పెంచేశాయి. తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను మెగా ప్రొడ్యూసర్ నిహారిక కొణిదెల సోషల్ మీడియా వేదికగా రిలీజ్ చేశారు. 'ఈ లోకంలో ప్రాణాలతో పుట్టిన అందరికీ కనీస అవసరాలుంటాయి.. తినడం, నిద్రపోవడం, తోడు వెతుక్కోవడం' అనే డైలాగ్‌తో ట్రైలర్ ప్రారంభమైంది. ఆ తరువాత వచ్చిన హీరో, హీరోయిన్ల ప్రేమ సన్నివేశాలు ఎంతో రిఫ్రెషింగ్‌గా అనిపించాయి. ఇక ఈ కథలో భార్యాభర్తల బంధం, తల్లీకొడుకుల అనుబంధాన్ని గొప్పగా చూపించినట్టు కనిపిస్తోంది. అన్ని రకాల ఎలిమెంట్స్‌ను జోడించిన ఈ కథను అద్భుతంగా మలిచినట్టు అనిపిస్తోంది. యాక్షన్స్, విజువల్స్, బీజీఎం ఇలా అన్నీ కూడా ట్రైలర్‌లో హైలెట్ అవుతున్నాయి. నిహారిక కొణిదెల ట్రైలర్ పై, ''వంద దేవుళ్ళు' ట్రైలర్ రిలీజ్ చేయడం ఆనందంగా ఉంది. స్వాసిక గారు అద్భుతంగా కనిపిస్తున్నారు. పాత్రకు న్యాయం చేసినట్టుగా అనిపిస్తోంది.



# 'ఐ యామ్ హ్యాండ్సమ్' ట్రైలర్ లాంచ్ & ప్రీ-రిలీజ్ ఈవెంట్



వుదయం:తండ్రి–కొడుకుల అనుబంధం, త్యాగం, ప్రేమ, భావోద్వేగాల నేపథ్యంలో రూపొందిన హృదయాన్ని హత్తుకునే చిత్రం 'ఐ యామ్ హ్యాండ్సమ్' (Since 2009). దుర్గా దేవ్ నాయుడు హీరోగా నటిస్తూ స్వయంగా కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు నిర్వహించిన ఈ చిత్రాన్ని K ఫిలిమ్స్ బ్యానర్ పై, మహేష్ గుడారు సమర్పణలో కేదార్‌నాథ్ నిర్మించారు. అన్విష కథానాయికగా నటించిన ఈ చిత్రం జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో చిత్ర ట్రైలర్ లాంచ్, ప్రీ–రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నిర్మాత కేఎల్ దామోదర్ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై చిత్ర బృందాన్ని అభినందించారు.ముఖ్య అతిథి కేఎల్ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ, "సినిమా విజయానికి అసలు బలం కంటెంట్. మంచి కథ, బలమైన భావోద్వేగాలు ఉన్న సినిమాలు ప్రేక్షకుల గుండెల్లో నిలిచిపోతాయి. దుర్గా దేవ్ నాయుడు నటుడిగా, దర్శకుడిగా ఒకేసారి బాధ్యతలు నిర్వర్తిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కించడం అభినందనీయం. ఆయనలో ఉన్న ప్రతిభ ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్తుంది. సినీ పరిశ్రమలో టాలెంట్‌కు ఎప్పుడూ గుర్తింపు ఉంటుంది. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అన్నారు.దర్శకుడు, హీరో దుర్గా దేవ్ నాయుడు మాట్లాడుతూ, "నేను ఏలూరుకు చెందినవాడిని. మా నాన్న అరటి పండ్ల వ్యాపారి. చిన్న పట్టణం నుంచి వచ్చి ఈ రోజు ఇక్కడ నిలబడటం నాకు ఎంతో ఆనందంగా ఉంది.

# 'జంగా' నుంచి మోషన్ పోస్టర్ విడుదల

వుదయం: శ్రీమతి వనిత కిలారి సమర్పణలో ఆర్‌కె ఫిల్మ్ ఫ్యాక్టరీ బ్యానర్ మీద రమ్య కిలారి, జయచంద్ర నాయుడు కిలారి నిర్మిస్తున్న చిత్రం 'జంగా'. త్రిగుణ్, నేహా పఠాన్, వరలక్ష్మీ శరత్ కుమార్, శ్రావణ్, మధునందన్ , గగన్ విహారి, చందు గౌడ,సమీర్, నాగ మహేష్,భూపాల్,రఘు కారుమంచి, రచ్చ రవి, ప్రధాన పాత్రల్లో రాబోతోన్న ఈ మూవీకి కెవిన్ గడ్డం(శ్రీహరి) కథ, స్క్రీన్ ప్లే అందిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. త్రిగుణ్ పుట్టిన రోజు సందర్భంగా చిత్రయూనిట్ స్పెషల్ అప్డేట్‌ను ఇచ్చారు.త్రిగుణ్ బర్త్ డే స్పెషల్‌గా 'జంగా' నుంచి పోస్టర్ & మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఇందులోని విజువల్స్, సౌండింగ్, హీరో లుక్ చాలా కొత్తగా ఉన్నాయి. ఇంత వరకు లవర్ బాయ్‌లా కనిపించిన త్రిగుణ్ ఈ సారి రా అండ్ రస్టిక్ లుక్‌లో మాసీగా కనిపిస్తున్నారు. కెరీర్‌లోనే డిఫరెంట్ సబ్జెక్ట్, పాత్రని పోషిస్తున్నట్టుగా అనిపిస్తోంది. ప్రస్తుతం ఈ మూవీకి సంబంధించిన షూటింగ్ చివరి దశలో ఉంది. మున్ముందు మరిన్ని అప్డేట్‌లతో ఆడియెన్స్‌ని ఆకట్టుకోనున్నారు.ఈ సినిమాకి కృష్ణ సౌరభ్ సంగీతాన్ని అందిస్తుండగా.. వెంకట్ సి. దిలీప్ కెమెరామెన్‌గా పని చేస్తున్నారు. ప్రసాద్ వర్మ, ప్రేమ్ రాజ్ మాటలు రాయగా.. కాసర్ల శ్యాం, పూర్ణాచారి, కళ్యాణ్ చక్రవర్తి పాటల్ని రాస్తున్నారు. ప్రవీణ్ పూడి ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నారు. నటీనటులు : త్రిగుణ్, నేహా పఠాన్, వరలక్ష్మీ శరత్ కుమార్, శ్రావణ్, మధునందన్ , గగన్ విహారి, చందు గౌడ.



# 'భోళా బాలయ్య' సాంగ్ లాంచ్ ఈవెంట్

వుదయం: భోళా బాలయ్య సాంగ్ లాంచ్ ఈవెంట్ లో డైరెక్టర్ బోయపాటి శ్రీను మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. బాలయ్య గారు ఏంటనేది నేను నా సినిమాల ద్వారా చెప్పాను. ఈ సాంగ్ గురించి చెప్పాలంటే, పాట చాలా అద్భుతంగా వచ్చింది. మ్యూజిక్, లిరిక్స్, డ్యాన్స్, ఆర్టిస్టులు, అలాగే ఈ సాంగ్‌ను రూపొందించిన జగన్‌తో సహా అందరూ అద్భుతంగా కుదిరారు. ముఖ్యంగా విజువల్స్ అయితే చాలా గొప్పగా ఉన్నాయి. బాలయ్య గారి చిన్నప్పటి ఫొటోల నుంచి ఇప్పటివరకు ఉన్న విజువల్స్‌ను చూస్తుంటే, పాట కంటే ఆ విజువల్స్‌తోనే ప్రేక్షకులు మరింత మమేకమైపోతారు. ఈ సాంగ్ చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు. జగన్ చాలా మంచి టీమ్‌ను ఎంపిక చేసుకున్నాడు. అతని కృషికి తప్పకుండా తగిన ఫలితం ఉంటుంది. బాలయ్య బాబుగారికి అడ్వాన్స్ హ్యాపీ బర్త్‌డే శుభాకాంక్షలు. ఈ పాటను లాంచ్ చేసే అవకాశం ఇచ్చిన అభిమానులందరికీ థ్యాంక్యూ వెరీ మచ్. బాలయ్య బాబుగారు ఎప్పుడూ ఇలాంటి అద్భుతమైన ఎనర్జీతో ముందుకు సాగాలని కోరుకుంటున్నాను. ఏ క్యాలెండర్‌లోనూ లేని పండుగ, అభిమానుల గుండెల్లో మాత్రమే ఉండే పండుగ బాలయ్య బాబుగారి పుట్టినరోజు. ప్రతి సంవత్సరం అభిమానులు ఆయన పుట్టినరోజును ఒక వేడుకలా జరుపుకుంటారు. ప్రతి ఏడాది అంతకుమించి చేస్తున్నారు. బాలకృష్ణ గారు కూడా అభిమానులను ఎప్పుడూ గుండెల్లో పెట్టుకుంటారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్ చూస్తుంటే ఇది ఒక ప్రీ రిలీజ్ ఈవెంట్‌లా అనిపిస్తోంది. అభిమాన హీరో ఆనందంగా ఉండాలని, ప్రేమతో ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నారు. అభిమానుల దీవెనలు ఎప్పుడూ ఆయనతోనే ఉంటాయి. బాలయ్య గారికి ఇష్టమైన పని కష్టపడటం. ఆయనకు ఇష్టమైనది సేవ.




# జూన్ 12న థియేటర్‌లలో 'కొత్త మలుపు'

వుదయం: ప్రముఖ గాయని సునీత కుమారుడు ఆకాష్ గోపరాజు హీరోగా నటించిన రెండో చిత్రం 'కొత్త మలుపు'. దర్శకుడు శివ వర ప్రసాద్ కేశనకుర్తి తెరకెక్కించిన ఈ చిత్రం జూన్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. కోనసీమ నేపథ్యంలో రూపొందిన ఈ



రొమాంటిక్ లవ్ అండ్ సస్పెన్స్ ఎంటర్‌టైనర్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఈ సందర్భంగా చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా హీరో ఆకాష్ మీడియా ప్రతినిధులతో ముచ్చటించారు. సినిమా విశేషాలు, తన పాత్ర, సింగర్ సునీత సపోర్ట్, కెరీర్ గురించి పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు.

**మీ తొలి చిత్రం 'సర్కారు నౌకరి'తో పోలిస్తే 'కొత్త మలుపు' ఎలా భిన్నంగా ఉంటుంది?**

ఆకాష్: 'సర్కారు నౌకరి' ఒక పీరియడ్ డ్రామా అయితే, 'కొత్త మలుపు' పూర్తిగా భిన్నమైన జానర్‌లో రూపొందింది. ఇది కోనసీమ బ్యాక్‌డ్రాప్‌లో సాగే విలేజ్ రొమాంటిక్ లవ్ అండ్ సస్పెన్స్ ఎంటర్‌టైనర్. లవ్, కామెడీ, ఎమోషన్స్‌తో పాటు కథను ముందుకు నడిపే ఆసక్తికరమైన సస్పెన్స్ కూడా ఉంటుంది.

**సినిమాలో మీ పాత్ర ఎలా ఉండబోతోంది?**

ఆకాష్: ఈ సినిమాలో నా పాత్ర చాలా ఎనర్జిటిక్‌గా ఉంటుంది. నేటి యువత ఆలోచనలు, వారి భావోద్వేగాలకు దగ్గరగా ఉండే పాత్ర ఇది. నటన పరంగా కూడా మొదటి సినిమాతో పోలిస్తే మరింత మెరుగ్గా కనిపించేందుకు ప్రయత్నించాను.

**ఈ కథలో మిమ్మల్ని ఎక్కువగా ఆకట్టుకున్న అంశం ఏది?**

ఆకాష్: దర్శకుడు శివ వరప్రసాద్ గారు కథ చెప్పినప్పుడు అందులోని ట్విస్టులు నన్ను బాగా ఆకట్టుకున్నాయి.

**మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ మద్దతు లభించడం ఎంతవరకు ఉపయోగపడింది?**

ఆకాష్: మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ మా సినిమాకు చాలా పెద్ద బలం. ఇలాంటి దిగ్గజ సంస్థ మా సినిమాను విడుదల చేయడం వల్ల ప్రేక్షకుల్లో మరింత నమ్మకం పెరిగింది.

**హీరోయిన్ భైరవి అర్ధ్యాతో మీ కెమిస్ట్రీ గురించి చెప్పండి?**

ఆకాష్: సినిమాలో మేమిద్దరం బావ–మరదళ్లుగా కనిపిస్తాం. పల్లెటూరి నేపథ్యంలో సాగే మా పాత్రల మధ్య వచ్చే ప్రేమ, సరదా గొడవలు, ఫన్నీ సన్నివేశాలు ప్రేక్షకులను బాగా అలరిస్తాయి.

**సినిమా చూసిన తర్వాత మీ అమ్మ సునీత గారి స్పందన ఎలా ఉంది?**

ఆకాష్: అమ్మ సినిమా చూసి చాలా సంతోషించింది. సినిమా అవుట్‌పుట్ చాలా బాగుందని, ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుందని చెప్పింది. నా కెరీర్ విషయంలో కథల ఎంపికలో నాకు పూర్తి స్వేచ్ఛ ఇస్తుంది.

Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-3-95,Padmashali Street, Karimnagar-505001 Telangana. Editor : Sirikonda Augustin, RNI No. TELTEL/2013/65079, E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.